సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 68
మంగళవారం 30-5-2023




'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





ప్రజా సంక్షేమపాలన
జగనన్న సుపరిపాలన
4
మా నమ్మకం నువ్వే జగన్
కాల్ 82960 82960
సహస్రవృత్తుల, సమస్త జన జీవితాలను సంక్షేమ పథకాల ద్వారా
అర్హులందరి ఇంటా సంక్షేమం పూలు పూయించి,
నాలుగేళ్ళలో అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా
సుపరిపాలన సాగిస్తున్న
జగనన్నకు జేజేలు...
"చదువులే పిల్లలకు మనం
ఇవ్వగలిగే ఆస్తి.
చదువులకు చేసే ఖర్చంతా,
రాష్ట్రంలోని పిల్లల భవిష్యత్తుకు
పెట్టుబడే అని బలంగా
విశ్వసిస్తున్నాను."
- ముఖ్యమంత్రి
భవిష్యత్తు తరాలకు మనం
ఇవ్వగలిగే ఆస్తి విద్య మాత్రమే...
నాడు - నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల రూపు రేఖలు మార్చి
విద్యా వ్యవస్థలో జగనన్న తీసుకొచ్చిన అనేక నూతన ఆవిష్కరణలు,
కార్పొరేట్ స్థాయి దాటి విద్యార్థులకు కల్పించిన సదుపాయాలు..
విద్యా విధానంలో తీసుకొచ్చిన అనేక మార్పుల ఫలితం
ఇటీవల విడుదలైన పదవ తరగతి ఉత్తీర్ణతలో ఆవిష్కృతం ..
భవిష్యత్తులో
మరిన్ని అద్భుతాలు
చూడబోతున్నాం ...
విద్యావ్యవస్థలో జగనన్న
తీసుకువచ్చిన సమూల మార్పుల
ఫలితంగా.. గ్రామీణ, మున్సిపల్ పాఠశాలల్లో
చదివిన సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు
చెందిన విద్యార్థులు మంచి ప్రణాళికతో చదివి
అత్యధికంగా 85% మార్కులతో స్టేట్ ర్యాంక్స్
సాధించి జగనన్న నమ్మకాన్ని నిలబెట్టిన
మీ అందరికీ మా శుభాశీస్సులు...
వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి
రాజ్యసభ సభ్యులు
నెల్లూరు జిల్లా వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు
శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి
తితిదే బోర్డు మెంబర్

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 68
మంగళవారం 30-5-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'



చిందేసిన చెన్నై సూపర్ కింగ్స్

ఐదోసారి ఐపీఎల్ ట్రోఫీ కైవసం


- 12లో



బ్యాంకుల ప్రైవేటీకరణ ఆగదు

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తామన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల

- 13లో



సీవీసీగా శ్రీవాస్తవ

సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా ప్రవీణ్‌కుమార్ శ్రీవాస్తవ నియమితులయ్యారు. సోమవారం ఉదయం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

వివరాలు 8లో ▶



మధ్యప్రదేశ్‌లో అధికారం మాదే

మధ్యప్రదేశ్ ఎన్నికల్లో 150 స్థానాల్లో గెలిచి అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ధీమా వ్యక్తం చేశారు.

వివరాలు 8లో ▶



తుర్కియే అధ్యక్షుడిగా మళ్లీ ఎర్డోగన్

రెండో రౌండ్ పోలింగ్ అనంతరం రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ తుర్కియే అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికయ్యారు.

వివరాలు 8లో ▶



మైసూరులో ఘోర ప్రమాదం

మైసూరులోని కురుబూరు వద్ద ప్రైవేట్ బస్సు, కారు ఢీకొనడంతో 10 మంది దుర్మరణం చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు.

వివరాలు 8లో ▶



షార్‌లోని ప్రయోగవేదిక నుంచి నిప్పులు చిమ్ముతూ దూసుకెళ్తున్న రాకెట్

జీఎస్ఎల్‌వీ ప్రయోగం సక్సెస్

విజయవంతంగా కక్ష్యలోకి నావిక్-01 ఉపగ్రహం

దేశీయ నావిగేషన్ వ్యవస్థ బలోపేతం దిశగా మరో ముందడుగు

ఇస్రో శాస్త్రవేత్తలకు గవర్నర్ నజీర్, సీఎం జగన్ అభినందనలు

- వివరాలు 2,8లో

4 వసంతాల నవచరిత

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పగ్గాలు చేపట్టి నేటికి నాలుగేళ్లు

సంక్షేమాభివృద్ధి పథంలో రాష్ట్రం పరుగులు

ముప్పై ఎనిమిది వేల స్కూళ్లు తమ రూపాన్ని మార్చుకున్నాయి. సకల సదుపాయాలతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారయ్యాయి. గ్రామాల్లో రైతులకు భరోసానిచ్చేందుకు... ఏకంగా 10,778 ఆర్బీకేలు ఏర్పాటయ్యాయి. అవినీతికి తావులేని పౌర సేవల్ని ఏ ఊరికి ఆ ఊళ్లోనే అందించడానికి 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు రూపుదిద్దుకున్నాయి. వీటిల్లో కొత్తగా 1.34 లక్షల మంది యువత ప్రభుత్వోద్యోగులుగా చేరారు. ఇక ప్రభుత్వ సేవల్ని ఇంటింటికీ నేరుగా అందించడానికి 2.65 లక్షల మందితో వలంటీర్ల సైన్యం వచ్చింది. వైద్యుల్లేరనే మాటకు తావులేకుండా 10,592 గ్రామ, పట్టణ హెల్త్ క్లినిక్‌లు సేవలందిస్తున్నాయి.



వైఎస్ జగన్ సీఎంగా పగ్గాలు చేపట్టి నేటితో నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిపై కథనాలు..

- రైతుకు అసలైన భరోసా
- అట్టడుగు వర్గాల ముందడుగు
- ఇచ్చిన మాటే లక్ష్యంగా సుపరిపాలన
- ఆరోగ్యానికి బలం
- వస్తున్నారు టాపర్లు

- ప్రత్యేక సంచికలో..

వీటి ఫలితమేంటో తెలుసా..?

➤ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారైన ప్రభుత్వ స్కూళ్లకు పిల్లలు ఇష్టంగా వెళుతున్నారు. రుచికరమైన భోజనం.. స్కూళ్లు తెరవక ముందే చేతికందే పుస్తకాలు, యూనిఫామ్.. ఇంగ్లీషు విద్య.. ఎడ్యుటెక్ కంటెంట్‌తో అందే ట్యాబ్‌లు... ఏపీ పిల్లల్ని ర్యాంకర్లను చేస్తున్నాయి. విత్తనాల కోసం, ఎరువుల కోసం రోడ్డెక్కాల్సిన అవసరం లేకుండా రైతుల్ని ఆర్బీకేలు చేయిపట్టి నడిపిస్తున్నాయి. విత్తు మొదలు పంట విక్రయం దాకా అన్ని సేవలూ అక్కడే. హెల్త్ క్లినిక్‌లోని ఫ్యామిలీ డాక్టర్... ఊళ్లలో మంచానపడ్డ వారికి ఇంటికెళ్లి చికిత్స చేస్తున్నాడు. గ్రామ సచివాలయాల్లోనే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయి. అవ్వాతాతలకు వలంటీర్లు ఠంచనుగా పింఛన్‌ను తెచ్చి చేతిలో పెడుతున్నారు.

➤ పేదలకు రేషన్ సరుకులూ ఇంటి ముంగిటకే వస్తున్నాయి. దీనికోసం 9,260 డెలివరీ వ్యాన్‌లు పనిచేస్తున్నాయి. కాకపోతే... ఇవన్నీ సాధ్యమయింది కేవలం నాలుగేళ్లలో. 2019 మే 30న సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేసిన తరవాత!!.

➤ అందుకే ఇప్పుడు ఏపీ ఒక రోల్ మోడల్. సీఎంగా వైఎస్ జగన్ అమల్లోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థ నుంచి ఆర్బీకే, రేషన్ డోర్‌డెలివరీ, వలంటీర్ వ్యవస్థ... ఇలా అన్నిటినీ ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేశాయి. కొన్ని అమలు చేస్తున్నాయి కూడా!.

➤ 'నిన్నటికన్నా నేడు బాగుంటే.. అదే అభివృద్ధి. ఊరైనా... మనుషులైనా' అనేది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విధానం. ఈ సూత్రంతోనే ఆయన ప్రచారానికి విలువివ్వకుండా పని చేస్తూ పోతున్నారు. సొంతింటికి నోచుకోని 31 లక్షల కుటుంబాల్లో... మహిళలకు 'పట్టా'భిషేకం చేశారాయన. వారికి

మిగతా 2వ పేజీలో ▶

రూ. లక్షన్నర కోట్ల ఎగుమతులు



- తొలిసారిగా సాధించిన ఆంధ్రప్రదేశ్
- నాలుగేళ్లల్లో రూ.55 వేల కోట్లు పెరుగుదల
- అత్యధికంగా విశాఖ నుంచి రూ.48,609 కోట్లు.. మొత్తం ఎగుమతుల్లో మన వాటా 4.41%
- 2030 నాటికి 10 శాతం వాటా లక్ష్యంగా పోర్టుల నిర్మాణం
- ఏకకాలంలో నాలుగు పోర్టులు.. 10 ఫిషింగ్ హార్బర్లు

10 లో



కేజీబీవీల్లో 1,358 పోస్టుల భర్తీకి చర్యలు

- 846 పీజీటీ, 374 సీఆర్టీ పోస్టులు
- 92 ప్రిన్సిపాల్, 46 పీఈటీలు కూడా..
- ప్రతిభ ఆధారంగా ఎంపిక
- మహిళలే అర్హులు.. నేటి నుంచి జూన్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

2 లో



డర్టీ బాబు.. టిష్యూ మేనిఫెస్టో

డర్టీ చంద్రబాబు.. మహానాడు వేదికపై ఒక టిష్యూ మేనిఫెస్టోను విడుదల చేశారు. అది కూడా కొట్టేసిందే. 2014 మేనిఫెస్టోలో 650 హామీలిచ్చిన చంద్రబాబు.. వాటిలో పట్టుమని పది కూడా నెరవేర్చలేదు.

\- మంత్రి జోగి రమేశ్

2 లో

చెప్పుకోవడానికి బాబుకు ఏముంది?



అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదు. 2014లో ఇచ్చిన హామీల్లో బాబు ఒక్కటైనా అమలు చేశారా? కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పే పోటీ పెడితే చంద్రబాబుదే విజయం.

\- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల

10లో

బాబూ.. మేనిఫెస్టోలపై ఎక్కడ చర్చిద్దాం?



చంద్రబాబు నీ మేనిఫెస్టోలు తీసుకురా. వైఎస్ జగన్, వైఎస్సార్ విడుదల చేసిన మేనిఫెస్టోలు మేము తీసుకొస్తాం. వాటిపై ఎక్కడైనా చర్చకు సిద్ధం.

\- మాజీ మంత్రి కొడాలి నాని

2లో

ఇస్రోకు గవర్నర్ అభినందనలు

సాక్షి, అమరావతి: జీఎస్ఎల్వీ-ఎఫ్ 12 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభినందించారు. నేవిగేషన్ అవసరాల కోసం రూపొందించిన ఈ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడం ద్వారా ఇస్రో అంతరిక్ష పరిశోధన రంగంలో మరో మైలురాయిని అధిగమించిందని గవర్నర్ ప్రశంసించినట్లు రాజ్‌భవన్ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

ఇస్రో మరిన్ని విజయాలు అందుకోవాలి: సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: స్వదేశీ నావిగేషన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ఎన్వీఎస్1 శాటిలైట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఇస్రో బృందాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. దేశం యొక్క నావిగేషన్ సామర్థ్యాలను ప్రోత్సహిస్తూ నెక్స్ట్ జనరేషన్ శాటిలైట్ ఎన్వీఎస్ 1ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలకు సీఎం జగన్ అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలంటూ ముఖ్యమంత్రి జగన్ ఆకాంక్షను వ్యక్తం చేశారు.

నేడు విజయవాడలో సీఎం జగన్ పర్యటన



సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విజయవాడలో పర్యటించనున్నారు. తాడేపల్లిలోని నివాసం నుంచి ఉదయం 10 గంటలకు బయల్దేరి 10:10 గంటలకు విజయవాడ బందరు రోడ్డులోని రాఘవయ్య పార్క్ వద్ద గల మిషనరీస్ ఆఫ్ చారిటీ 'నిర్మల్ హృదయ్ భవన్'కు సీఎం చేరుకుంటారు. 10:40 గంటల వరకూ నిర్మల్ హృదయ్ భవన్‌ను సందర్శించి, అనాథ పిల్లలతో ముచ్చటిస్తారు. అనంతరం తిరిగి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

జూన్ 7న కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జూన్ 7వ తేదీ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుంది. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లోని రాష్ట్ర మంత్రివర్గ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరిగే కేబినెట్ సమావేశానికి తీసుకెళ్లాల్సిన ప్రతిపాదనలను జూన్ 5వ తేదీ మధ్యాహ్నంలోగా సాధారణ పరిపాలనశాఖ (కేబినెట్ విభాగం)కు పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి సోమవారం అన్ని శాఖలను ఆదేశించారు.

పొదుపు సంఘాలకు పండగే..

- ఈ ఏడాది కూడా మరో రూ.30వేల కోట్లకు పైగా రుణం
- 2023–24 రుణ ప్రణాళికను సిద్ధంచేసిన సెర్ప్
- తీసుకునే రుణం ఆదాయ మార్గాల్లోనే పెట్టుబడి పెట్టేలా చర్యలు
- 'ఆర్థిక అక్షరాస్యత'పై ఆ మహిళలకు గ్రామస్థాయిలోనే శిక్షణ
- వ్యక్తిగత ప్రభుత్వ సబ్సిడీ రుణాలకు వీటిని అనుసంధానం చేసేలా కసరత్తు
- ఇప్పటికే జగన్ సర్కార్‌లో గత నాలుగేళ్లలో రూ.1.14 లక్షల కోట్ల రుణ పంపిణీ



కుదేలైన వ్యవస్థకు జగన్ ఊపిరి..

ఇక చంద్రబాబు ప్రభుత్వం డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక పైసా కూడా మాఫీ చేయకుండా మోసం చేయడంతో రాష్ట్రంలో కుదేలైన పొదుపు సంఘాల వ్యవస్థకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఆసరా, సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా ఊపిరిపోశారు. దీంతో పొదుపు మహిళలు రికార్డు స్థాయిలో 99.55 శాతం మేర బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లిస్తూ వస్తున్నారు. దీంతో బ్యాంకులు కూడా పొదుపు సంఘాల మహిళలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్నాయని సెర్ప్ అధికారులు వెల్లడించారు.

సాక్షి, అమరావతి : గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతున్న మహిళలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా బ్యాంకుల ద్వారా మరో రూ.30,686.49 కోట్ల రుణాలు కొత్తగా ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) 2023–24 ఆర్థిక సంవత్సరపు రుణ ప్రణాళికను సిద్ధంచేసుకుంది. రాష్ట్రంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత గత నాలుగేళ్ల కాలంలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో రూ.1,14,968.03 కోట్ల రుణాలను గతంలో కన్నా చాలా తక్కువ వడ్డీకే ఈ మహిళలకు ఇప్పించింది. ఈ ఏడాది కూడా గ్రామీణ ప్రాంతాల్లో 30.68 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్న సంఘాలకు రూ.30,686.49 కోట్ల మేర రుణాలు ఇప్పించేందుకు సెర్ప్ కార్యాచరణను సిద్ధంచేసింది. ఈ మేరకు జిల్లా, మండల, గ్రామస్థాయి సిబ్బందికి సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ ఆదేశాలిచ్చారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన..

ఈ నేపథ్యంలో.. పొదుపు మహిళలకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలిచ్చేందుకు ముందుకొస్తుండగా అదే సమయంలో ఈ వ్యవస్థపై గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన పెరిగింది. దీంతో.. వారిని రేపటి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రక్రియకు వైఎస్ జగన్ సర్కార్ ఇప్పుడు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా.. పొదుపు సంఘాల పేరుతో మహిళలు తీసుకునే రుణాలు ఇక నుంచి సాధ్యమైనంత మేర ఆ కుటుంబానికి ప్రతినెలా స్థిర ఆదాయం వచ్చేలా ప్రణాళిక రచించింది. వివిధ శాశ్వత జీవనోపాధులకు వీలున్న వాటిలో పెట్టుబడి పెట్టేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ ప్రక్రియలో వివిధ కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ పథకాలను ఈ కార్యక్రమాలకు అనుసంధానం చేసుకునేందుకు తోడ్పాటు అందజేస్తామని సెర్ప్ అధికారులు తెలిపారు.

మొదలైన శిక్షణా కార్యక్రమాలు..

మరోవైపు.. సమాజంలో పెరుగుతున్న వ్యాపార అవకాశాలను ఉపయోగించుకుని పేద మహిళలు కూడా స్థిర ఆదాయం పొందేందుకు వీలుగా గ్రామీణ పొదుపు మహిళలందరికీ ఆర్థిక అక్షరాస్యతపై సెర్ప్ శిక్షణకు శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ చివరి వారం నుంచే ఇవి మొదలైనట్లు అధికారులు వెల్లడించారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 85 లక్షల మందికి పైగా మహిళలు పొదుపు సంఘాల్లో ఉండగా.. వీరందరికీ మూడేసి రోజుల చొప్పున శిక్షణనిస్తారు. మొత్తం ఆరువేల మంది మాస్టరు ట్రైనర్లను సిద్ధంచేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 2,269 మంది శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరంతా ఇప్పటికే పొదుపు మహిళలకు శిక్షణ ఇవ్వడం మొదలు పెట్టారు.

మేనిఫెస్టో అమలుపై దమ్ముంటే చర్చకు రండి

చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ నేతల సవాల్

- ఎన్నికల ప్రణాళిక పేరుతో మరో మోసానికి తెర
- గతంలో ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చావా?
- అది బాబు 420 మేనిఫెస్టో.. అది మాయాఫెస్టో
- ఉచితాలంటూ ఎద్దేవా చేసి.. ఇప్పుడేం చెబుతున్నావు?
- మేనిఫెస్టోను ఇంత నిస్సిగ్గుగా కాపీ కొడతావా?
- ఎన్ని అబద్ధాలు చెప్పినా నమ్మే వారెవరూ లేరు

సాక్షి అమరావతి/చిలకలూరిపేట/తాడేపల్లి గూడెంఅర్బన్/సాక్షి,రాజమహేంద్రవరం/రేపల్లె రూరల్/కాకినాడ రూరల్/దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా) : మేనిఫెస్టో హామీల అమలుపై దమ్ముంటే చంద్రబాబు చర్చకు రావాలని వైఎస్సార్‌సీపీ మంత్రులు, మాజీ మంత్రులు, నేతలు సవాల్ విసిరారు. 2014లో టీడీపీ మేనిఫెస్టోలో చెప్పిన ఏ ఒక్క హామీని చంద్రబాబు అమలు చేయలేదని మండిపడ్డారు. 650 వాగ్దానాలు ఇచ్చి, రైతులు, మహిళలు, యువత అందరినీ మోసం చేశారని నిప్పులు చెరిగారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, ఆయన మృతికి కారణమైన చంద్రబాబు.. ఇప్పుడు ఆయన ఫొటోకు దండలు వేసి, పొగడ్తల వర్షం కురిపించడం నీచ రాజకీయమని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టో అంటూ మరోసారి మోసం చేయడానికి బయలుదేరారని ధ్వజమెత్తారు. మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన తొలి విడత మేనిఫెస్టోపై వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో, ఇతర చోట్ల ప్రజా ప్రతినిధులు సోమవారం వేర్వేరుగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడిన వివరాలు ఇలా ఉన్నాయి.

బాబూ.. ఎక్కడ చర్చిద్దాం?

2014లో టీడీపీ మేనిఫెస్టోలో చెప్పిన ఏ ఒక్క హామీ అమలు చేయని నీవు.. 1994లో ఎన్టీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోను, 1999లో.. ఆ తర్వాత 2014లో ప్రకటించిన మేనిఫెస్టోను తీసుకురా. వైఎస్ జగన్ 2019లో ప్రకటించిన మేనిఫెస్టోను, అంతకు ముందు వైఎస్సార్ 2004, 2009లోనూ విడుదల చేసిన మేనిఫెస్టోలు మేము తీసుకొస్తాం. వాటిపై ఎక్కడ చర్చిద్దామో చెప్పు. ఎక్కడైనా సరే. వైఎస్సార్ వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తామంటే బట్టలారేసుకోవాలన్న నిన్ను ప్రజలు ఓడించారు. 2014లో రైతు రుణాలు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానన్నావు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యుత్ అన్నావు. ఇంటికో ఉద్యోగం అన్నావు. అధికారంలోకి వచ్చాక మాట తప్పావు. – కొడాలి నాని, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే

డర్టీ బాబు.. టిష్యూ మేనిఫెస్టో

డర్టీ చంద్రబాబు.. మహానాడు వేదికపై ఒక టిష్యూ మేనిఫెస్టోను విడుదల చేశారు. అది కూడా కొట్టేసిందే. ఆయన 2014 మేనిఫెస్టోలో 650 వాగ్దానాలు చేసిన వ్యక్తి పట్టుమని పది వాగ్దానాలు నెరవేర్చని డర్టీ ఫెలో. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల సీఎంని అని చెప్పుకునే చంద్రబాబు 2014 మేనిఫెస్టో ఇది. ఇందులో ఏ ఒక్కటీ నెరవేర్చనందున చించి ముక్కలు చేసి డస్ట్ బిన్‌లో పడేస్తున్నా. ఈ ఆల్ ఫ్రీ బాబు..1995, 1999, 2004 ఎన్నికల్లో కూడా ఇదే విధంగా అబద్ధపు హామీలు ఇచ్చారు. ఆల్ ఫ్రీ బాబు కాస్తా ఆల్ కాపీ బాబు అయ్యారు. బాబు జీవితం అంతా కాపీనే. పొత్తులు లేకుండా ఎన్నికలకు రారు. ఎన్నికల్లో అన్ని సీట్లకు టీడీపీ తరఫున అభ్యర్థులను నిలపలేరు. మేనిఫెస్టో అంటే సీఎం వైఎస్ జగన్‌కు ఒక పవిత్ర గ్రంథం. చంద్రబాబు మేనిఫెస్టో చెత్తబుట్టకే పరిమితం. – జోగి రమేష్, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి

నాడు ఆల్‌ఫ్రీ బాబు.. నేడు కాపీ బాబు



చంద్రబాబుకు సొంత ఆలోచన లేదు. గతంలో ఆల్‌ఫ్రీ బాబు.. ఇప్పుడు కాపీ బాబుగా మారారు. బాబు తాజాగా ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని అంశాలన్నీ పూర్తిగా కాపీ కొట్టినవే. కర్ణాటక ఎన్నికల సందర్భంగా అక్కడ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు కొన్ని, ఇప్పటికే ఏపీలో జగనన్న అమలు చేస్తున్న హామీల్లో కొన్ని కాపీకొట్టి.. మొదటి విడత మేనిఫెస్టో అంటూ నిస్సిగ్గుగా విడుదల చేశారు. మరో నాలుగు నెలల్లో రెండో విడత మేనిఫెస్టో అంటున్నారు. ఆ సమయంలో ఎన్నికలు ఉన్న రాష్ట్రాల నుంచి మరికొన్ని హామీలు కాపీ కొట్టి దాన్ని తయారు చేస్తారు. టీడీపీకి 2014 మేనిఫెస్టోను చూపించి మళ్లీ ఓట్లు అడిగే దమ్ముందా? బాబు మోసాలను ఏ ఒక్కరూ మరచిపోలేదు. ఏయే వర్గాలకైతే బాబు తీరని అన్యాయం చేశారో.. ఇప్పుడు మళ్లీ ఆ వర్గాల వారికే గాలం వేయాలని చూస్తున్నారు. – విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

బాబు మరో యూటర్న్..



టీడీపీ మహానాడు అట్టర్ ఫ్లాప్ అయింది. 14 ఏళ్లపాటు సీఎంగా ఉన్న నువ్వు.. ప్రజలకు ఏం చేశావు చంద్రబాబూ? మహానాడుకు వచ్చిన నాయకులు మినహా మిగిలిన వారంతా చంద్రబాబు సామాజిక వర్గీయులే. దీనిని టీడీపీ మహానాడు అనడం కంటే కుల మహానాడు అంటే సమంజసంగా ఉంటుంది. ఉచితాలు అనుచితం అని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు అదే మార్గంలో వెళ్తానని ప్రకటించడం ద్వారా మళ్లీ యూటర్న్ తీసుకున్నారా? మీ అనుయాయులను ధనికులుగా చేయడమే మీ లక్ష్యం అని అందరికీ తెలుసు. – కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి

అది కర్ణాటక కాంగ్రెస్ మేనిఫెస్టో కాపీ



పేదలకు సెంటు స్థలం ఇస్తే సహించలేని చంద్రబాబు రాష్ట్రంలోని పేదలందరినీ ధనికులుగా మారుస్తానంటే ఎవరు నమ్ముతారు? రాజమండ్రి వేదికగా చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో.. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోకు కాపీ. సీఎం జగన్ అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకాన్ని కూడా చంద్రబాబు కాపీ కొట్టి.. 'తల్లికి వందనం' అని ప్రకటించడం దుర్మార్గం. 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన బాబు పేరు చెబితే ఏ ఒక్క పథకమూ గుర్తుకు రాకపోవడం ఆయన దౌర్భాగ్యం. – మేరుగ నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

అబద్ధాలకోరు చంద్రబాబు



అబద్ధాలు చెప్పడంలో టీడీపీ నాయకుడు చంద్రబాబుని మించిన వారు దేశంలో ఎవరూ లేరు. వచ్చే ఎన్నికల కోసం మళ్లీ అబద్ధాల చిట్టా పట్టుకొచ్చారు. అసలు మేనిఫెస్టో అంటేనే గౌరవం లేని చంద్రబాబు.. కొత్త మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను చూసి జనం నవ్వుకుంటున్నారు. గత ఎన్నికల్లోనే 'నిన్ను నమ్మం బాబూ' అని ప్రజలు ఛీకొట్టి దారుణమైన ఫలితాలనిచ్చారు. అబద్ధాలు చెప్పి అందలం ఎక్కాలని చూడడం చంద్రబాబు నైజం. బాబుకు ఇవే చివరి ఎన్నికలు. – ఆదిమూలపు సురేష్, పురపాలక శాఖ మంత్రి

అది మాయాఫెస్టో



మహానాడు కేంద్రంగా టీడీపీ విడుదల చేసింది మేనిఫెస్టో కాదు.. ప్రజలను మోసగించేందుకు ప్రకటించిన 'మాయాఫెస్టో'. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేనిఫెస్టోలను మిక్స్ చేసి, నిస్సిగ్గుగా జనం ముందుకు తెచ్చారు. గతంలో మూడు రోజులు జరిగే మహానాడు ఇప్పుడు రెండు రోజులకే ఎందుకు పరిమితమైంది? టీడీపీ కార్యక్రమాలకు ప్రజాదరణ కరువైనందు వల్లే కుదించారన్నది నిజం కాదా? మహానాడు కేవలం వివరాళాలు దండుకునేందుకే పెట్టారు. సీఎం జగన్ పథకాలను కాపీ కొట్టడం సిగ్గుచేటు కాదా? అబద్ధపు, మోసపూరిత వాగ్దానాలు ఇవ్వడమే అజెండాగా పెట్టుకున్నారు. – తానేటి వనిత, హోం శాఖ మంత్రి

ఎన్టీఆర్ ఆత్మ ఘోషిస్తోంది



చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు చేసే అరాచకాలకు ఎన్టీఆర్ ఆత్మ ఘోషిస్తోంది. చంద్రబాబును తలుచుకుంటే గుర్తుకు వచ్చేది వెన్నుపోటే. పల్లెల్లో జాతర మాదిరిగా ఎన్టీఆర్ జయంతిని వేదికగా చేసుకుని మహానాడు పేరుతో ప్రజలను మరోమారు మోసగించేందుకు చంద్రబాబు సిద్ధపడ్డారు. 2014–19 మధ్య చంద్రబాబు 35 వేల మందికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే, సీఎం జగన్ నాలుగేళ్లలోనే 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా దాదాపు 2.50 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుంది. – మోపిదేవి వెంకటరమణారావు, రాజ్యసభ సభ్యుడు

మరోమారు మోసం చేసే ఎత్తుగడ



పేదలకు సంక్షేమ పథకాలు ఇస్తుంటే ఆక్షేపించిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు ప్రజలను మోసం చేసేందుకు కాపీ కొట్టిన మేనిఫెస్టోతో మరోసారి ముందుకు వచ్చారు. మహానాడు వేదికగా శకపురుషుడని పొగుడుతుండటం డ్రామా కాదా? మళ్లీ మోసం చేసి అధికారంలోకి రావాలని చూస్తున్న కాపీ రాయుడిని జనం మరిచిపోయారు. 2009లో టీవీ, 2014లో విద్యార్థులకు ఐప్యాడ్ ఇస్తామని ఇవ్వలేదు. పేదలను ధనవంతులను చేస్తామని కొత్త డ్రామాలు ఆడుతున్న చంద్రబాబు వల్ల కొంత మందికి మాత్రమే రాష్ట్ర సంపద అందింది. – కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

అందుకే జగన్‌ను గెలిపించారు



చంద్రబాబు ఇప్పటికే మూడుసార్లు సీఎంగా పనిచేశారు. ఆ మూడు సార్లు ఇచ్చిన మేనిఫెస్టోను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. అందుకే ప్రజలు వైఎస్ జగన్‌ని గెలిపించారు. మా మేనిఫెస్టో హామీల్లో ఇప్పటికే 98.5 శాతం సీఎం అమలు చేశారు. నాలుగేళ్లలో పేదలకు రూ.2.11 లక్షల కోట్లు డీబీటీ ద్వారా జమ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలకు సైతం ఆరాధ్య దైవంగా మారారు. బాబు ప్రకటించింది అబద్ధపు మేనిఫెస్టో. ఇలాంటివి 30 మేనిఫెస్టోలు ఇచ్చినా ఎవరూ నమ్మరు. – ఆర్కే రోజా, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి

మోసకారి మేనిఫెస్టో



టీడీపీ మహానాడులో చంద్రబాబు మాయ మాటలతో మహా మాయగాడిని తలపించేలా ప్రజలకు మోసకారి మాటలు చెప్పారు. వెన్నుపోటు రాజకీయాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. బాబు దృష్టిలో ఎన్నికల మేనిఫెస్టో అంటే చిత్తు కాగితంతో సమానం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి సరికొత్త నిర్వచనం చెప్పారు. చంద్రబాబు పాలన అంతా అవినీతి, మోసపూరితంగా సాగింది. వైఎస్ జగన్ పాలన విప్లవాత్మక సంస్కరణలతో పారదర్శకంగా సాగుతోంది. – ముత్యాలనాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి

కేజీబీవీల్లో 1,358 పోస్టుల భర్తీకి చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టుల భర్తీకి సమగ్ర శిక్షా సొసైటీ చర్యలు చేపట్టింది. మొత్తం 1,358 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో మహిళా అభ్యర్థులతో భర్తీ చేయనున్నారు. ఇందులో అత్యధికంగా పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పోస్టులు 846, కాంట్రాక్టు రెసిడెన్స్ టీచర్స్ (సీఆర్టీ) పోస్టులు 374 ఉన్నాయి. అలాగే 92 ప్రిన్సిపాల్, 46 పీఈటీ పోస్టులను కూడా భర్తీ చేస్తారు. ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్ల ప్రాతిపదికన ఎంపిక ఉంటుందని సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివా సులు తెలిపారు. ఈ పోస్టులకు వయోపరిమితి ఓసీలకు 18–42 ఏళ్లుగా నిర్ణయించారు. బీసీలు, ఎక్స్‌సర్వీస్‌మెన్లకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

అర్హతలు, ఎంపిక విధానం..

ప్రిన్సిపాల్స్, పీజీటీ పోస్టులకు ఆయా సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌తోపాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి. సీఆర్టీ పోస్టులకు ఆయా సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్‌తోపాటు బీఈడీ తప్పనిసరిగా ఉండాలి. అభ్యర్థుల ఎంపికకు 100 మార్కులు కేటాయించారు. ఇప్పటికే కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచింగ్ సిబ్బందికి 8 గ్రేస్ మార్కులు ఉంటాయి. స్కిల్ టెస్టుకు 15 మార్కులు కేటాయించారు. మిగిలిన మార్కులు అభ్యర్థి అకడమిక్ ప్రతిభకు నిర్దేశించారు. ఆసక్తి, అర్హత ఉన్న మహిళా అభ్యర్థులు మంగళవారం నుంచి జూన్ 5 వరకు apkgbv.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుం రూ.100 చెల్లించాలి. జూన్ 14 నాటికి మొత్తం భర్తీ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు కేజీబీవీ కార్యదర్శి మధుసూదనరావు తెలిపారు. జేసీలు చైర్మన్లుగా ఉన్న అధికారుల బృందం ఆధ్వర్యంలో అభ్యర్థులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారని వెల్లడించారు.

కేజీబీవీ సిబ్బందికి సాధారణ సెలవుల పెంపు

కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మహిళా సిబ్బందికి సాధారణ సెలవులను పెంచుతూ సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. గతంలో వీరికి ఏడాదికి 15 రోజులు సాధారణ సెలవులు ఉండేవి. అయితే, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మహిళా సిబ్బంది విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ సిబ్బందితో సమానంగా మరో ఐదు సాధారణ సెలవులను పెంచుతూ ఉత్తర్వులిచ్చారు.

మడ అడవుల పెంపకంపై ప్రత్యేకదృష్టి

పర్యావరణ దినోత్సవం
జూన్ 5న మిషన్ మిస్టి ప్రారంభం

సాక్షి, అమరావతి: సముద్ర తీరప్రాంతాల రక్షణ కోసం మడ అడవుల పెంపకంపై కేంద్ర అటవీశాఖ దృష్టి సారించింది. ఇప్పుడున్న మడ అడవులను రక్షించుకుంటూనే కొత్తగా మడ అడవులు పెంచడానికి మిషన్ మిస్టి (మాంగ్రూవ్ ఇనీషియేటివ్ ఫర్ షోర్‌లైన్ హాబిటాట్స్ అండ్ టాంగిబిల్ ఇన్‌కమ్స్ - ఎంఐఎస్‌హెచ్‌టీఐ) పేరుతో ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా మడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. దేశంలో మొత్తం 75 ప్రదేశాల్లో మడ మొక్కలు నాటాలని గుర్తించగా.. అందులో ఎనిమిది ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. బాపట్ల జిల్లా ముత్యాలపాలెంలో రెండు ప్రదేశాల్లో 150 హెక్టార్లు, లంకవానిదిబ్బలోని 3 హెక్టార్లు, నిజాంపేటలో 10 హెక్టార్లు, కాకినాడ జిల్లా భైరవపాలెంలో ఒక హెక్టార్, కృష్ణాజిల్లా గిలకలదిండిలో 5 హెక్టార్లు, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా పల్లంలో 5 హెక్టార్లు, తిరుపతి జిల్లా తడ ప్రాంతంలోని పులికాట్ పక్షుల అభయారణ్యంలో 5 హెక్టార్లలో మడ మొక్కలు నాటనున్నారు.

4 ఏళ్ల నవచరిత

▶ మొదటి పేజీ తరువాయి

ఇళ్ల పట్టాలివ్వటమే కాదు. ఇళ్ల నిర్మాణమూ భుజానికెత్తుకున్నారు. చాలా ఇళ్ల నిర్మాణం పూర్తయింది కూడా. ఇక నామినేటెడ్ పోస్టులు, నామినేషన్ విధానంలో ఇచ్చే కాంట్రాక్టుల్లో మహిళలకే 50 శాతం కేటాయించేలా ఏకంగా చట్టం చేసి... అమలు చేశారు. తన కేబినెట్లో, ప్రభుత్వ పదవుల్లో మహిళలకు సగభాగమిచ్చి... చేతల మనిషిగా చరిత్ర సృష్టించారు.

తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలి కేబినెట్లోనే 14 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు (56 శాతం) అవకాశమిచ్చారు. 2022 ఏప్రిల్ 11న మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో ఈ శాతాన్ని ఏకంగా 70కి పెంచారు. సామాజిక న్యాయానికి చుక్కానిగా నిలిచారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ టీడీపీ తన హయాంలో రాజ్యసభకు ఒక్క బీసీనీ పంపకున్నా... జగన్ మాత్రం 8 సీట్లలో సగం బీసీలకే ఇచ్చారు. ఇక స్వతంత్ర భారత దేశ చరిత్రలో తొలిసారిగా భూముల సమగ్ర సర్వేని చేపట్టడమే కాక... రైతుల కుటుంబాల్లో చీకట్లు నింపిన... నిషేధిత జాబితా భూముల సమస్యను సులువుగా పరిష్కరించారు. 3 లక్షల ఎకరాలను ఆ జాబితా నుంచి తొలగించారు. చుక్కల భూములు, షరతులు గల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు.

ఇవన్నీ ఒకెత్తయితే పారిశ్రామికంగా వేసిన అడుగులు మరో ఎత్తు. ఏపీకి సువిశాల తీరప్రాంతం ఉందంటూ గత పాలకుల్లా మాటలకే పరిమితం కాకుండా... కొత్తగా నాలుగు పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిషింగ్ ల్యాండ్‌లు, మూడు ఎయిర్‌పోర్టుల నిర్మాణం చేపట్టింది వైఎస్ జగన్ ప్రభుత్వం. మునుపెన్నడూ ఈ రాష్ట్రంవైపు చూడని... అంబానీ, అదానీ, జిందాల్, బంగూర్, భజాంకా తదితర దిగ్గజాలంతా గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ వేదికగా విశ్వాసం వ్యక్తంచేయటమే కాక పెట్టుబడులూ పెడుతున్నారంటే... అది ముఖ్యమంత్రి దార్శనికతపై భరోసాతోనే. అందుకే... గడిచిన నాలుగేళ్లు ఆంధ్రప్రదేశ్‌కు కొత్త చరిత్ర.

జనసేన, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయి


- ఎవరైనా ఇంకేదైనా చెబితే అది వారి సొంత అభిప్రాయమే
- టీడీపీతో పొత్తుపై పవన్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం
- ప్రధానిగా తొమ్మిదేళ్లలో మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తాం
- కేంద్ర మంత్రి భగవంతు కుబా

సాక్షి, అమరావతి: బీజేపీ– జనసేనలు కలిసి తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవడంపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమైనవని కేంద్ర, ఎరువులు రసాయనశాఖ సహాయమంత్రి భగవంతు కుబా చెప్పారు. మోదీ ప్రధానిగా తొమ్మిదేళ్ల పాలనపై నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆయన సోమవారం రాష్ట్రానికి వచ్చారు. ఈ సందర్భంగా విజయవాడలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ–బీజేపీ–జనసేనలు పొత్తు పెట్టుకుంటాయంటూ పవన్ చేసిన ప్రకటనను మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా.. రాష్ట్రంలో జనసేన, బీజేపీ కలిసి పని చేస్తున్నాయని, దానిపై ఇంకెవరైనా ఏదైనా చెబితే అది వారి సొంత అభిప్రాయమే అవుతుందని బదులిచ్చారు. దక్షిణ భారతదేశంలోనూ బీజేపీ ప్రతిపక్షాలకు ఊహకందని విధంగా బలోపేతమవుతోందని చెప్పారు. కర్ణాటకలో బీజేపీకి ప్రజాదరణ తగ్గలేదని, కాంగ్రెస్ పార్టీ డబ్బు పంపిణీతో పాటు కాంగ్రెస్ వ్యతిరేక ఓటును మిగిలిన పార్టీలన్నీ చీల్చుకోవడం వల్ల ఆ ఫలితాలు వచ్చాయని వివరించారు. 2024 ఎన్నికల్లో కర్ణాటకలో మెజారిటీ ఎంపీ స్థానాలు సాధిస్తామని తెలిపారు. తమిళనాడు, కేరళలో బీజేపీ బలోపేతమవుతోందని, తెలంగాణలో అధికారం చేజిక్కించుకుంటామని చెప్పారు. ఏపీలో కూడా తమ పార్టీకి ప్రజాదరణ పెరిగిందని చెప్పారు. 2024 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా మోదీ హవాతో మరోసారి విజయం సాధిస్తామన్నారు. ఏపీ రాజధానిగా అమరావతికే బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ప్రధానిగా తొమ్మిదేళ్లలో మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జి సునీల్ దేవధర్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

కేంద్రాన్ని డిమాండ్ చేసిన వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి బీసీల ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం జాతీయ బీసీ కమిషన్ (ఎన్‌సీబీసీ) చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాంకు వినతిపత్రం ఇచ్చారు. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంఘాల నేతలు కర్రి వేణుమాధవ్, డాక్టర్ పద్మలత, పరశురాం తదితరులు ఎన్‌సీబీసీ చైర్మన్‌తో సమావేశమయ్యారు. అనంతరం కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ గత 75 ఏళ్లలో 56 శాతం జనాభా ఉన్న బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు.



పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగోన్నతులు

- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు
- ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

గుంటూరుఎడ్యుకేషన్: పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 112 మంది పరిపాలనాధికారులతోపాటు 93 మంది పీఆర్ విస్తరణాధికారులకు ఉద్యోగోన్నతులు కల్పించినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన గుంటూరులో మాట్లాడుతూ న్యాయపరమైన ఇబ్బందుల కారణంగా ఆరు నెలలుగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగోన్నతుల సమస్యను పరిష్కరించి, ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఎంపీడీవో పోస్టులను భర్తీ చేయడం శుభపరిణామమని అన్నారు.

తెలంగాణ

'మంతెన'కు బెయిల్

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ వాటర్ కార్పొరేషన్ పనుల్లో అవకతవకలు జరిగాయంటూ ఈడీ నమోదు చేసిన కేసులో నిందితుడైన మంతెన కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్ మంతెన సత్యనారాయణ రాజుకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 10 లక్షల వ్యక్తిగత పూచీకత్తు, రూ. 10 లక్షల చొప్పున ఇద్దరు షూరిటీ సమర్పించాలని జస్టిస్ ఎం. లక్ష్మణ్ ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారెవరినీ సత్యనారాయణ రాజు లేదా ఆయన కుటుంబీకులు కలవరాదని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి సత్యనారాయణ రాజు, ఆయన వ్యాపార భాగస్వామి ఆదిత్య త్రిపాఠీని హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ముందు లొంగిపోవాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించగా సత్యనారాయణ రాజు లొంగిపోయారు.





నువ్వు దేవుడిని మరిచిపోయావా? ఒకవేళ నువ్వు మరిచినా, ఆయన నిన్ను మరిచిపోలేదు.
– జుడాయిజం

సాక్షి
మంగళవారం, 30 మే 2023

నవభారత నారీశక్తి

పెరుగుతున్న మహిళాశక్తికి ఇది మరో నిదర్శనం. 2022కి గాను ఇటీవల ప్రకటించిన సివిల్ సర్వీస్ పరీక్షా ఫలితాల్లో కృతార్థులైన అభ్యర్థుల్లో మూడోవంతు మంది, మరో మాటలో 34 శాతం ఆడవారే! తొలి 4 ర్యాంకులూ మహిళలవే! ఇంకా చెప్పాలంటే, అగ్రశ్రేణిలో నిలిచిన పాతిక మంది అభ్యర్థుల్లో 14 మంది స్త్రీలే! ఈ లెక్కలన్నీ మారుతున్న ధోరణికి అద్దం పడుతున్నాయి. ప్రపంచంలోనే అతి క్లిష్టమైన ఈ మూడు దశల పరీక్షలో యువతులు ఇలా అగ్రపీఠిన నిలవడం ఇదే తొలిసారి కాకున్నా, వరుసగా కొన్నేళ్ళుగా వారు ఇలాంటి ఫలితాలు సాధిస్తున్న తీరు అసాధారణం. అంతేకాక, ఒకే ఏడాది ఇంతమంది యువతులు సివిల్స్‌కు ఎంపికవడం ఇదే ప్రప్రథమం. సివిల్ సర్వీసుల్లో ఏయేటి కాయేడు స్త్రీల వాటా పెరుగుతుండడం సానుకూల ధోరణి. అంతకు మించి ఆనందదాయకం.

గణాంకాలు గమనిస్తే, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎంపిక చేస్తున్నవారిలో మహిళల వాటా 2018లో 24 శాతమైంది. 2021లో అది 26 శాతానికి ఎగబాకింది. తాజాగా 2022 పరీక్షల్లో అది గణనీయంగా 34 శాతానికి హెచ్చింది. సంఖ్యాపరంగా చూస్తే, ఈసారి మొత్తం 933 మంది అభ్యర్థులకు సివిల్స్‌లో చోటు దక్కగా, వారిలో 320 మంది స్త్రీలే. ఇది ఒక్కరోజులో, రాత్రికి రాత్రి జరిగిన పరిణామం కాదు. దశాబ్దాల పరిణామక్రమంలో చోటుచేసుకున్న మార్పు. అనేక ఇతర రంగాల లాగే సివిల్స్ సైతం ఒకప్పుడు పూర్తిగా పురుషాధిక్యమైనదే. 2006 వరకు యూపీఎస్సీ ఎంపిక చేసే మొత్తం అభ్యర్థుల సంఖ్యలో దాదాపు 20 శాతమే మహిళలు. ఇక, ఇంకాస్త వెనక్కి వెళితే, 1980ల్లో, 1990ల తొలినాళ్ళలో వారి సంఖ్య 20 శాతం కన్నా తక్కువే. ఆ గత చరిత్ర మారి, ఈసారి 34 శాతం మహిళలు సివిల్స్ ఉద్యోగానికి లేఖలు అందుకోవడం గణనీయమైన మార్పు.

భారతదేశంలో విస్తృత సివిల్ సర్వీస్ వ్యవస్థలోకి ప్రతిభావంతులైన యువతీ యువకులను ఏటా ప్రవేశపెట్టే యూపీఎస్సీ పరీక్ష అత్యంత కష్టమైనది. చైనాలో జాతీయ కాలేజ్ ప్రవేశపరీక్ష గావో కవో లాంటి ఒకటి, రెండే ప్రపంచంలో ఈ స్థాయి క్లిష్టమైనవంటారు. ఏటా మూడు దశల్లో సాగే ఈ కఠిన పరీక్షకు ఏటా దాదాపు 10 లక్షల మంది లోపు దరఖాస్తు చేసుకుంటే, అందులో 1 శాతం కన్నా తక్కువ మందే రెండో దశ అయిన లిఖిత పరీక్ష (మెయిన్స్)కు చేరుకుంటారని లెక్క. అలాంటి పోటీ పరీక్షలో గత ఏడాది కూడా సివిల్స్‌లో తొలి 4 ర్యాంకులూ మహిళలకే దక్కాయి. వరుసగా రెండోసారి ఈ ఏడాదీ అదే ఫలితం పునరావృతమవడం విశేషం. గమనించాల్సింది ఏమిటంటే – వైద్యప్రవేశ పరీక్షలు 'నీట్'లోనూ ఈ ఏడాది యువతులదే అగ్రస్థానం. జాతీయస్థాయిలో 12వ తరగతి బోర్డ్ పరీక్షా ఫలితాల్లోనూ గత అయిదేళ్ళుగా అబ్బాయిల కన్నా అమ్మాయిలదే పైచేయి.

సివిల్స్‌లో ప్రథమ స్థానంలో నిల్చిన ఇషితా కిశోర్ మొదలు మూడో స్థానం దక్కిన తెలుగమ్మాయి ఉమా హారతి సహా సివిల్స్‌లో నెగ్గిన అనేకమంది అభ్యర్థుల ఆశలు, ఆకాంక్షలు, జీవితంలోని కష్టనష్టాలను ఎదిరించి నిలిచిన వారి పట్టుదల, సహనం స్ఫూర్తిదాయకం. కృతనిశ్చయులైతే... కులం, మతం, ప్రాంతం, లింగ దుర్విచక్షణ లాంటి అనేక అవరోధాలను అధిగమించి సమాజంలోని అన్ని వర్గాల నుంచి వనితలు విజేతలుగా అవతరించడం సాధ్యమని ఈ విజయగాథలు ఋజువు చేస్తున్నాయి. నిష్పాక్షికంగా, అత్యంత సంక్లిష్ట ప్రక్రియగా సాగే సివిల్స్ పరీక్షల్లో అమ్మాయిలు ఈ తరహా విజయాలు సాధిస్తూ, ఉన్నతోద్యోగాలకు ఎంపికవడం విశేషం. ఒకపక్కన కార్పొరేట్ ప్రపంచం సైతం సీనియర్ హోదాల్లో లింగ వైవిధ్యం సాధించడానికి కష్టపడుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వ అధికార యంత్రాంగ సర్వీసులో ఈ స్థాయిలో మహిళలకు ప్రాతినిధ్యం దక్కడం చరిత్రాత్మకమే!

అయితే ఇది చాలదు. నిజానికి, ప్రభుత్వ పాలనలో లింగ సమానత్వంపై యూఎన్‌డీపీ 2021 నివేదిక ప్రకారం అనేక ఇతర దేశాలతో పోలిస్తే మనం వెనకబడే ఉన్నాం. ప్రభుత్వ ఉన్నతోద్యోగాల్లో స్త్రీల వాటా స్వీడన్‌లో 53 శాతం, ఆస్ట్రేలియాలో 40 శాతం, సింగపూర్ 29 శాతం కాగా, భారత్ వాటా కేవలం 12 శాతమేనట. ప్రస్తుత మహిళా విజయగాథ మరింత కాలం కొనసాగినప్పుడే ఈ లోటు భర్తీ అవుతుంది. ఇప్పటికీ జమ్ము- కశ్మీర్, జార్ఖండ్ సహా అనేక రాష్ట్రాల్లో అవసరానికి తగ్గ సంఖ్యలో అసలు ఐఏఎస్‌లే లేరన్న పార్లమెంటరీ సంఘం నివేదికను చెవికెక్కించుకోవాలి. అయితే, కేవలం సివిల్స్‌లోనో, మధ్యశ్రేణి ఉద్యోగాల్లోనో స్త్రీల ప్రాతినిధ్యం పెరిగితే సరిపోదు. నేటికీ పితృస్వామిక భావజాలం, ఆడవారు ఇంటికే పరిమితమనే మనస్తత్వం మన సమాజంలో పోలేదన్నది చేదు నిజం. అందుకు తగ్గట్లే... మన జాతీయ శ్రామికశక్తిలో పనిచేసే వయసులోని మహిళల వాటా కూడా తక్కువే. ప్రపంచ బ్యాంక్ లెక్కల ప్రకారం 2005లో 35 శాతమున్న వనితల వాటా, 2021లో 25 శాతానికి పడిపోయింది. వెలుగు వెనుకే ఉన్న ఈ చీకటి ఓ విషాదం.

కాకపోతే, మునుపటితో పోలిస్తే లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యల సంఖ్య తగ్గింది. ఆధునిక మహిళ ఒకప్పటితో పోలిస్తే విద్య, ఉద్యోగాల్లో బంధనాలను తెంచుకుంది. ఆటల నుంచి ఆర్మ్డ్ సర్వీసుల దాకా అన్నింటా తాను పురుషుడితో సమానంగా ముందడుగు వేస్తోంది. ఈ పరిస్థితుల్లో ఇంట్లో ఒత్తిళ్ళు, పనిప్రదేశాల్లో అభద్రత, నగరాల్లోనూ నాసిరకపు ప్రజారవాణా దుఃస్థితిని మార్చాలి. లింగ దుర్విచక్ష లేని పనిసంస్కృతిని ప్రోత్సహించాలి. సమాజంలో దుర్లక్షణాలున్నా వాటిని దాటుకొని పడతులు పైకి రావడం సాధ్యమేనని తాజా సివిల్స్ ఫలితాలు ఆశావాదాన్ని ప్రోది చేస్తున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ ధోరణి గ్రామాలకూ విస్తరించడం శుభవార్త. ఇలాంటి మహిళా విజేతలు మరింత పెరిగితేనే, మన యువభారతం... నవభారతం అవుతుంది.


గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.దశమి ఉ.10.05 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: హస్త రా.3.34 వరకు, తదుపరి చిత్త, వర్జ్యం: ఉ.10.54 నుండి 12.36 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.03 నుండి 8.55 వరకు, తదుపరి రా.10.52 నుండి 11.34 వరకు.
అమృతఘడియలు: రా.9.11 నుండి 10.53 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం: 6.26
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఎన్నికల దండమా?

'కర్రపుల్ల'తో అధికారం నిలబడాలేగానీ, దాని కోసం వెంపరలాడే ముందుపీఠిలో రాజకీయ నాయకులే ఉంటారు. ఏ రుజువులూ లేకపోయినా 'సెంగోల్' కర్రపుల్లని 'రాజదండం'గా తెరమీదకు తెచ్చారు. కర్ణాటక తమ చేజారిపోగా, ఇప్పుడు రంగం తమిళనాడుకు మారింది. 'సెంగోల్' పదం 'సికోలు' నుంచి వచ్చింది. దీనికి జనసామాన్యంలో అర్థం చర్నాకోల అనే. దాన్ని ఎవరి మీద ఝళిపించాలి?



రెండోమాట
ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

మన దేశంలో ఇంకా 'భారత ప్రజలమైన మేము' అని సగర్వంగా తొల్లింటి దేశ లౌకిక రాజ్యాంగానికి సమ్మతిని ప్రకటిస్తూ, భారత రిపబ్లిక్‌కు ముందుమాటగా చేసిన ప్రతిజ్ఞకు విలువ ఉందా? రాజ్యాంగం 368వ అధికరణ ప్రకారం, లౌకిక రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని మార్చడానికి ఏ విభాగానికీ హక్కు లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం కేశవానందభారతి, ఇందిరాగాంధీకి సంబంధించిన కేసులలో స్పష్టం చేసింది. బహుళ సంస్కృతులకు, విభిన్న మత విశ్వాసాలకు భారత సెక్యులర్ (లౌకిక) రాజ్యాంగ వ్యవస్థ నిలయమని స్పష్టం చేసింది. 14–16 అధికరణల కింద సమాన శ్రమకు సమాన వేతనం పొందే హక్కు ఉందన్న రాజ్యాంగ హక్కును 1979 నుంచి 1990 మధ్యకాలంలో ఆరు కేసులలో సుప్రీంకోర్టు ఖాయ పరిచింది. ఈ కేసులన్నింటిలోనూ ఉన్నత న్యాయస్థానాలు రాజ్యాంగం తొలి ప్రతిజ్ఞకే కట్టుబడి ఉన్నాయి. కట్టుబడనిదల్లా కొన్నాళ్లు కాంగ్రెస్ పాలకవర్గమూ, ఆ తరువాత వాజ్‌పేయి హయామును మినహాయించి మిగతా 'హిందూత్వ' పాలక వర్గాలూ! వీటన్నింటి దుష్ఫలితంగా – చివరికి దేశ సర్వ సేనాపతి, రాజ్యాంగ సంరక్షకులైన రాష్ట్రపతి హోదానే కించపరిచే దుస్థితికి నేటి పాలకవర్గం పాల్పడింది. ఈ 'డ్రామా' కోసం విశ్వసనీయమైన రుజువులూ, పత్రాలూ లేకపోయినా 'సెంగోల్'ను కనిపెట్టారు.

నిజానికి 'కర్రపుల్ల'తో అధికారం నిల బడాలేగానీ, ఆ 'పుల్ల' కోసం వెంపరలాడే ముందుపీఠిలో రాజకీయ నాయకులే ఉంటారు. 'సెంగోల్' కర్రపుల్లను 'రాజదండం'గా చిత్రించడానికి చరిత్రకారులైన శివనాగిరెడ్డిని, బాజ్జీరావును సహాయం కోరడం మరీ విచిత్రం. 'నంది' ధ్వజ రూపంలో ఉన్న 'సెంగోల్' పదానికి అర్థం వేరని ఎవరోగాదు, ఆ చరిత్ర పరిశోధకులే దాచుకోకుండా వెల్లడించాల్సి వచ్చింది. అసలు 'సెంగోల్' పదం 'సికోలు' పదం నుంచి వచ్చింది. చోళుల కాలం నుంచి ఈ 'సికోలు'కు జనసామాన్యంలో అర్థం చర్నాకోల అనే. ఇది లేకుండా పరిపాలన నడవదా? ఒకవేళ అది చేతిలో ఉన్నా ఎవరిమీద ఝళిపించాలి? అన్ని రాజ్యాంగ గ్యారంటీలను నేడు కోల్పోతున్న సామాన్య పౌరుల మీదా? పౌర హక్కుల ఉద్యమాల మీదా? మహిళా క్రీడాకారుల మీదా? వారిని లైంగిక దృష్టితో న్యూనపరచడానికి ప్రయత్నించి ఎదురుబొంక జూచిన బీజేపీ ఎంపీ మీదనా? పాలకుల నుంచి ఈ క్షణం దాకా సమాధానం లేదు, రాదు. అయినా పాలకుల దృష్టి మాత్రం 'దంతకథ'గా మిగిలిపోయిన 'సెంగోల్' రాజదండంపై నుంచి తొలగదు.

ఆ మాటకొస్తే ఆది నుంచీ, తలపెట్టిన నూతన పార్లమెంట్ భవన నిర్మాణం కూడా మోదీ అడుగుల్లోనే సాగుతూ వచ్చింది. అప్పుడూ దేశాధిపతి రాష్ట్రపతిని, ఉపరాష్ట్రపతిని ఆహ్వానానికి దూరం చేశారు. రాష్ట్రపతిగా తన ప్రతిపత్తికి బాహాటంగా జరుగుతున్న అవమానాన్ని ఆమె దిగమింగుకున్నా చూసే ప్రజలు మాత్రం పసిగట్టేశారు.

ఇప్పుడిక దేశానికి తొల్లింటి ప్రకటిత లౌకిక రాజ్యాంగం లేదు. 'భారత ప్రజలమైన మేము' అని ప్రకటించుకోగల సత్తాను క్రమంగా కోల్పోవలసిన దుఃస్థితులు దాపురించాయి. తొల్లింటి లౌకిక రాజ్యాంగం ఇంకా బతికి ఉండాలన్నా; ప్రజల, పీడిత వర్గాల, దళిత, బహుజన వర్గాల మౌలిక ప్రయోజనాలు నెరవేరి, మనుగడ నిలవాలన్నా; తాము మరింత చైతన్యం పొందే వరకూ నేటి పరిస్థితుల్లో విశ్వసనీయమైన ఏకైక దుర్గం – 2025 ఆఖరి దాకా భారత సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తిగా చైతన్యమూర్తి అయిన చంద్రచూడ్ కొనసాగడం. ఈ అవకాశాన్ని బలవంతంగా మార్చడానికి పాలక శక్తులు రకరకాల 'విన్యాసాల'కు పాల్పడతాయి. వాటిలో ఒకటి ఎలాంటి అధికారాలు లేని అనధికార 'దళాలు'. పిలిస్తే చాలు 'కేరాఫ్' రోడ్స్! చూడరాదూ–ఉన్నట్టుండి, నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవమూ, గాంధీజీ హత్యకు ప్రణాళిక పన్నాడన్న ఆరోపణను అనివార్యంగా భరించాల్సి వచ్చిన 'హిందూత్వ' సిద్ధాంతకర్తలలో ఒకరైన సావర్కార్ జన్మదినాన్ని నూతన పార్లమెంట్ ఆవిష్కరణ రోజునే జరపడమూ, పాత పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో అదే రోజున సావర్కార్‌కు నివాళులు అర్పించడమూ జరిగింది.

అన్నింటికన్నా గమనించదగిన అంశం – సెక్యులర్ రాజ్యాంగం కళ్ల ఎదుటనే యజ్ఞాలు, పూజ పునస్కారాలతో సర్వకార్య క్రమాలకు తెర లేపడం. దక్షిణాదిని ఉత్తరాది 'జయించే' విశ్వ ప్రయత్నాలలో తొలిమెట్టుగా కర్ణాటక రాష్ట్రం బీజేపీ చేజారిపోగా, ఇప్పుడు రంగం పక్కనున్న





తమిళనాడుకు మారింది. తమిళనాడును జయించే మార్గాలలో భాగంగానే సంబంధం లేని 'రాజదండం'గా ప్రచారంలోకి ఎక్కిన 'సెంగోల్' దుడ్డు కర్ర కొంతమంది 'స్వాముల' ద్వారా చేతికి చిక్కింది. ఫ్యూడల్ సంస్కృతి, పెట్టుబడిదారీ వ్యవస్థ తాలూకు అవలక్షణాలు కలగలిసి పోయిన వ్యవస్థలో నిజం కోసం తాపత్రయం మాత్రం ఆగదు. 'నిరుద్ధ భారతం' రచనలో దేశభక్తుడైన మంగిపూడి వెంకటశర్మ 'శ్రుతి ప్రమాణములు జాతులు నాలు గెయంచు చెప్పగా ఐదవ జాతి ఎక్కడిదొ? ఆర్య మహా జనులార, చెప్పరే' అని సూటిగా ప్రశ్నించాడు. 'నాస్తితు పంచమః' (పంచమజాతి అంటూ ఏదీ లేదు) అని మనుస్మృతి చెప్పినా చెవుల్లో పోసుకున్న 'సీసం' బయటకు రాదు. పాబ్లో నెరూడా వీరుల గురించి అంటాడు: 'వాళ్లు చని పోలేదు, కాల్పే తుపాకీ గొట్టం ముందు నిటారుగా నిలబడ్డారు'ని! అలాగే మన కవి శివసాగర్... పీడనా దోపిళ్ల నుంచి, ప్రజాకంటకుల నుంచి జన సామాన్యాన్ని విముక్తం చేసి సామ్యవాద ప్రజాస్వామిక యుగాన్ని ఆవిష్కరించుకోవల్సిన అవసరాన్ని గుర్తు చేశాడు ('అమరత్వం' కవిత):

"విత్తనం చనిపోతూ
పంటను వాగ్దానం చేసింది
చిన్నారి పువ్వు రాలిపోతూ
చిరునవ్వుతో కాపును వాగ్దానం చేసింది...
సూర్యాస్తమయం చేతిలో చేయివేసి
సూర్యోదయాన్ని వాగ్దానం చేసింది
అమరత్వం రమణీయమైంది
అది కాలాన్ని కౌగిలించుకొని
మరో ప్రపంచాన్ని వాగ్దానం చేసింది."

అదే రేపటి సామ్యవాద ప్రజాస్వామిక యుగావిష్కరణం కావాలి. అంతేగానీ కావలసినవి అభినవ రాచరికాలూ, రాజదండాలూ కాదు!

abkprasad2006@yahoo.co.in

ఇది చరిత్రాత్మకం!

భారతదేశం పురోగమన దిశగా వేసిన అడుగులను చూపుతూనే, సంస్కృతీ సంప్రదాయాల పునాది మీద నిర్మితమైనదే ఈ కొత్త పార్లమెంట్ భవనం. పాత భవనం తొమ్మిదిన్నర దశాబ్దాల నాటిది. పైగా బ్రిటిష్ కట్టడం. స్వతంత్ర భారతదేశంలో కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకుని, ప్రజాస్వామ్యానికి దేవాలయం వంటి ఆ భవనాన్ని జాతికి అంకితం చేసిన మే 28వ తేదీకి చరిత్రలో స్థానం ఉంటుంది.

ఆధునిక ప్రపంచంలో గణనీయమైన శక్తిగా భారత్ ఉనికిని చాటుకుంటున్నది. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్న దేశం మనది. వీటన్నిటికీ రూపాన్నీ, తాత్త్వికతనీ ఇచ్చేది అత్యున్నత చట్టసభ. స్వతంత్ర భారతదేశంలో కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకుని, ప్రజాస్వామ్యానికి దేవాలయం వంటి ఆ భవనాన్ని జాతికి అంకితం చేసిన మే 28వ తేదీకి చరిత్రలో స్థానం ఉంటుంది.

ఏ విధంగా చూసినా కొత్త పార్లమెంట్ భవనం అవసరం కాదనలేనిదే. పాత పార్లమెంట్ భవనం తొమ్మిదిన్నర దశాబ్దాల నాటిది. పైగా బ్రిటిష్ కట్టడం. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత భారత్ సాధించిన స్వయం సమృద్ధికి ప్రతీకగా కొత్త పార్లమెంట్ భవంతిని చూడాలని ప్రధాని చాలా కాలం క్రితమే చెప్పారు. నరేంద్ర మోదీ ప్రధాని కావడానికి దాదాపు దశాబ్దం ముందే పార్లమెంట్‌కు కొత్త భవన నిర్మాణం గురించి చర్చ జరగక పోలేదు.

1921లో ప్రారంభమైన పాతదాని నిర్మాణం 1927కు పూర్తి కాగా, నాటి గవర్నర్ జనరల్ ఇర్విన్ ప్రారంభించారు. ఇకపై పాత భవనం ఒక పురావస్తు ప్రదర్శనశాలగా ఉండిపోతుంది. ఆగస్ట్ 14, 1947 అర్ధరాత్రి అధికార మార్పిడి మొదలు, ఎన్నో కీలక ఘట్టాలకు అది వేదిక అయింది. కొన్ని శతాబ్దాల పరాయి పాలన తరువాత స్వాతంత్ర్యం సాధించుకున్న దేశం ముందుకు సాగడానికి, ప్రపంచ దేశాల నడుమ ఒక స్థానం సంపాదించుకోవడానికి తీసుకున్న ఎన్నో మేధామథనాలకు సాక్షిగా నిలిచింది. బాబూభాయ్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్ భాయ్ పటేల్, అంబేడ్కర్, శ్యామాప్రసాద్ ముఖర్జీ, ఓం ప్రకాశ్ త్యాగీ, రామ్ మనోహర్ లోహియా, లాల్ బహదూర్ శాస్త్రి, నందా, ఇందిర, మొరార్జీ, వాజపేయి, అద్వాణీ, చంద్రశేఖర్, వైబీ చవాన్, హిరేన్ ముఖర్జీ, ఇంద్రజిత్ గుప్తా, ఎంసీ చాగ్లా, పీలూ మోడీ, రాంజెత్మలాని, ప్రణబ్ ముఖర్జీ వంటి ఎందరో పార్లమెంటేరియన్లను చూసింది. వరసగా పది బడ్జెట్లు ప్రవేశపెట్టి మొరార్జీ దేశాయ్ చరిత్ర సృష్టించినది పాత భవనంలోనే. గణేశ్ వాసుదేవ్ మావలంకర్, కేఎస్ హెగ్డే, సోమనాథ్ ఛటర్జీ వంటి లోక్‌సభ స్పీకర్లనూ; సర్వేపల్లి రాధాకృష్ణన్, హిదయ్‌తుల్లా, శంకర్ దయాళ్ శర్మ, వెంకయ్యనాయుడు వంటి రాజ్యసభ ఛైర్మన్లనూ చూసిన వేదిక అది.

కొత్త పార్లమెంట్ భవనం జాతికి అంకితం చేసే కార్యక్రమాన్ని కొన్ని విపక్షాలు రాజకీయం చేయడం దురదృష్టకరం. మొదట కొత్త భవంతిని రాష్ట్రపతి మాత్రమే ప్రారంభించాలని వివాదం లేవదీశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల కాంగ్రెస్, కొన్ని ఇతర విపక్షాలకు హఠాత్తుగా ఇంత గౌరవం ఎందుకు పుట్టుకొచ్చింది? ముర్ము పదవీ స్వీకారం చేసిన తరువాత ఇంత వరకు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి మర్యాద పూర్వకంగా కలవని నాయకులే ప్రతిపక్షాలలో ఎక్కువ. ఇప్పుడు మాత్రం రాజ్యాంగంలో 79వ ఆర్టికల్ గుర్తుకు వచ్చింది. పార్లమెంట్‌కు రాష్ట్రపతి అధినేత అని ఆ ఆర్టికల్ చెబుతున్న సంగతి వాస్తవమే కావచ్చు. కానీ ప్రధాని ప్రజలు ఎన్నుకున్న వ్యక్తి. పూర్తి ప్రజాప్రాతినిధ్యంతో ఆవిర్భవించే లోక్‌సభకు నాయకుడు. వాస్తవంగా అధికార బాధ్యతను నిర్వర్తించే వ్యక్తి ప్రధాని మాత్రమే.



అభిప్రాయం
పి. వేణుగోపాలరెడ్డి

చారిత్రకంగా, రాజకీయంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఏ భవంతిని అయినా ఒక ప్రత్యేక సందర్భంలోనే ప్రారంభిస్తారు. ఇక పార్లమెంట్ కొత్త భవనం సంగతి చెప్పేదేముంది? అది వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతి కావడం ముదావహమే. అంతటి త్యాగమూర్తికి స్వతంత్ర భారతదేశంలో దక్కిన గౌరవం అంతంత మాత్రమే. ఇది ఆయనకు సరైన నివాళి కూడా. చాలా చిత్రంగా సావర్కర్ వివాదం వెనక్కి పోయింది. రాష్ట్రపతి ప్రారంభించాలన్న విపక్షాల వాదనకు సాక్షాత్తూ సుప్రీంకోర్టు స్వస్తి పలికింది. దీని తరువాత సెంగోల్ వివాదాన్ని తెచ్చారు. ఇందులో కూడా ఎన్నో మలుపులు. చాలా చిత్రంగా గతానికి లేని సంకుచితత్వాన్ని కూడా అంటగట్టారు. ఇలాంటి పాత సంప్రదాయానికి చెందిన చిహ్నాన్ని నెహ్రూ తీసుకుని ఉండరు అంటూ ఒక టీవీ చర్చలో ప్యానలిస్ట్ ఢంకా బజాయించి చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. తమిళనాడు నుంచి అది ఆఖరి వైస్రాయ్‌కి చేరడం, తరువాత గంగాజలంతో శుద్ధి చేయడం, ఆపై ప్రథమ ప్రధానికి చేరడం ఇవన్నీ రుజువులతో సహా చూపిస్తూ ఉంటే ఇలాంటి వాదన తీసుకువచ్చారు. సెంగోల్ అని పిలిచే ఆ న్యాయదండానికి మోదీ అంత ప్రాముఖ్యం ఇవ్వడంలోని అంతర్యం కూడా అంతుపట్టనిదేమీ కాదు. 'కటింగ్ సౌత్' అనే ప్రమాదకర నినాదానికి ఊతమివ్వాలని కొన్ని విద్రోహ శక్తులు ప్రయత్నిస్తున్న తరుణంలో మోదీ తమిళనాడుకు చెందిన ఆ చారిత్రక అవశేషాన్ని ఆధునిక పార్లమెంట్ భవనంలో ప్రతిష్ఠించాలని కోరుకున్నారు.

దేశ రాజధానిలో ఆ చారిత్రక ప్రాంతాన్ని సెంట్రల్ విస్టా అభివృద్ధి పథకం పేరుతో తీర్చిదిద్దాలనీ, అందులో భాగంగా చేపట్టే కట్టడాలన్నీ భారత్ సాధించిన ఘనతను ప్రతిబింబించేవిగా ఉండాలనీ ప్రధాని ఆశించారు. అందులో భాగమే పార్లమెంట్ కొత్త భవనం. అందుకు తగ్గట్టే నిర్మాణం పూర్తి చేసుకున్నది. ప్రజాస్వామ్యానికి మూలస్థానం పార్లమెంట్ భవనం. భారతదేశం పురోగమన దిశగా వేసిన అడుగులను చూపుతూనే, సంస్కృతీ సంప్రదాయాల పునాది మీద నిర్మితమైనదే ఈ కొత్త భవనం. ఇక్కడే బీజేపీ, నరేంద్ర మోదీ ఘనత కనిపిస్తుంది. వాస్తు శిల్పి బిమల్ పటేల్ నాయకత్వంలో టాటా ప్రాజెక్ట్ లిమిటెడ్ దీనిని రెండున్నర సంవత్సరాలలో పూర్తి చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టును రూ. 20,000 కోట్లతో ప్రారంభించగా, అందులో రూ. 971 కోట్లు పార్లమెంట్ భవంతికి వెచ్చించారు. లోక్‌సభ ప్రాంగణంలో 888 మంది ఆసీనులు కావచ్చు. పార్లమెంట్ ఉభయ సభల సమావేశానికి కూడా ఇది సరిపోతుంది. రాజ్యసభలో 384 మంది కూర్చోవచ్చు. భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని నిర్మించారు. ప్రత్యక్షంగా రెండు వేల మంది, పరోక్షంగా తొమ్మిదివేల మంది కార్మికులు నిర్మాణంలో పాలు పంచుకున్నారు. భారతీయ కళా సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది కళాకారులు సేవలు అందించారు. కొత్త భవనం సమున్నత భారత్ కలకు వేదిక కాగలదని ఆశిద్దాం.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ అధ్యక్షుడు

సుపరిపాలనకు సంకేతం!



అభిప్రాయం
డా. డి.వి.జి. శంకర రావు

గొప్ప పనులు మొదట పరిహాసానికి గురవుతాయి. తరువాత వ్యతిరేకతను ఎదుర్కొంటాయి. చివరలో అనుకరించ బడతాయి. ఏ గొప్ప పనికైనా ఈ దశలు తప్పవన్నది పెద్దల మాట. రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం మహానాడు తీర్మానాలు చూస్తే నిజమేననిపించింది. ఏ పథకాలనైతే ఆచరణ సాధ్యం కావని పరిహసించారో, పేదల్ని సోమరులు చేసే విధానాలంటూ వ్యతిరేకించారో వాటినే ... ఆ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్నే .. అంతకు మించి .. అధికారమిస్తే అమలు చేస్తామని ఆ నాయకుడు అంటున్నారు. అసలు ఏ పార్టీయైనా సంక్షేమానికి పూచీ పడుతూ హామీలనైతే ఇస్తుంది. అయితే ఆ హామీలు అధికారం చేతికందేక ఎన్ని గుర్తుంటాయన్నదే అసలు పాయింటు. ముఖ్యమంత్రి జగన్‌కు, ఇతరులకు అదే తేడా. ఆయన ఇచ్చిన హామీలు 98 శాతం పైగా అమల్లోకి రావడం... అదీ నాలుగేళ్లలో అన్నది ఆయనను మిగతా వారికన్నా ప్రత్యేకంగా నిలబెట్టింది. మిగతా పక్షాలన్నీ 'సామాన్యుడిని కేంద్రం'గా చేసి ఆలోచించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

నాలుగేళ్ల క్రితం వరకూ జగన్ కేవలం పోరాట యోధుడు. ప్రజల తరఫున నిరంతరం వారి గొంతుగా వ్యవహరించిన నాయకుడు. ఆయన పటిమనూ, నిజాయితీనీ గుర్తించి రాష్ట్ర ప్రజలు భారీ ఆధిక్యంతో అధికారాన్ని అప్పగించారు. సరిగ్గా నాలుగేళ్ళ క్రితం 2019, మే 30న ఆయన ముఖ్యమంత్రిగా అధికారికంగా సంతకం చేశారు. అక్కడి నుండి ఈ నాలుగేళ్ళూ ప్రజల, రాష్ట్ర ప్రయోజనాలకూ, అభివృద్ధికీ, ఊతమిస్తూ చేసిన సంతకాలన్నీ సుపరిపాలనకు చెరగని సంకేతాలుగా నిలిచాయి. ఎన్ని ఆర్థిక, రాజకీయ ఆటంకాలు ఎదురైనప్పటికీ సమగ్ర అభివృద్ధి దిశగా ఆ సంతకాలు బాటలు వేస్తున్నాయి. నాలుగేళ్లలో రెండేళ్లు కరోనా వల్ల రాబడి కోల్పోయినా, ఆరోగ్య రంగానికీ, ఉపాధి కల్పనకూ అదనపు భారం పడినా పేదల సంక్షేమ రథం ఎక్కడా ఆగలేదు. అర్హులైనవారికీ, ప్రతీ ఇంటికీ ఠంచనుగా సామాజిక భద్రతా కార్యక్రమాలూ, ఆర్థిక సాయాలు చేరాయి. వాటివల్ల పేదల ఆకలి, అవసరాలు తీరడమే కాకుండా, అలా నేరుగా పొందడం వల్ల వారి ఆత్మగౌరవం నిలబడింది. అందరి చేతిలో డబ్బులు చలామణీ అయితే స్థూలంగా ఆర్థిక రంగం గాడిన పడుతుంది. ఆయా కుటుంబాల ఎదుగుదలకు మాత్రమే కాకుండా అందరి అభివృద్ధికీ అది సోపానమవుతుంది. వాటి విలువ తెలిసిరావడంతోనే ఆ పథకాల్ని తాయిలాలుగా ఈసడించిన విపక్షాలు నేడు ఎన్నికల ముందు అదే పల్లవిని అందుకుంటున్నాయి. ఇది జగన్ దార్శనికతకు ప్రతిపక్షాల పరోక్ష అభినందన అనుకోవాలి మరి.

పల్లెల్లో 'సచివాలయ' వ్యవస్థ ద్వారా ప్రభుత్వపాలన చేరువ కావడం, మానవ వనరుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని విద్యా, వైద్య రంగాలకు, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ నిధులు వెచ్చించడం; పాలనను వికేంద్రీకరించడం, రాజధాని ప్రాంతంతో సహా రాష్ట్రమంతా పేదలకు గూడు కల్పిస్తూ పెద్దఎత్తున ఉచితంగా ఇళ్ళు కట్టి ఇవ్వడం లాంటి కార్యక్రమాలు సున్నితమైన పాలనకు, సుపరిపాలనకు ఆనవాళ్లు. అందుకనే జగన్ సంతకం.. సామాన్యుడి సంక్షేమానికి ఊతం... ఒక నమ్మకమైన భరోసా.

వ్యాసకర్త మాజీ ఎంపీ, పార్వతీపురం
మొబైల్: 94408 36931

ఇదే కదా అభివృద్ధి అంటే...



సందర్భం
డా॥ ఎమ్.వి.జె. భువనేశ్వరరావు

చారిత్రాత్మకమైన నవ్యాంధ్ర ప్రదేశ్ సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసి, జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేక, ప్రజలకు ఆయనపైన అపారమైన నమ్మకం, అభిమానమైతే ఉన్నాయి గాని అనుభవం, పరిపాలన దక్షతల విషయమై కొంత అనుమానం ఉండేది. వాటన్నిటినీ పటాపంచలు చేస్తూ, అనతి కాలంలోనే అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న ముఖ్యమంత్రిగా 'టాప్ 5'లోకి దూసుకెళ్లారు జగన్. వినూత్నమైన, విస్పష్టమైన పథకాలతో పేద ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా 'నవరత్నాల' పథకాలతో నాలుగేళ్ళ పరిమిత పరిపాలనా వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తూ, ముందుకు సాగిపోతున్నారు. నిజానికి వారు ప్రవేశపెట్టిన ప్రతి పథకం ఓ సామాజిక సంస్కరణ! అమోఘమైన ప్రయోజనాన్ని చేకూర్చి పెడుతున్న ఓ గొప్ప నూతన ఆవిష్కరణ!

'వైఎస్సార్ రైతు భరోసా', 'ఆరోగ్యశ్రీ', 'యువత–ఉపాధి', 'ఫీజు రీయింబర్స్‌మెంట్', 'అమ్మ ఒడి', 'పింఛన్ల పెంపు', 'వైఎస్సార్ ఆసరా', 'వైఎస్సార్ గృహ నిర్మాణం', 'బీసీ సంక్షేమం' – ఈ తొమ్మిదింటినీ అన్న కానుకగా 'నవరత్నాలు' పేరున ప్రతీ కుటుంబానికీ అందిస్తున్నది జగన్ ప్రభుత్వం. ఈ పథకాలు నిజంగా పేద ప్రజల, అన్నార్తుల, వృద్ధుల, రైతుల, వెనుకబడిన వర్గాల నిత్య అవసరాలు! ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి ప్రాణం పోసే వెంటిలేటర్ లాంటి ఆశాదీపాలు! ఇవే గనుక లేకపోతే ఎన్ని కుటుంబాలు ఆకలి మంటల్లో దహించుకుపోయేవో. ఎందరు చిన్నారులు పుస్తకాలని వదిలి, బాల కార్మికులుగా మారిపోయేవారో!

మనిషి ఎదగటమే అభివృద్ధి! కడుపునిండా తినటానికి తిండి దొరకటమూ అంతకన్నా పెద్ద అభివృద్ధి! గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమిట్‌లో ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తలు స్వయంగా పాల్గొని, 13 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టటానికి ప్రపోజల్స్ ఇవ్వటం మాటలు కాదు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో మూడేళ్ళుగా ఏపీని నంబర్‌వన్‌గా నిలవటం, ఒక్కసారిగా 4 పోర్టులూ, 10 షిప్పింగ్ హార్బర్లూ ఏర్పాటు చేయడం సామాన్య విషయమేనా? 16 క్రొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలనూ, 10,592 గ్రామ, వార్డు క్లినిక్‌లనూ ఏర్పాటు చేసి, 48,639 మంది వైద్యులూ, సిబ్బందినీ నియమించుకుని, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించడం ప్రజారోగ్య రంగంలో ఓ విప్లవం. 'నాడు–నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్కూళ్ళకు దీటుగా, ఒకింత మిన్నగా తీర్చిదిద్దటం, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యా కానుక, అమ్మ ఒడి, వైఎస్సార్ పోషణ, కంటి వెలుగు పథకాలతో విద్యా వ్యవస్థలో నూతన నోత్తేజాన్ని నింపటం మామూలు సంగతి కాదు. ముప్ఫయి మూడు లక్షల ఇళ్ళు నిర్మించి, పేదలకి పంచి పెట్టటం, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయటం, వాలంటీర్లతో కలిపి నాలుగేళ్ళలోనే ఏడు లక్షల ఉద్యోగాలను కల్పించడం, ప్రత్యేక కార్పొరేషన్‌గా ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన ఉద్యోగుల్ని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చటం... ఉద్యోగ కల్పనా రంగంలో ఎవరైనా ఊహించారా?



ఆటో డ్రైవర్లకూ, అనేక మంది కుల వృత్తుల వారికీ పదివేల ఆర్థిక సాయాన్ని ప్రతీ ఏటా క్రమం తప్పకుండా చెల్లించటం, మూడు రాజధానుల నిర్మాణం, క్రొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఇరవై ఆరు జిల్లాల ఏర్పాటు, రైతుల ఉచిత విద్యు త్తుకు ముప్ఫ యేళ్ళపాటు ఢోకా లేకుండా దేశంలోనే అతి పెద్దదైన సోలార్ పవర్ ప్లాంట్ నెలకొల్పటం, కడప స్టీల్ ప్లాంట్, వెలిగోడు, పోలవరం సహా అనేక నీటి పారుదల ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయటం, 'దిశ' పోలీస్ స్టేషన్లను ప్రారంభించటం, వందేళ్ళ తర్వాత నిర్వహిస్తోన్న భూముల రీ సర్వే 'జగనన్న భూరక్ష, భూహక్కు' పేరుతో ఎక్కడా లేని విధంగా పౌరుల ఆస్తులకు శాశ్వత రక్షణగా నిలిచిపోవటం – ఇలా అడుగడుగునా రాష్ట్రంలో ప్రజాసంక్షేమం, ఆర్థిక వ్యవస్థల పుష్టి కొరకు ముందుకు సాగడమే కదా అభివృద్ధి అంటే!

అరచేతితో సూర్యోదయాన్ని ఆపలేం... అబద్ధపు వార్తలతో అభివృద్ధిని కప్పి పుచ్చలేం. దుష్ప్రచారంతో స్వచ్ఛమైన ప్రజల మనసులను కలుషితం చేయలేం. మతం పేరు చెప్పినా, కుల ప్రస్తావన తెచ్చినా, తప్పులు ఒప్పులైపోవు. పది అబద్ధాలు కలిసినా, ఎర్ర సూర్యులు నల్లగా మారి పోయినా, నటులంతా పొత్తు పెట్టుకున్నా, నిజం ఓడిపోదు, మంచి గెలవక పోదు. తథాస్తు!

వ్యాసకర్త డిప్యూటీ జనరల్ మేనేజర్, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ । 85006 69505

రైతు బజార్లలో సేంద్రీయ ఉత్పత్తులు

సాక్షి, అమరావతి: సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రయోజనం కలగజేస్తోంది. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 8.82 లక్షల ఎకరాల్లో 8 లక్షల మంది రైతులు ప్రకృతి సాగు చేస్తున్నారు. అయితే కొద్ది మంది రైతులు మాత్రమే ఈ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకోగలుగుతున్నారు. మెజార్టీ రైతులు మధ్యవర్తుల ద్వారా బహుళ జాతి సంస్థలకు చెందిన మార్ట్‌లకు విక్రయిస్తున్నారు. వీరికి తగిన గిట్టుబాటు ధర రావడంలేదు. దీనిని దృష్టిలో పెట్టుకొని మధ్యవర్తులకు ఆస్కారం లేకుండా రైతులు పండించిన పంటలను రైతు బజార్లలో వారే అమ్ముకొనేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం రైతుబజార్లలో కనీసం రెండు స్టాల్స్ కేటాయించనుంది. ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేసిన పండ్లు, కూరగాయలు, ఆహార ధాన్యాలు, తేనె, డెయిరీ ఉత్పత్తులతోపాటు స్థానికంగా దొరికే ఆర్గానిక్ ఉత్పత్తులను ఈ స్టాల్స్‌లో విక్రయిస్తారు. వీటి కేటాయింపులో రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో పాటు రైతులకు కూడా ప్రాధాన్యత ఇస్తారు. ఈ సంఘాలు, రైతుల ఎంపికను అత్యంత పారదర్శకంగా జిల్లా స్థాయిలో ఏర్పాటయ్యే కమిటీల ద్వారా చేపడతారు. చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యతనిస్తారు. ఈ స్టాల్స్ అందరినీ ఆకట్టుకొనేలా ప్రత్యేకంగా రూపొందించారు. ఉత్పత్తుల నిల్వకు, మంచినీరు, విద్యుత్‌తో పాటు వ్యర్థాలను డంపింగ్ చేసేందుకు కూడా ఏర్పాట్లు చేస్తారు. రైతులు పాటించే ఉత్తమ యాజమాన్య పద్ధతులపై వర్క్‌షాపులు నిర్వహిస్తారు. రైతులు, వినియోగదారుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుంటూ వారికి కావాల్సిన విధంగా వసతులు, ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతారు.

వచ్చే ఎన్నికల్లో మాది ప్రముఖపాత్ర

కాపు సంక్షేమసేన వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ హరిరామజోగయ్య


మాట్లాడుతున్న హరిరామజోగయ్య

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో ప్రస్తుత పాలనలో కాపులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని కాపు సంక్షేమసేన వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య చెప్పారు. ఈ పరిస్థితుల నుంచి కాపులను రక్షించడానికి రానున్న ఎన్నికల్లో, రాష్ట్ర రాజకీయాల్లో కాపు సంక్షేమసేన ప్రముఖపాత్ర పోషిస్తుందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో సోమవారం జరిగిన రాష్ట్ర కాపు సంక్షేమసేన ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రభుత్వం స్థాపించే దిశగా జనసేన అభ్యర్థులను గెలిపించడమే కాకుండా జనసేన కూటమిలో పోటీచేసే అభ్యర్థుల విజయానికి ముఖ్య భూమిక పోషిస్తామని చెప్పారు. తద్వారా కాపులకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. జనసేన పార్టీకి, పవన్‌కళ్యాణ్‌కు కాపు సంక్షేమసేన పూర్తి సహకారం అందిస్తుందన్నారు. పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయడం ద్వారా కాపులకే కాకుండా బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కాపులకు విద్య, వైద్యం, ఉపాధి వంటి విషయాల్లో సహకారం అందించడం, చిన్న, సన్నకారు రైతులకు ఎరువులు, విత్తనాల విషయంలో చేయూతనివ్వడం వంటి అంశాలపై ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో సంక్షేమసేన గౌరవాధ్యక్షుడు ఇర్రింకి సూర్యారావు, ఉపాధ్యక్షుడు మల్లినీడి తిరుమలరావు, 26 జిల్లాల అధ్యక్షులు, 13 ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్లు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, వివిధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు.

బెంగళూరు ఎయిర్‌పోర్టులో రూ.30 కోట్ల కొకైన్ పట్టివేత

ఆఫ్రికాలోని లైబీరియా దేశానికి చెందిన మహిళ అరెస్టు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.30 కోట్ల విలువైన కొకైన్‌ను అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఈ నెల 27న తెల్లవారుజామున ఇథియోపియా ఎయిర్‌లైన్స్ విమానంలో 38 ఏళ్ల మహిళా ప్రయాణికురాలు బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అనుమానం వచ్చిన డీఆర్ఐ అధికారులు ఆ మహిళను తనిఖీ చేశారు. ఆమె సూట్‌కేస్ అడుగున రహస్యంగా దాచిన రెండు కేజీల కొకైన్ బయటపడింది. దాని విలువ రూ.30 కోట్లు ఉంటుందని అంచనా. ఆమె ఆఫ్రికాలోని లైబీరియా దేశవాసి అని, అడిస్ అబాబాలో విమానం ఎక్కిందని, టూరిస్ట్ వీసాపై భారత్‌కు తొలిసారిగా వచ్చిందని అధికారుల విచారణలో తేలింది. ఆమెను నార్కొటిక్ చట్టం కింద అరెస్టు చేశారు.







భర్త మృతదేహానికి ఇంట్లోనే అంత్యక్రియలు

- మంచానికి పరిమితమైన భర్తకు ఏళ్ల తరబడి సపర్యలు చేసిన భార్య
- భర్త మరణించాడని తెలిసి డిప్రెషన్‌లోకి..
- చివరకు కాగితాలు, చీరలు వేసి దహన సంస్కారాలు
- పత్తికొండలో హృదయ విదారక ఘటన


పత్తికొండలో మంటల్లో కాలిబూడిదైన మృతదేహం

పత్తికొండ రూరల్ (కర్నూలు): అనారోగ్యంతో చనిపోయిన భర్తకు ఇంట్లోనే దహన సంస్కారాలు చేసిన ఉదంతమిది. ఈ హృదయ విదారక ఘటన కర్నూలు జిల్లా పత్తికొండలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ మురళీమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తికొండలోని తేరు బజారులో మెడికల్ షాపు నిర్వహిస్తున్న హరికృష్ణప్రసాద్ (63)కు భార్య లలితమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కన్నబిడ్డలకు ఎలాంటి లోటులేకుండా పెంచిపెద్ద చేసి ఉన్నత చదువులు చదివించారు. ఇద్దరికీ పెళ్లిళ్లు కూడా చేశారు. పెద్ద కుమారుడు దినేష్ ఎంబీబీఎస్ పూర్తి చేసి కర్నూలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ అక్కడే భార్యతో కాపురం ఉంటున్నారు. రెండో కుమారుడు ముఖేష్ కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. పదేళ్ల కిందట హరికృష్ణ ప్రసాద్‌కు పార్కిన్సస్ ప్లస్ వ్యాధి సోకింది. మరికొన్ని రోజులకు పక్షవాతంతో కాళ్లు చేతులు చచ్చుబడిపోయి మంచానికే పరిమితమయ్యాడు. కాలకృత్యాలు కూడా తీర్చుకోలేని దయనీయ స్థితిలో ఉన్న అతనికి భార్య లలితమ్మ సపర్యలు చేస్తూ వచ్చింది. ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో మూడేళ్ల నుంచి కర్నూలులో కుమారుడు దినేష్ వద్దే దంపతులిద్దరూ ఉన్నారు. రెండు వారాల క్రితం ఇద్దరూ పత్తికొండకు చేరుకున్నారు.

కాగితాలు.. చీరలు వేసి నిప్పు

కాగా, సోమవారం వేకువజామున భర్త హరికృష్ణప్రసాద్‌కు భార్య లలితమ్మ కాలకృత్యాలు తీర్చింది. ఆ తరువాత కొద్దిసేపటికి విగతజీవిగా పడి ఉన్న భర్తను చూసి గుండె పగిలేలా రోదించింది. ఆ తరువాత తేరుకుని టెంకాయ కొట్టి.. మృతదేహంపై ఇంట్లోని పుస్తకాలు చింపి కాగితాలు, చీరలు వేసి నిప్పు పెట్టింది. ఆ తరువాత పెద్దకుమారుడు దినేష్‌కు వీడియో కాల్ చేసి విషయం చెప్పింది. ఆ ఇంట్లోంచి పొగలు రావడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ మురళీమోహన్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకోగా.. అప్పటికే మృతదేహం పూర్తిగా కాలిపోయింది. లలితమ్మ మానసిక పరిస్థితి సరిగా లేదని సీఐ తెలిపారు. ఇంట్లోనే మృతదేహం కాల్చిన ఘటన దావానలంలా వ్యాపించింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల కాలనీవాసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కంటికిరెప్పలా కాపాడుకుంటూ ఇన్నేళ్లు సపర్యలు చేసిన ఆమె భర్త మృతదేహాన్ని ఇంట్లోనే కాల్చివేసిందంటే నమ్మలేకపోయారు. లలితమ్మ నిత్యం దైవారాధనలో ఎక్కువగా గడిపేదని కాలనీవాసులు తెలిపారు.


భార్య, కుమారులతో మృతుడు హరిప్రసాద్ (ఫైల్)

నోట మాట రాలేదు

అమ్మ ఉదయం 9.30 గంటలకు ఫోన్ చేసింది. 'నాన్న చనిపోయాడు. ఇంట్లోనే దహన సంస్కారాలన్నీ పూర్తి చేశాను. మీరేం రాకండి' అని చెప్పింది. ఆ మాట విని షాక్‌కు గురయ్యాను. వెంటనే పోలీసులకు సమాచారం అందజేసి పత్తికొండ చేరుకున్నాను. ఇంట్లోకి వెళ్లగా కాలిన నాన్న మృతదేహం చూసి నా నోట మాట రాలేదు. అమ్మ పూర్తిగా డిప్రెషన్‌కు గురైంది. అమ్మ దగ్గరకు వెళ్లి ఓదార్చాను. కెనడాలో ఉన్న తమ్ముడు ముఖేష్‌కు ఫోన్ చేశాను. వెంటనే బయల్దేరి వస్తున్నానని చెప్పాడు.

– దినేష్, పెద్ద కుమారుడు

చంద్రబాబును తరిమికొడతాం

974వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: పేదవాడికి జానెడు జాగా లేకుండా చేయాలనే దుర్మార్గపు ఆలోచనతో కోర్టులకెళ్లిన టీడీపీ అధినేత చంద్రబాబును రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు బహుజనులంతా సిద్ధంగా ఉన్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 974వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడారు. 14 సంవత్సరాల్లో పేదవాడికి ఎలాంటి మేలు చేయని చంద్రబాబు.. ఇప్పుడు మేనిఫెస్టో పేరుతో తప్పుడు హామీలిచ్చి మోసం చేయాలని చూడడం సిగ్గుచేటన్నారు. అమ్మకు బువ్వ పెట్టనివాడు పిన్నమ్మకు బంగారు గాజులు కొనిపెడతానని చెప్పిన చందంగా బాబు హామీలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. బాబును నమ్మి భూములిచ్చిన అమరావతి రైతులు ఇప్పటికే నట్టేట మునిగారని, ఇకనైనా వారంతా ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాల పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వ్యక్తులపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య, బొలిమేర శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.


ఆగిరిపల్లి సాక్షి విలేకరి ఆకస్మిక మృతి


చంద్రశేఖర్ (ఫైల్)

నూజివీడు: ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం సాక్షి విలేకరి అస్సానుబాదు చంద్రశేఖర్ (40) సోమవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. చంద్రశేఖర్ పదేళ్లుగా ఆగిరిపల్లి మండలానికి సాక్షి విలేకరిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. చంద్రశేఖర్‌కి భార్య, ఏడేళ్ల కుమారుడు ఉన్నారు. పలువురు ప్రముఖులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఫలించిన మూడు దశాబ్దాల న్యాయ పోరాటం

- హథీరాంజీ మఠం భూమి 25 ఎకరాలపై కౌలుదారుల పోరాటం
- హైకోర్టు సానుకూల తీర్పు.. ఫలితం అందుకున్న బిడ్డలు
- మఠం భూమిని 1957 నుంచి సాగు చేస్తున్న కౌలుదారులు
- వారికే భూమి విక్రయానికి నిర్ణయించిన మఠం
- ఇందుకు అనుమతిస్తూ 1990లో జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఈ జీవోను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్లు
- జీవోను రద్దు చేస్తూ 2002లో సింగిల్ జడ్జి తీర్పు
- అప్పీల్ దాఖలు చేసిన కౌలుదారులు
- సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసిన ధర్మాసనం



సాక్షి, అమరావతి: చిత్తూరు జిల్లా తిరుపతిలో స్వామి హథీరాంజీ మఠానికి చెందిన 25.36 ఎకరాలపై రక్షిత కౌలుదారులు మూడు దశాబ్దాలుగా చేస్తున్న న్యాయ పోరాటం ఫలించింది. ఈ కేసులు పెండింగ్‌లో ఉండగానే తల్లిదండ్రులు మరణించడంతో వారి పిల్లలు చట్టబద్ధ వారసులుగా న్యాయ పోరాటాన్ని కొనసాగించారు. ఫలితం అందుకున్నారు. ఈ భూమిని సాగు చేసుకుంటున్న రక్షిత కౌలుదారులకే విక్రయించేందుకు మఠం సంరక్షకునికి అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 1990లో జారీ చేసిన జీవో 751ని రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం రద్దు చేసింది. వేలంలో కాకుండా, మఠానికి పూర్తిస్థాయి సంరక్షకుడు లేకుండా భూములను విక్రయించడానికి వీల్లేదన్న సింగిల్ జడ్జి తీర్పును ధర్మాసనం తప్పుపట్టింది. ఆ భూముల విక్రయం ప్రతిపాదనను మఠాధిపతి సర్జుదాస్ 1979లోనే తీసుకొచ్చారని గుర్తు చేసింది. 1957 నుంచి ఆ భూములు రక్షిత కౌలుదారుల సాగులోనే ఉన్నాయని, వాటిని వారి నుంచి స్వాధీనం చేసుకోవడం న్యాయపరంగా చాలా కష్టమని భావించడం, వివాదాలకు ఆస్కారం ఉండకూడదన్న ఉద్దేశంతోనే ఆ భూములను వారికే విక్రయించడం మేలని మఠం సంరక్షకుడు చెప్పిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

ఇదీ నేపథ్యం: హథీరాంజీ మఠానికి తిరుపతిలోని సర్వే నంబర్లు 51/1, 54/2లో ఉన్న 25.36 ఎకరాలను ఎం.చెంగమ్మ, టి.మునుస్వామి నాయుడు 1957 నుంచి రక్షిత కౌలుదారులుగా సాగు చేస్తున్నారు. ఆ తరువాత వారికి మఠం మహంత్ శాశ్వత లీజు మంజూరు చేశారు. మహంత్ మరణం తరువాత 1966లో ఆ లీజు రద్దయింది. అయినా వారు లీజు డీడ్‌ల ద్వారా కొనసాగుతున్నారు. 1980లో అప్పటి మహంత్ సస్పెండ్ అయ్యారు. మఠానికి సంరక్షకుడు నియమితులయ్యారు. అనంతరం ఆ భూమిని కౌలుదారులకే విక్రయించాలని మఠం నిర్ణయించింది. దీనిపై వి.నాగమణి, డి.కుప్పుస్వామి నాయుడు మరికొందరు అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వం ఈ అభ్యంతరాలను తోసిపుచ్చుతూ రక్షిత కౌలుదారులకే భూమిని విక్రయించేందుకు అనుమతిస్తూ 1990లో జీవో 751 జారీ చేసింది. ఈ జీవోను సవాలు చేస్తూ నాగమణి తదితరులు హైకోర్టులో అదే ఏడాది పిటిషన్ వేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. జీవో 751ని రద్దు చేస్తూ 2002లో తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ చెంగమ్మ తదితరులు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. అనంతరం చెంగమ్మ, ఆమె భర్త వెంకట్రామనాయుడు మరణించడంతో వారి పిల్లలు ఈ వ్యాజ్యంలో చట్టబద్ధ వారసులుగా చేరారు. ఈ అప్పీల్‌పై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తుది విచారణ జరిపి ఇటీవల తీర్పునిచ్చింది.

శారద నదిలో ఇద్దరు బాలురు గల్లంతు

కశింకోట (అనకాపల్లి జిల్లా): ఈత సరదా ఇద్దరు విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకున్న ఘటన అనకాపల్లి జిల్లా కశింకోట మండలం వెదురుపర్తిలో సోమవారం జరిగింది. ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి కథనం ప్రకారం.. నక్కపల్లి మండలం చందనాడకు చెందిన ఏడిద ప్రసాద్ (17), యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలేనికి చెందిన పిల్లి అనిల్ (14) బావా బావమరుదులు. వీరు వెదురుపర్తిలోని తమ తాత గారింటికి వేసవి సెలవులకు వచ్చారు. సమీపంలోని శారదానదిలో సరదాగా స్నానం చేయడానికి దిగి మునిగిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు.



గన్‌మెన్‌లతో దస్తగిరి దాదాగిరి

రైల్వేకోడూరు ప్రధాన రహదారిపై హల్‌చల్

- దౌర్జన్యంగా మూడు షాపులకు తాళాలు
- రూ.2.5 కోట్ల ఆస్తి సెటిల్‌మెంట్‌కు వీరంగం
- ముందురోజు రాత్రి సీఐ కార్యాలయంలో చర్చలు
- వైఎస్ వివేకా హత్య కేసులో నిందితుడి ఆగడాలు


పోలీస్‌స్టేషన్ ఎదుటే గన్‌మెన్‌లతో హల్‌చల్ చేస్తున్న దస్తగిరి

సాక్షి ప్రతినిధి, కడప/రైల్వేకోడూరు: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో బెయిల్‌పై ఉన్న ప్రధాన నిందితుడు దస్తగిరి దర్జాగా సెటిల్‌మెంట్లకు తెగబడుతున్నాడు. సీబీఐ సిఫార్సుల మేరకు ఐదుగురు గన్‌మెన్లను సమకూర్చుకుని పోలీస్ స్టేషన్ వద్దే దర్జాగా బహిరంగంగా బెదిరింపులకు దిగడం నివ్వెరపరుస్తోంది. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నడిబొడ్డున సోమవారం పట్టపగలు మూడు షాపులకు తాళాలు వేసిన దస్తగిరి వాటిని ఖాదర్‌వలీ అనే వ్యక్తికి అప్పగించాలంటూ బెదిరింపులకు దిగాడు. పోలీస్‌స్టేషన్ పక్కనే గన్‌మెన్లతో హల్‌చల్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.

30 ఏళ్లుగా షాపులు నిర్వహిస్తున్నా..

రైల్వే కోడూరులో అబ్దుల్ వాహిద్, శివయ్యానాయుడు, వైష్ణవి మెడికల్స్‌కు చెందిన సుబ్బరాయుడికి పోలీస్‌స్టేషన్ పక్కనే మూడు షాపులున్నాయి. వాటిని 30 ఏళ్లుగా అద్దెకు ఇచ్చారు. వాటి విలువ సుమారు రూ.2.5 కోట్లకు పైబడి ఉంటుంది. అయితే ఆ మూడు షాపులు ఖాదర్‌వలీ అనే వ్యక్తివి అంటూ దస్తగిరి రంగప్రవేశం చేశాడు. డాక్యుమెంట్లు ఉన్నాయని, మీరంతా ఖాళీ చేయాలంటూ వీరంగం వేశాడు. దీనిపై ఆదివారం రాత్రి స్థానిక సీఐ విశ్వనాథరెడ్డి కార్యాలయంలో ఇరు వర్గాల మధ్య చర్చలు సాగాయి. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం దస్తగిరి రెండు కార్లలో అక్కడికి చేరుకున్నాడు. ఐదుగురు గన్‌మెన్లను వెంట బెట్టుకొని ప్రధాన రహదారిలో నడుచుకుంటూ వెళ్లి మూడు షాపులకు తాళాలు వేశాడు. అనంతరం పెద్ద మనుషుల సూచన మేరకు జిరాక్స్ డాక్యుమెంట్లు తీసుకొని 10 రోజుల్లో తిరిగి వస్తానంటూ హెచ్చరించాడు. రైల్వేకోడూరుకు చెందిన ఖాదర్‌వలీ ఆ షాపులు తనవేనని ఏనాడూ ముందుకొచ్చిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. ఈ ఘటనకు సంబంధించి రైల్వే కోడూరు పోలీసులకు ఫిర్యాదు అందింది.

మందు, ముక్క.. విలాస జీవితం

వివేకా హత్య కేసులో నిందితుడైన దస్తగిరి విలాస జీవితం గడుపుతూ తరచూ దందాలు, దౌర్జన్యకాండకు దిగుతున్నాడు. కష్టపడితేనే పూట గడిచే స్థితి నుంచి ఖరీదైన కార్లలో తిరిగే స్థాయికి చేరుకున్నాడు. అతడిప్పుడు చుక్క, ముక్క లేకుండా భోజనం చేసే పరిస్థితి లేదు. ఖరీదైన స్కాచ్ ఎప్పుడూ వెంట ఉండాల్సిందే. ప్రైవేట్ పంచాయితీలు నిత్యకృత్యమయ్యాయి. సెటిల్‌మెంట్లపై దృష్టి పెట్టాడు. ప్రాణరక్షణ పేరిట ఐదుగురు గన్‌మెన్లను సమకూర్చుకుని దౌర్జన్యాలకు తెగబడుతున్నాడు.

పోలీస్ స్టేషన్లలోనే దాడులు..

అప్రూవర్‌గా మారిన దస్తగిరి పోలీసులను సైతం లెక్కచేయడం లేదు. ఏకంగా పోలీసు స్టేషన్లలోనే దౌర్జన్యాలు, దాడికి తెగబడుతున్నాడు. వైఎస్సార్ జిల్లా తొండూరులో మల్లెల గ్రామానికి చెందిన పెద్ద గోపాల్ అనే వ్యక్తిపై పోలీసు స్టేషన్‌లోనే దస్తగిరి దాడి చేశాడు. ఈ మేరకు క్రైమ్ నంబర్ 41/2022 కింద 2022 మే 29న కేసు నమోదైంది. అదే మండలంలో ఎలక్ట్రిక్ ఉపకరణాల చౌర్యం కేసు కూడా 2022 ఆగస్టు 2న దస్తగిరిపై నమోదైంది.

- ▲ శ్రీకాళహస్తిలో దర్గా స్థలంపై 20 ఏళ్లుగా ముస్లిం కుటుంబాల మధ్య నెలకొన్న వివాదంలో బెదిరింపులకు పాల్పడిన ఘటనకు సంబంధించి ఖాదర్‌బాషా అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు దస్తగిరిపై క్రైమ్ నెంబర్ 121/2022 కేసు నమోదైంది.
- ▲ వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల కేంద్రంగా ఫైనాన్స్ వాహనాల సీజ్, వ్యక్తుల మధ్య ఉన్న విభేదాల్లో తలదూరుస్తూ దస్తగిరి సెటిల్‌మెంట్లకు దిగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

ఏ దస్తగిరి అంటావేంటీ..?

బెయిల్‌పై ఉన్న నిందితుడు దస్తగిరి షరతులను ఉల్లంఘిస్తూ విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాడు. ''హలో... నేను దస్తగిరిని మాట్లాడుతున్నా! ఏ దస్తగిరి అంటావేంటీ..? వైఎస్ వివేకానందరెడ్డిని చంపిన దస్తగిరిని'' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బెయిల్ షరతులేవీ తనకు వర్తించవన్న రీతిలో యథేచ్ఛగా దౌర్జన్యాలకు దిగుతున్నాడు.

జనరంజకంగా నాలుగేళ్ల పాలన

సాక్షి, అమరావతి: నవ్యాంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ జనరంజకంగా నాలుగేళ్ల పాలనను పూర్తి చేసుకుని ఐదో ఏడాదిలోకి అడుగుపెడుతోందని వైఎస్సార్‌సీపీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. 2014 – 2019 మధ్య టీడీపీ ఐదేళ్ల పాలనతో కుదేలైన రాష్ట్ర ప్రజలను ఆదుకునేందుకు ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుంచే సీఎం జగన్ అంకితమయ్యారన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నిరంతరం జనామోదం

ప్రమాణ స్వీకార వేదిక పైనుంచే వృద్ధాప్య పింఛన్ల పెంపు ఫైలుపై సీఎం జగన్ సంతకం చేశారు. ఎన్నికల వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేశామని ఈ నెల 23న సీఎం జగన్ ట్విట్టర్ ద్వారా చేసిన ప్రకటన అక్షర సత్యం. మరోసారి రాష్ట్ర ప్రజలకు సేవ చేసేందుకు మొత్తం 175 అసెంబ్లీ స్థానాలను గెలుచుకునే దిశగా అడుగులు వేయడం వైఎస్సార్ సీపీ


విజయసాయిరెడ్డి

ఆత్మవిశ్వాసం, పాలక పక్షం పట్ల ప్రజల అనుకూల దృక్పథాన్ని ప్రతిబింబిస్తోంది. సాధారణంగా నాలుగేళ్ల పరిపాలన తర్వాత ఏ ప్రభుత్వమైనా ప్రజల్లో వ్యతిరేకత, అసంతృప్తిని ఎదుర్కొంటుంది. అలాంటిది ఏపీలో నాలుగేళ్లుగా ప్రభుత్వ పాలన పట్ల జనామోదం నిరంతరం వ్యక్తమవుతూనే ఉంది. స్థానిక సంస్థలతోపాటు శాసనమండలి ఎన్నికల్లోనూ పాలక పక్షానికి నీరాజనం పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రజలకు రూ.లక్షల కోట్ల మేర సాయం ఇంత సాఫీగా అందడం ఇదే మొదటిసారి. సంక్షేమ పథకాలను నగదు బదిలీ ప్రక్రియ ద్వారా అమలు చేయడం వల్ల అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పోయింది. ప్రతిపక్షాల అభాండాలు, అడ్డంకులను విజయవంతంగా అధిగమిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రగతి పథంలో దూసుకెళుతూ అన్ని రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. పలు రాష్ట్రాల ప్రతినిధులు ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలను అధ్యయనం చేయడానికి రావడం గర్వ కారణం.

సీఎం జగన్ నిర్దేశించినట్లుగా..

ఆధునిక ప్రజాస్వామ్యంలో అత్యధిక పాలక పార్టీలు వచ్చే ఎన్నికల్లో విజయం గురించే ఆలోచిస్తాయి. అలాంటి పార్టీలకు గెలుపు మినహా ప్రజల గోడు పట్టదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం అన్ని వర్గాల మేలు కోరుతూ పరిపాలన సాగిస్తోంది. కొత్త పథకాలకు రూపం ఇస్తూ ప్రజా సేవకు మరోసారి అంకితమవుతోంది. పార్టీ నేతలు, కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్యన గడపటమే కాకుండా వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ఎల్లవేళలా సేవలందిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెలుగునాట కొత్త అధ్యాయానికి తెరతీసింది. ప్రజల మేలు కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ వ్యవస్థలన్నీ క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. ముఖ్యమంత్రి జగన్ నిర్దేశించినట్లుగా మొత్తం 175 స్థానాలను గెలుచుకునే దిశగా వైఎస్సార్‌సీపీ సాగడం తెలుగు వారికి శుభ పరిణామం.

కొత్త పార్లమెంట్ భవనానికి విశాఖ ఉక్కు

దాదాపు 6 వేల టన్నుల వరకు అందించిన స్టీల్‌ప్లాంట్

సాక్షి, విశాఖపట్నం: ఓవైపు ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నా.. విశాఖ ఉక్కు మాత్రం.. నూతన పార్లమెంట్ భవన నిర్మాణంలో కీలక పాత్ర పోషించింది. పార్లమెంట్ భవన నిర్మాణానికి అవసరమైన స్టీల్‌ని వైజాగ్‌స్టీల్‌ప్లాంట్ సరఫరా చేసింది. ఇందుకు అవసరమైన మొత్తం 6 వేల టన్నుల ఉక్కును అందించినట్లు ఆర్‌ఐఎన్ఎల్ ప్రకటించింది. భవన నిర్మాణం కోసం వినియోగించే 8 ఎంఎం నుంచి 24, 32 ఎంఎం వరకూ లాంగ్ స్టీల్ ఉత్పత్తుల్ని పంపించినట్లు స్టీల్‌ప్లాంట్ వర్గాలు వెల్లడించాయి.

జూన్ నుంచి రాయలసీమలో రాగుల పంపిణీ

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా వచ్చే నెలనుంచి చిరుధాన్యాలను పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే నంద్యాల జిల్లాలో జొన్నలు సరఫరా చేస్తుండగా.. జూన్ నుంచి కర్నూలు, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో రాగులను పంపిణీ చేస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఆసక్తి మేరకు కార్డు ఒక్కింటికీ గరిష్ఠంగా మూడు కిలోల బియ్యం బదులు ఉచితంగా రాగులు పొందవచ్చని పేర్కొన్నారు. జూలై నుంచి రాయలసీమలోని ఇతర జిల్లాల్లో కూడా చిరుధాన్యాల పంపిణీని ప్రారంభిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2023ను మిల్లెట్ సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో పాటు ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు చేపడుతోందని వివరించారు. ఎండీయూ వాహనాల్లో ఇంటి వద్దకే రేషన్ పంపిణీలో సమస్యలుంటే 1967 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

టోఫెల్ అర్హతతో కెనడాలోనూ చదవొచ్చు



న్యూఢిల్లీ: టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఎ ఫారిన్ లాంగ్వేజ్) స్కోరు ఆధారంగా విదేశీ విద్యార్థులు కెనడాలోనూ ఉన్నత విద్యనభ్యసించవచ్చని ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్(ఈటీఎస్) తెలిపింది. కెనడా ప్రభుత్వ 'స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్(ఎస్‌డీఎస్)'పథకంలో భాగంగా ఉన్నత విద్యనభ్యసించే విదేశీ విద్యార్థులకు ఇకపై టోఫెల్ స్కోరును పరిగణనలోకి తీసుకుంటుందని పేర్కొంది. ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) ఇందుకు ఆమోదం తెలిపిందని వెల్లడించింది. ఇప్పటి వరకు ఎస్‌డీఎస్‌లో ఇంగ్లిష్ అర్హత పరీక్షగా ఐఈఎల్‌టీఎస్‌కు మాత్రమే ఆప్షన్ ఉండేది. ఈ ఏడాది ఆగస్టు 10వ తేదీ నుంచి ఎస్‌డీఎస్‌కు దరఖాస్తు చేసుకునేవారు టోఫెల్ స్కోరును కూడా జత చేసుకోవచ్చని వివరించింది. ఎస్‌డీఎస్ దరఖాస్తుల పరిశీలన దాదాపు 20 రోజుల్లోనే పూర్తవుతుందని ఈటీఎస్ పేర్కొంది. కాగా, టోఫెల్‌ను అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర 160కి పైగా దేశాలకు చెందిన 12 వేల సంస్థలు పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

అర్ధంతరంగా అపాచీ ల్యాండింగ్



భింద్/న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి చెందిన అపాచీ ఎటాక్ హెలికాప్టర్ సోమవారం మధ్యప్రదేశ్‌లోని భింద్ సమీపంలో అర్ధంతరంగా ల్యాండయింది. రోజువారీ శిక్షణ సమయంలో హెలికాప్టర్‌లో కొన్ని అవాంతరాలు తలెత్తడంతో పైలట్ ముందు జాగ్రత్తగా ల్యాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. నిపుణుల బృందం హెలికాప్టర్‌ను పరిశీలిస్తోందని ఐఏఎఫ్ ట్వీట్ చేసింది. ఉదయం 8.45 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనతో ఎవరికీ ఏవిధమైన హాని కలగలేదని, అందులోని సిబ్బంది క్షేమంగా ఉన్నారని పేర్కొంది. కాగా, హెలికాప్టర్ ల్యాండయిన ప్రాంతంలో జనం గుమికూడిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

జీఎస్‌ఎల్‌వీ ప్రయోగం సక్సెస్

కక్ష్యలోకి నావిక్-01 ఉపగ్రహం | దేశీయ నావిగేషన్ వ్యవస్థ బలోపేతం దిశగా ముందడుగు



నిప్పులు చిమ్ముతూ దూసుకెళ్తున్న రాకెట్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): రెండోతరం నావిగేషన్ ఉపగ్రహ సిరీస్‌లో మొదటిదైన ఎన్‌వీఎస్–01 ఉపగ్రహ ప్రయోగం విజయవంతంగా పూర్తయింది. ఇస్రో చేపట్టిన ఈ ప్రయోగానికి ఆంధ్రప్రదేశ్‌లోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లోని రెండో లాంచింగ్‌ప్యాడ్ వేదికైంది. 27.5 గంటల కౌంట్‌డౌన్ ముగిశాక సోమవారం ఉదయం 10.42 గంటలకు ఎన్‌వీఎస్–01 ఉపగ్రహాన్ని 51 మీటర్ల పొడవు, 420 టన్నుల బరువైన జీఎస్‌ఎల్‌వీ రాకెట్ భూమికి దగ్గరగా 173 కిలోమీటర్లు (పెరిజీ), భూమికి దూరంగా 36,568 కిలోమీటర్లు (అపోజీ) దీర్ఘవృత్తాకార భూ బదిలీ కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది. 2,232 కేజీల ఉపగ్రహం అక్కడ స్థిరంగా ఉన్నట్లు బెంగళూరు దగ్గర్లోని హాసన్‌లోని గ్రౌండ్ స్టేషన్‌కు సిగ్నల్స్ అందాయి. జీఎస్‌ఎల్‌వీ వాహకనౌకను వాడటం ఇది 15వ సారి. 2021 ఆగస్టులో ప్రయోగించిన జీఎస్‌ఎల్‌వీ ఎఫ్10 అపజయం పాలవడంతో ఆనాటి క్రయోజనిక్ స్థాయి తప్పిదాలను సరిచేసి ఈసారి ప్రయోగాన్ని విజయవంతం చేశారు. మరో రెండు మూడు రోజుల్లో మూడు దశల్లో పెరీజీని పెంచుతూ అపోజీని తగ్గిస్తూ భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలోకి ఉపగ్రహాన్ని చేరుస్తారు. అమెరికా జీపీఎస్, రష్యా గ్లోనాస్ తరహాలో భారత సొంత నావిగేషన్ వ్యవస్థ అయిన నావ్‌ఐసీ(నావిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టిలేషన్–గతంలో భారత క్షేత్రీయ దిక్సూచీ ఉపగ్రహ వ్యవస్థ)ను బలోపేతం చేసే దిశగా ఈ కొత్త తరం ఉపగ్రహాన్ని ఒక పాత ఉపగ్రహం స్థానంలో భర్తీ చేస్తున్నారు. అయితే ప్రయోగం విజయవంతం కావడంతో షార్‌లోని మిషన్ కంట్రోల్‌రూంలో శాస్త్రవేత్తలు ఒకరితో ఒకరు ఆలింగనం చేసుకుని ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ మాట్లాడారు. ఇది ఇస్రో సాధించిన సమష్టి విజయమని అన్నారు. భారతదేశ నావిగేషన్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నావిక్ సిరీస్ ఉపగ్రహాలను ఆరు నెలకొకసారి ప్రయోగిస్తామని తెలిపారు.

తొలిసారిగా దేశీ అణుగడియారం

ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్ ఇప్పటికే అందుబాటులో ఉంది. దీన్ని మరింత బలోపేతం చేసేందుకు నావిక్ సిరీస్ కొత్త ఉపగ్రహాలు ఎంతగానో దోహదపడతాయి. గతంలో పంపిన ఉపగ్రహాల్లో ఎస్–బ్యాండ్, కె–బ్యాండ్, కేయూ–బ్యాండ్ లాంటి ఉపకరణాలను అమర్చారు. ఈసారి నావిక్–01 ఉపగ్రహంలో ఎల్–1, ఎల్–5, ఎస్–బ్యాండ్ సిగ్నల్స్ వ్యవస్థను అమర్చారు. ఎల్–1లో పౌరులకు ఉపయోగపడే సివిలియన్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌ను పరిచయం చేశారు. సమయం, స్థానం అత్యంత ఖచ్చితంగా తెలిపే తొలిసారిగా దేశీయంగా తయారుచేసిన రుబీడియం అణుగడియారాన్ని ఉపగ్రహంలో అమర్చారు. ఆటమిక్ క్లాక్‌ను తయారుచేస్తే సత్తా ప్రపంచంలో చాలా తక్కువదేశాలకే ఉంది. నావిగేషన్ ఉపగ్రహాల వ్యవస్థలో ఇప్పటికే ఏడు ఉపగ్రహాలు నావిగేషన్ వ్యవస్థను అందిస్తున్నారు. ఇందులో నాలుగు ఉపగ్రహాలకు కాలపరిమితి ముగుస్తుండడంతో వాటి స్థానంలో కొత్తవాటిని పంపుతున్నారు. కొత్త ఉపగ్రహాలతో భూ, జల, వాయు మార్గాల్లో పొజిషన్‌ను 20 మీటర్ల అత్యంత ఖచ్చితత్వంతో, 50 నానోసెకన్ల రియల్‌టైమ్‌తో చూపించడం, అత్యవసర సమయాల్లో భూగోళానికి సంబంధించిన సమాచారం, వాహన చోదకులకు దిశా నిర్దేశం, ఇంటర్నెట్‌తో అనుసంధానం లాంటి ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. భారత విమానయాన, నౌకాయాన మార్గాలకు, సైనిక అవసరాలకు ఈ ఉపగ్రహ వ్యవస్థ దోహదపడుతుంది. దేశానికి ఆవల సైతం 1,500 కిలోమీటర్లదాకా ఈ వ్యవస్థ పనిచేస్తుంది.

సీవీసీగా ప్రవీణ్ శ్రీవాస్తవ



న్యూఢిల్లీ: సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ)గా ప్రవీణ్ కుమార్ శ్రీవాస్తవ నియమితులయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రస్తుత విజిలెన్స్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ శ్రీవాస్తవను సీవీసీగా నియమించారని రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటనలో పేర్కొంది. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆయన రాష్ట్రపతి సమక్షంలో ప్రమాణం చేశారని, కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ కూడా పాల్గొన్నారని తెలిపింది. సీవీసీ సురేశ్ ఎన్ పటేల్ పదవీ కాలం గత ఏడాది డిసెంబర్‌తో పూర్తయింది. అప్పటి నుంచి శ్రీవాస్తవ తాత్కాలిక సీవీసీగా కొనసాగుతున్నారు. సీవీసీగా 65 ఏళ్లు వచ్చే వరకు లేదా నాలుగేళ్ల కాలానికి బాధ్యతల్లో కొనసాగుతారు. 1988 బ్యాచ్ రిటైర్డ్ ఐఏఎస్ అయిన శ్రీవాస్తవ అస్సాం–మేఘాలయ కేడర్‌కు చెందిన వారు. గత ఏడాది జనవరి 31న కేబినెట్ సెక్రటేరియట్ కార్యదర్శిగా పదవీ విరమణ పొందారు. సీవీసీ సారథ్యంలో విజిలెన్స్ కమిషన్‌లో గరిష్ఠంగా ఇద్దరు కమిషనర్లు ఉండొచ్చు. ఐబీ మాజీ చీఫ్ అర్వింద్ ఒక్కరే ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్నారు. మరో కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది.

ఏకైక ఎమ్మెల్యే టీఎంసీలోకి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక శాసనసభ్యుడు బేరోన్ బిశ్వాస్ అధికార టీఎంసీ కండువా కప్పుకున్నారు. పశ్చిమ్ మేదినీపూర్ జిల్లా ఘటాల్‌లో సోమవారం టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటూ దక్కించుకోలేకపోయిన విషయం తెలిసిందే. అయితే, దాదాపు మూడు నెలల క్రితం ముర్షిదాబాద్ జిల్లా సాగర్‌దిఘి నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ టికెట్‌పై బిశ్వాస్ ఎమ్మెల్యేగా గెలుపొంది, అసెంబ్లీలో అడుగుపెట్టారు. తాజా పరిణామంతో బెంగాల్ అసెంబ్లీలో కాంగ్రెస్ మరోసారి ప్రాతినిధ్యం కోల్పోయింది. దీనిపై టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. రాష్ట్రంలోని అధికార పార్టీతో విభేదించాలా లేక కేంద్రంలోని బీజేపీని వ్యతిరేకించాలా తేల్చుకోవాల్సింది నిర్ణయించుకోవాల్సింది కాంగ్రెస్సేనంటూ వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీపై పోరాడుతున్నామంటూ రాష్ట్రంలోని టీఎంసీని వ్యతిరేకించడమనే ద్వంద్వవైఖరిని కాంగ్రెస్ ఇకనైనా ఆపాలని టీఎంసీ ట్వీట్ చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలన్నీ ఏకమవుతున్న వేళ బిశ్వాస్ టీఎంసీలో చేరడం గమనార్హం.

20 సార్లు కత్తితో పొడిచి.. తలపై మోది..

బాలికను దారుణంగా హత్యచేసిన యువకుడు • ఢిల్లీలో ఘోరం

న్యూఢిల్లీ: పదహారేళ్ల బాలికను ఓ 20ఏళ్ల యువకుడు అత్యంత పాశవికంగా అంతమొందించాడు. దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత రద్దీగా ఉండే రహదారిలో అందరూ చూస్తుండగా ఈ హత్య జరిగింది. ఇంతటి ఘోరం జరుగుతున్నా ఏ ఒక్కరూ ముందుకొచ్చి బాలికను కాపాడేయత్నం చేయకపోవడం విషాదం. ఈ ఘటన వాయవ్య ఢిల్లీలోని షాబాద్ డైరీ ప్రాంతంలో జరిగింది. హత్య తర్వాత పారిపోయిన నిందితుడు సాహిల్‌ను ఢిల్లీ పోలీసులు ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ ప్రాంతంలో అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ డైరీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జేజే కాలనీలో ఉండే సాక్షి అనే బాలికకు ఫ్రిడ్జ్, ఏసీలు బాగుచేసే మెకానిక్ సాహిల్‌తో ప్రేమ వ్యవహారం ఉంది. వీరిద్దరూ శనివారం గొడవపడ్డారు. దీంతో కోపం పెంచుకున్న సాహిల్ ఎలాగైనా ఆమెను చంపేయాలని నిర్ణయించుకుని ఆదివారం అదునుకోసం ఎదురు చూశాడు. తన స్నేహితురాలి కుమారుడి పుట్టినరోజు వేడుకలో పాల్గొనేందుకు బాలిక ఆదివారం రాత్రి రహదారిలో వెళ్తుండగా వెంబడించిన సాహిల్ ఆమెపై కత్తితో దాడిచేశాడు. 20సార్లకుపైగా పొడిచాడు. తర్వాత రోడ్డుపై పడి ఉన్న సిమెంట్ శ్లాబ్‌తో తలపై పలుమార్లు మోది చంపేశాడు. ఇంతజరుగుతున్నా అక్కడున్న వాళ్లెవరూ బాలికను కాపాడేందుకు ముందుకురాలేదు. సంబంధిత వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. సాహిల్‌కు మరణశిక్ష విధించాలని సాక్షి తల్లిదండ్రులు డిమాండ్‌చేశారు.

బాధ్యతతో ఏదైనా చేయండి: సక్సేనాపై కేజ్రీవాల్ ఫైర్

ఢిల్లీలో శాంతిభద్రతల పరిరక్షణ అంశం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా పరిధిలో ఉండటంతో హత్యోదంతంపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఘాటుగా స్పందించారు. 'మైనర్‌ను దారుణంగా చంపేశారు. పోలీసులంటే ఏమాత్రం భయంలేకుండా నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌గారు.. ఢిల్లీలో శాంతిభద్రతలు కాపాడే బాధ్యత మీదే. బాధ్యతతో ఏదైనా చేయండి' అని కేజ్రీవాల్ హిందీలో ట్వీట్‌చేశారు. 'ఢిల్లీ పోలీసులంటే ఎవ్వరూ భయపడట్లేరు. కఠిన చర్యలు తీసుకోకుంటే నేరాలకు అడ్డుఅదుపు లేకుండా పోతుంది' అని ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు.




సాహిల్

'చేతులు జోడించి వేడుకుంటున్నా. ఇకనైనా కేజ్రీవాల్ సర్కారీ వ్యవహారాల్లో తలదూర్చడం మానేసి ఢిల్లీ మహిళలను కాపాడండి' అని లెఫ్టినెంట్ గవర్నర్‌ను ఉద్దేశిస్తూ ఢిల్లీ మహిళా మంత్రి ఆతిశీ కోరారు. ఈ ఉదంతంలో కఠిన చర్యలు తీసుకోండని పోలీసులను జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ ఆదేశించారు. 'బాధితురాలిని నిందితుడు చాన్నాళ్లుగా వేధిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వాస్తవానికి ఇదొక లవ్‌జిహాద్ ఉదంతం. కానీ దీనిని సాధారణ హత్య, శాంతిభద్రతల సమస్యగా కేజ్రీవాల్ చిత్రీకరిస్తున్నారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలి' అని బీజేపీ ఢిల్లీ శాఖ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆరోపించారు.

మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన ప్రధాని

గువాహటి: గువాహటి(అస్సాం)–న్యూజల్పాయ్‌గురి(పశ్చిమబెంగాల్) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. ఈశాన్య రాష్ట్రాల్లోనే మొట్టమొదటి ఈ వందేభారత్ రైలుతో ఈ ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వారంతో తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న ఎన్‌డీఏ ప్రభుత్వంలో దేశం అభివృద్ధి దిశగా అద్భుతమైన ప్రయాణం సాగించిందన్నారు. 2014కు పూర్వం ఊహించని అనేక విజయాలను ప్రభుత్వం సాధించిందని తెలిపారు. గువాహటిలో ఈ రైలు ప్రారంభ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, అస్సాం గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, సీఎం హిమాంత బిశ్వశర్మ పాల్గొన్నారు. గువాహటి– న్యూజల్పాయ్‌గురి మధ్య రైలు ప్రయాణ సమయం ప్రస్తుతమున్న 6.30 గంటల నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాకతో 5.30 గంటలకు తగ్గనుంది.



మైసూర్ పాలకుడు టిప్పు సుల్తాన్ వాడిన తుపాకీ ఇది. లండన్‌లో ఉన్న 18వ శతాబ్దం కాలంనాటి ఈ తుపాకీ ఖరీదు సుమారు రూ.20 కోట్లు. భారత్-యూకే చరిత్రలో ఈ తుపాకీ విశిష్టతపై పరిశోధనకు వీలుగా దీనిని మరే ఇతర దేశానికి పంపకుండా యూకే ప్రభుత్వం నిషేధం విధించింది.

కీవ్‌పై రష్యా క్షిపణుల వర్షం



కీవ్‌లో క్షిపణుల దాడి భయంతో మెట్రో స్టేషన్‌లో దాక్కున్న స్థానికులు

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా సైన్యం మరోసారి విరుచుకుపడింది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. రష్యా సైన్యం ప్రయోగించిన 11 బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులను తాము కూల్చివేశామని ఉక్రెయిన్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ప్రకటించారు. వాటి శకలాలు నగరంలో అక్కడక్కడా చెల్లాచెదురుగా పడిపోయాయని, దట్టమైన పొగ కమ్ముకుందని చెప్పారు. రష్యా దాడుల్లో కీవ్‌లో ఒకరు గాయపడినట్లు సమాచారం. రష్యా సేనలు తొలుత ఆదివారం రాత్రి దాడులు ప్రారంభించాయి. జనం బిక్కుబిక్కుమంటూ గడిపారు. కొందరు అండర్ గ్రౌండ్ రైల్వే స్టేషన్లలో తలదాచుకున్నారు. కొంత విరామం తర్వాత సోమవారం ఉదయం మళ్లీ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో పలు భవనాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. రష్యా క్షిపణి దాడుల నేపథ్యంలో చిన్నారులు భయాందోళనలతో బాంబు షెల్టర్ వైపు పరుగులు తీస్తున్న వీడియోను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఉక్రెయిన్ వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని లాంగ్–రేంజ్ మిస్సైళ్లు ప్రయోగించినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో ఉక్రెయిన్‌కు చెందిన కమాండ్ పోస్టులు, రాడార్లు, ఆయుధాలు ధ్వంసమయ్యాయని పేర్కొంది.

తుర్కియే అధ్యక్షుడిగా మళ్లీ ఎర్డోగన్



అంకారా: తుర్కియే అధ్యక్షుడిగా రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్(69) మరోసారి ఎన్నికయ్యారు. పోలైన ఓట్లలో ఎర్డోగన్‌కు 52.3శాతం, ప్రత్యర్థి కెమాల్ కిలిక్‌దరోగ్లుకు 47.7 శాతం పడినట్లు అధికార వార్తా సంస్థ అనడోలు తెలిపింది. ఫలితాలు వెలువడ్డాక ఎర్డోగన్ మద్దతుదారులు ఇస్తాంబుల్‌లో అధికార పార్టీ జెండాలు ఎగరేస్తూ, వాహనాల్లో తిరుగుతూ సంబరాలు చేసుకున్నారు. రెండు వారాల క్రితం జరిగిన ఎన్నికల్లో ఎర్డోగన్, కెమాల్‌లకు సమానంగా ఓట్లు పోలవడంతో తాజాగా ఆదివారం రెండో రౌండ్ పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. ఈ రౌండ్‌లో ఎర్డోగన్ స్పష్టమైన ఆధిక్యత సాధించారు. ఎర్డోగన్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

అస్సాంలో రోడ్డు ప్రమాదం.. ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

గువాహటి/జైపూర్: అస్సాంలోని గువాహటిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. అస్సాం ఇంజనీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్న 10 మంది విద్యార్థులు సోమవారం ఉదయం కాలేజీ నుంచి కారులో బయలు దేరారు. వేగంగా వెళ్తున్న వారి వాహనం జలక్‌బరి వద్ద రోడ్డు డివైడర్‌ను, ఆపైన మరో పికప్ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ఏడుగురు విద్యార్థులు అక్కడికక్కడే చనిపోగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మద్యం మత్తులో వాహనం నడిపినందునే ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందని డీజీపీ జీపీ సింగ్ తెలిపారు.

గుంతలో పడిన ట్రాక్టర్ ట్రాలీ..8 మంది మృతి

ట్రాక్టర్ ట్రాలీ లోతైన గుంతలో పడిన ఘటనలో 8 మంది చనిపోగా మరో 26 మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం రాజస్తాన్‌లోని ఝున్‌ఝునులో చోటుచేసుకుంది. బాధితులంతా మాన్‌సా మాత గుడికి వెళ్లివస్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రాలీ కరెంటు స్తంభాన్ని ఢీకొట్టి, గుంతలోకి దూసుకెళ్లినట్లుగా కనిపిస్తోందన్నారు.

బర్మింగ్‌హామ్ లార్డ్ మేయర్‌గా బ్రిటిష్ ఇండియన్

లండన్: ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్ నగర లార్డ్ మేయర్‌గా బ్రిటిష్–ఇండియన్ కౌన్సిలర్ చమన్‌లాల్ ఎన్నికయ్యారు. తద్వారా బర్మింగ్‌హామ్ తొలి బ్రిటిష్–ఇండియన్ మేయర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. సిక్కు మతంలోని రవిదాసియా వర్గానికి చెందిన చమన్ లాల్ భారత్‌లోని పంజాబ్ రాష్ట్రం హోషియార్‌పూర్ జిల్లాలోని పఖోవాల్ గ్రామంలో జన్మించారు. బ్రిటిష్ ఇండియా సైన్యంలో పనిచేసిన ఆయన తండ్రి సర్దార్ హర్నామ్‌సింగ్ బంగా 1954లో ఇంగ్లాండ్‌కు వలస వచ్చారు. బర్మింగ్‌హామ్‌లో స్థిరపడ్డారు. చమన్‌లాల్ 1964లో తన తల్లి సర్దార్నీ జై కౌర్‌తో కలిసి ఇంగ్లాండ్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి బర్మింగ్‌హామ్‌లోనే నివసిస్తున్నారు. 1971లో విద్యావతిని వివాహం చేసుకున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజకీయాలపై ఆసక్తితో చమన్‌లాల్ 1989లో లేబర్ పార్టీలో చేరారు. అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా జరిగిన సామాజిక పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

2030కల్లా చంద్రుడి మీదకు చైనా వ్యోమగాములు

బీజింగ్: అంతరిక్ష పరిశోధనలో పశ్చిమదేశాలతో పోటీపడుతున్న చైనా మరో ముందడుగు వేస్తోంది. వచ్చే ఏడేళ్లలో చంద్రుడి మీదకు మానవసహిత ప్రయోగాలు చేపడతామని చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ డెప్యూటీ డైరెక్టర్ లిన్ జిక్వియాంగ్ ప్రకటించారు. భూమి నుంచి చంద్రుడి మీదకు వెళ్లిరావడం, స్వల్పకాలం చంద్రుడిపై ల్యాండింగ్, మానవసహిత రోబో పరిశోధనలు, ల్యాండింగ్, కలియతిరగడం, శాంపిళ్ల సేకరణ, పరిశోధన, తిరుగుప్రయాణం ఇలా పలు కీలక విభాగాల్లో పట్టుసాధించేందుకు కృషిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. చందమామ దక్షిణ ధృవం వైపు గడ్డకట్టిన నీటి నిల్వల అన్వేషణ కోసం 2025కల్లా మరోమారు వ్యోమగాములను పంపాలని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించిన నేపథ్యంలో చైనా చంద్రుడిపై శోధనకు సిద్ధమైందని ఆ దేశ అధికార వార్తా సంస్థ జిన్హువా తెలిపింది.

మైసూరులో ఘోర ప్రమాదం



సాక్షి,బెంగళూరు/మైసూర్: ప్రైవేట్ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారులోని 10 మంది అక్కడికక్కడే చనిపోగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మైసూరులోని కురుబూరు వద్ద సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులున్నారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు ఇన్నోవా కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. అందులో ఇరుక్కుపోయిన వారిని తీసేందుకు భారీ మెటల్ కట్టర్లను ఉపయోగించాల్సి వచ్చింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితులు బళ్లారి జిల్లా సంగనకల్లుకు చెందిన వారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. బస్సులోని 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

12న పట్నాలో విపక్షాల కీలక భేటీ!

పట్నా/కోల్‌కతా: కేంద్రంలో అధికార బీజేపీని ఓడించడమే లక్ష్యంగా విపక్షాలను ఉమ్మడి వేదికపైకి తీసుకొచ్చేందుకు బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అగ్రనేత నితీశ్ కుమార్ తన కార్యాచరణను వేగవంతంగా చేశారు. తమతో కలిసివచ్చే పార్టీల ముఖ్యనాయకులతో రాజధాని పట్నాలో కీలక భేటీ నిర్వహించాలని ఆయన ఇప్పటికే నిర్ణయించారు. ప్రతిపక్షాల సమావేశం వచ్చే నెల 12న జరిగే అవకాశం ఉందని నితీశ్ కుమార్‌కు సన్నిహితుడైన బిహార్ మంత్రి విజయ్‌కుమార్ చౌదరి సోమవారం చెప్పారు. భేటీ తేదీ దాదాపు ఖరారైనట్లేనని అన్నారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ హాజరవుతాయని భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిపక్షాలు కలిసికట్టుగా పనిచేస్తే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించడం చాలా తేలిక అని అభిప్రాయపడ్డారు. విపక్ష కూటమి ఏర్పాటుకు నితీశ్ కుమార్ చొరవ తీసుకుంటున్నారని తెలిపారు.

హాజరుకానున్న మమతా బెనర్జీ

ఈ భేటీకి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత హాజరయ్యే అవకాశం ఉందని టీఎంసీ నేత చెప్పారు. ప్రతిపక్ష కూటమి ఏర్పాటుతోపాటు బీజేపీ వ్యతిరేక పోరాటాన్ని బలోపేతం చేయడానికి ఆమె సలహాలు సూచనలు ఇస్తారని వెల్లడించారు. పట్నాలో ప్రతిపక్షాల కీలక సమావేశం ఏర్పాటు చేయాలన్న సూచన తొలుత మమత నుంచి రావడం విశేషం. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బలంగా ఉన్నచోట తాము ఆ పార్టీకే మద్దతు ఇస్తామని మమత గతంలో అన్నారు.

సీఎం సిద్ధరామయ్యకు ఆర్థికం

- శివకుమార్‌కు ఇరిగేషన్, బెంగళూరు డెవలప్‌మెంట్
- హోం శాఖ మళ్లీ జి.పరమేశ్వరకే..
- ప్రియాంక్ ఖర్గేకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్
- మంత్రులకు శాఖలను కేటాయిస్తూ కర్ణాటక ప్రభుత్వం నోటిఫికేషన్



బెంగళూరు: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తన మంత్రివర్గంలోని మంత్రులకు శాఖలను కేటాయించారు. కీలకమైన ఆర్థిక శాఖను తనవద్దే ఉంచుకుని, ముఖ్యమైన నీటిపారుదల, బెంగళూరు సిటీ డెవలప్‌మెంట్ విభాగాలను డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు కేటాయించారు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లతోపాటు 8మంది మంత్రులు ఈ నెల 20న ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. శనివారం కొత్తగా 24 మందిని మంత్రివర్గంలోకి చేర్చుకున్నారు. వీరిలో గతంలో హోం శాఖను నిర్వహించిన జి.పరమేశ్వరకు తిరిగి అదే శాఖను కట్టబెట్టారు. భారీ, మధ్యతరహా పరిశ్రమల శాఖను ఎంబీ పాటిల్‌కు, కేజే జార్జికి విద్యుత్ శాఖను కేటాయిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఆదివారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. ఆర్థిక శాఖతోపాటు కేబినెట్ వ్యవహారాలు, పరిపాలన సిబ్బంది వ్యవహారాలు, ఇంటెలిజెన్స్, ఇన్ఫర్మేషన్, ఐటీ తదితర ఇతరులకు ఇవ్వని శాఖలు సీఎం సిద్ధరామయ్య వద్దే ఉన్నాయి. శివకుమార్‌కు భారీ, మధ్యతరహా నీటి వనరులు, బెంగళూరు సిటీ డెవలప్‌మెంట్ శాఖలను ఇచ్చారు. హెచ్‌కే పాటిల్‌కు న్యాయం, పార్లమెంటరీ వ్యవహారాలు, లెజిస్లేషన్, పర్యాటక శాఖలు, కేహెచ్ మునియప్పకు ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖల బాధ్యతలను కేటాయించారు. రామలింగారెడ్డికి రవాణా, ముజ్‌రాయ్ శాఖలను ఇచ్చారు. హెచ్‌సీ మహదేవప్పకు సాంఘిక సంక్షేమం, సతీశ్ జర్కిహోళికి పబ్లిక్ వర్క్స్ శాఖలను అప్పగించారు. శివానంద పాటిల్‌కు టెక్స్‌టైల్స్, అగ్రికల్చరల్ మార్కెటింగ్ బాధ్యతలు కేటాయించారు. దినేశ్ గుండూరావుకు ఆరోగ్యం, కుటుంబసంక్షేమం, రెవెన్యూ శాఖను కృష్ణ బైరెగౌడకు, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కొడుకు ప్రియాంక్ ఖర్గేకు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖను ఇచ్చారు. ఏకైక మహిళా మంత్రి లక్ష్మి ఆర్ హెబ్బాల్కర్‌కు మహిళ, శిశు అభివృద్ధి, సీనియర్ సిటిజన్ సాధికారిత శాఖ ఇచ్చారు.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు 150 సీట్లు

రాబోయే ఎన్నికల్లో అధికారం మాదే | కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధీమా

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో శాసనసభలో 230 సీట్లకు గాను రాబోయే ఎన్నికల్లో తాము 150 సీట్లు కచ్చితంగా గెలుచుకుంటామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారం తమదేనని తేల్చిచెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సోమవారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో మధ్యప్రదేశ్ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఎన్నికల సన్నద్ధతపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించామని, మధ్యప్రదేశ్‌లోనూ అదే పరంపర కొనసాగిస్తామని చెప్పారు. కర్ణాటక ఫలితమే మధ్యప్రదేశ్‌లో పునరావృతం అవుతుందన్నారు. రాష్ట్రంలో 150 సీట్లు గెలుచుకోబోతున్నట్లు తమ అంతర్గత అధ్యయనంలో వెల్లడయ్యిందని వివరించారు. రాష్ట్రంలో 4 నెలల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

మోదీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది

తొమ్మిదేళ్ల బీజేపీ పాలనపై కాంగ్రెస్ ఆరోపణ

న్యూఢిల్లీ: గత వారంతో తొమ్మిదేళ్ల పూర్తి చేసుకున్న మోదీ ప్రభుత్వ పాలనపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. పెరుగుతున్న ధరలను అదుపు చేశామని దురహంకార పూరిత వాదనలు చేస్తూనే తీవ్రమైన ద్రవ్యోల్బణం ద్వారా ప్రజలు సంపాదించిందంతా దోచుకుంటోందని ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ తొమ్మిదేళ్లలో పేదరికం అంచున జీవిస్తున్న ప్రజల జీవితాలను మోదీ ప్రభుత్వం ఏమాత్రం మార్చలేకపోయిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. ముఖ్యమైన ప్రతి వస్తువుపైనా జీఎస్టీ భారం పడుతోందని, సామాన్యుడి జీవితం కష్టతరంగా మారిందన్నారు. కేంద్ర మంత్రులు, ఆ పార్టీ నేతలు మాత్రం తాము ఘనకార్యాలు సాధించామంటూ ప్రచారం మొదలుపెడతారంటూ జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. 'మోదీ ప్రభుత్వం వాస్తవంగా సాధించినవి ఇవే..2014 నుంచి వాస్తవ ఆదాయాల్లో వృద్ధిరేటు– వ్యవసాయ కార్మికులకు: 0.8%, వ్యవసాయేతర కార్మికులకు: 0.2%, నిర్మాణ కార్మికులకు:-0.02%మాత్రమే. అయినప్పటికీ, 2014 నుంచి నిత్యావసర వస్తువుల ధరలు– ఎల్పీజీ:169%, పెట్రోల్:57%, డీజిల్:78%, ఆవనూనె:58%, గోధుమపిండి:56%, పాలు:51% పెరిగాయి''అంటూ ఆయన ట్వీట్ చేశారు. అసంఘటిత రంగంలో వాస్తవ వేతనాల పెరుగుదల దాదాపు నిలిచిపోయిందంటూ వచ్చిన కథనాన్ని కూడా జైరాం రమేశ్ షేర్ చేశారు. అన్ని రంగాల ఆదాయాల్లో స్తబ్దత నెలకొనగా గౌతమ్ ఆదానీ సంపద మాత్రం 2014 నుంచి 1,225% పెరిగిందని వ్యాఖ్యానించారు. కేంద్రంలో ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం మే 26వ తేదీతో 9 ఏళ్ల పూర్తి చేసుకుంది.

విద్యావిధానంలో అగ్రిటూరిజం అవసరం

అంతర్జాతీయ విద్యాసదస్సులో విద్యావేత్తల అభిప్రాయం

సాక్షి, విశాఖపట్నం: విద్యావిధానంలో అగ్రిటూరిజాన్ని పరిచయం చేస్తే వ్యవసాయానికి చేయూతనివ్వడంతో పాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పూర్తవుతుందని భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ గ్లోబల్ చైర్ చాన్స్‌లర్ డాక్టర్ రూపా వాసుదేవన్ చెప్పారు. విశాఖలో జీ20 ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీ కాంక్లేవ్ వెర్షన్ 2.0 రెండురోజుల సదస్సు సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఉన్నతవిద్యలో ఆవిష్కరణలు, డిజిటల్ ఎరా మొదలైన అంశాలపై జరిగిన సదస్సులో దేశంలోని వివిధ యూనివర్సిటీల చాన్సలర్లు, వైస్ చాన్సలర్లు, కెనడా, ఫ్లోరిడా, బంగ్లాదేశ్ తదితర దేశాల విద్యానిపుణులు ప్రసంగించారు. ఈ సందర్భంగా రూపా వాసుదేవన్ మాట్లాడుతూ పంజాబ్‌లో పలు విద్యాసంస్థలు విలేజ్ అడాప్షన్ అనే పథకాన్ని అమలు చేస్తున్నాయని చెప్పారు. దీని ద్వారా రైతులకు మేలు జరుగుతోందన్నారు. ఆర్ఎస్ఎస్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ రామ్‌మాధవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంతో భారతీయ విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం అవుతుందని చెప్పారు. పరిశోధనలు, అభివృద్ధిలో విద్యార్థులకు చేయూతనందించేందుకు యూనివర్సిటీలు కృషిచేయాలని కోరారు. ఈ సదస్సులో పలు యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక జర్నలిస్టు అవార్డుకు ఎంట్రీల ఆహ్వానం

సాక్షి, అమరావతి: పాత్రికేయరంగంలో ఉత్తమకృషి చేసిన జర్నలిస్టులకు అందించే ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు–2023కు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్టు ప్రజాశక్తి సాహితీసంస్థ కార్యదర్శి ఎం.వి.ఎస్. శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రీలను జూన్ 10వ తేదీ నాటికి psmhaward@gmail.com కు మెయిల్ ద్వారా పంపాలని సూచించారు. విజేతలకు జూన్ మూడోవారంలో పుట్టపర్తిలో నిర్వహించే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో రూ.10 వేలు నగదు బహుమానం, జ్ఞాపిక ఇవ్వనున్నట్లు తెలిపారు.

రూ. లక్షన్నర కోట్ల ఎగుమతులు

నాలుగేళ్లలో రూ.55 వేల కోట్లు పెరుగుదల



సాక్షి, అమరావతి: వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. 2019-20లో తొలిసారిగా రూ.లక్ష కోట్ల మార్కును చేరుకున్న రాష్ట్ర ఎగుమతులు నాలుగేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల మార్కును అధిగమించాయి. 2019-20లో రాష్ట్రం నుంచి రూ.1,04,829 కోట్ల ఎగుమతులు జరగగా 2022-23 నాటికి రూ.1,59,368.02 కోట్ల మార్కును చేరుకోవడం గమనార్హం. నాలుగేళ్లలో ఎగుమతులు దాదాపు రూ.55 వేల కోట్ల మేర పెరిగాయి. రాష్ట్రాల వారీగా ఎగుమతుల వివరాలను కేంద్ర వాణిజ్య శాఖ తాజాగా విడుదల చేసింది.

అత్యధికంగా ఆక్వా

2022-23లో దేశవ్యాప్తంగా రూ.36,20,630.9 కోట్ల విలువైన ఎగుమతులు జరగగా 4.41 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో నిలిచింది. రూ.12,00,001.94 కోట్ల ఎగుమతులతో గుజరాత్ మొదటి స్థానంలో ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో ఏపీ నుంచి అత్యధికంగా రూ.19,872.82 కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులు జరగగా రూ.9,919 కోట్ల ఎగుమతులతో ఫార్మా రంగం రెండో స్థానంలో నిలిచింది. జిల్లాలవారీగా చూస్తే ఉమ్మడి విశాఖ రూ.48,608.59 కోట్ల విలువైన ఎగుమతులతో అగ్రభాగాన ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రూ.31426.23 కోట్ల ఎగుమతులతో ఆ తర్వాతి స్థానం దక్కించుకుంది.

10 శాతం మార్కెట్ వాటాపై దృష్టి

దేశీయ ఎగుమతుల్లో 2030 నాటికి 10 శాతం వాటాను సాధించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా 2025-26 నాటికి రాష్ట్రంలో అదనంగా 110 మిలియన్ టన్నుల అదనపు సామర్థ్యం అందుబాటులోకి తెచ్చే విధంగా ఏకకాలంలో నాలుగు పోర్టులను నిర్మిస్తున్నారు. రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ సెజ్‌ల్లో కొత్తగా నాలుగు పోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.18,897 కోట్లను వ్యయం చేస్తోంది. రామాయపట్నం పోర్టు ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానుండగా మిగిలిన పోర్టులు 18 నుంచి 24 నెలల్లో అందుబాటులోకి రానున్నాయి. వీటికి అదనంగా రూ.3,700 కోట్లతో మరో పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం జరుగుతోంది. వీటి చెంతనే ఫుడ్‌పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. నాలుగు ఫిషింగ్ హార్బర్లు ఈ సంవత్సరాంతానికి అందుబాటులోకి రానుండగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. కొత్తగా నిర్మించే నాలుగు పోర్టుల ద్వారా అదనంగా లక్ష మందికి ఉపాధి లభించడంతో పాటు రాష్ట్ర జీడీపీ, ప్రజల తలసరి ఆదాయంలో గణనీయమైన వృద్ధి నమోదవుతుందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

కొత్త జిల్లాల ఏర్పాటుతో..

రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా విస్తరించడంతో జిల్లాల వారీగా ఎగుమతి అవకాశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఎగుమతిదారులకు చేయూతనందించేలా తగినంత మంది అధికారులు అందుబాటులోకి వచ్చారు. విదేశాలకు ఇతర ఉత్పత్తుల ఎగుమతి అవకాశాలతోపాటు కొత్త దేశాల్లో అవకాశాలను గుర్తించి స్థానిక అవకాశాలను పరిశీలిస్తున్నాం. సుదీర్ఘ తీరప్రాంతాన్ని వినియోగించుకుంటూ సముద్ర ఆధారిత వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నాం. నాలుగు పోర్టులతో పాటు పోర్టులకు ఆనుకుని పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తున్నాం.

– ప్రవీణ్ కుమార్,
సీఈవో, ఏపీమారిటైమ్ బోర్డు.

ఎగుమతులు ఇలా పెరిగాయి..

ఆర్థిక సంవత్సరం	ఎగుమతులు
2019-20	రూ.1,04,829.00 కోట్లు
2020-21	రూ. 1,24,744.46 కోట్లు
2021-22	రూ.1,43,843.19 కోట్లు
2022-23	రూ.1,59,368.02 కోట్లు

2022-23లో రాష్ట్రం నుంచి టాప్ 10 ఎగుమతులు

ఉత్పత్తి	విలువ రూ. కోట్లలో
ఆక్వా	19,872.82
ఫార్మా	9,919.69
నౌకలు, బోట్లు	9,281.85
ఫెర్రోఅల్లాయిస్	9,032.13
బియ్యం	8,864.65
కార్లు	8,596.57
రసాయనాలు	7,192.68
ఎరువులు, పురుగుమందులు	5,602.51
పొగాకు	5,463.06
ఎండుమిర్చి	4,751.25

2022-23లో జిల్లాల వారీగా ఎగుమతులు

జిల్లా	ఎగుమతులు రూ. కోట్లలో
అనంతపురం	11,734.77
చిత్తూరు	15,806.34
తూర్పుగోదావరి	31,426.23
గుంటూరు	10,916.75
కృష్ణా	3,703.96
కర్నూలు	699.754
ప్రకాశం	7,503.55
నెల్లూరు	10,916.67
శ్రీకాకుళం	3,672.38
విశాఖపట్నం	48,608.59
విజయనగరం	3,833.32
పశ్చిమగోదావరి	8,589.41
వైఎస్సార్	1,956.24

జనసేన కార్పొరేటర్ దాష్టీకం

- ఒంగోలులో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు చించివేత
- నగరంలో గొడవలు సృష్టించేందుకు యత్నం



జనసేన నాయకులు చించివేసిన ఫ్లెక్సీలు

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలో జనసేనకు చెందిన కార్పొరేటర్, ఇతర నాయకులు సోమవారం తీవ్రంగా రెచ్చిపోయారు. నగరంలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను చించివేస్తూ గందరగోళం సృష్టించారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతూ ఫ్లైఓవర్ బ్రిడ్జి, చర్చి సెంటర్, ఇతర ప్రధాన కూడళ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీటిని చూసి రెచ్చిపోయిన జనసేన నాయకులు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ పోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడమే కాకుండా పలుచోట్ల వివాదానికి దిగారు. వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను తొలగించాలంటూ పోలీసులతో అడ్డగోలుగా వాదించారు. చర్చి సెంటరుకు చేరుకున్న జనసేన కార్యకర్తలు గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించారు. జనసేనకు చెందిన 38వ డివిజన్ కార్పొరేటర్ మునగాల రమేష్ కర్నూలు రోడ్డులోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. అక్కడ ట్రాఫిక్ డ్యూటీలో ఉన్న పోలీసులు వారిస్తున్నా వినలేదు. దాంతో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. రమేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని, ఆ తర్వాత వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను చించివేసిన రమేష్‌పై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

సైబర్ వార్‌ఫేర్‌ను ఎదుర్కొనేలా మన 'పవర్'

- పవర్ గ్రిడ్‌ల భద్రతకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ
- సాంకేతికతను అభివృద్ధి చేసిన కేంద్ర విద్యుత్ శాఖ
- రాష్ట్రాల్లో పవర్ ఐలాండ్ సిస్టమ్ ఏర్పాటు
- గ్రిడ్‌లో సమస్య తలెత్తగానే విద్యుత్ వ్యవస్థ నుంచి గ్రిడ్‌ను వేరు చేసే సాంకేతికత
- దక్షిణాది గ్రిడ్‌కు రాష్ట్ర విద్యుత్ సంస్థలు అభివృద్ధి చేసిన జియో ఇన్ఫర్మేషన్ సిస్టమ్

సాక్షి, అమరావతి: దేశ విద్యుత్ అవసరాల్లో దాదాపు 40 శాతం పునరుత్పాదక ఇంధనమైన గాలి, నీరు, సౌర విద్యుత్ నుంచే సమకూరుతోంది. మన రాష్ట్రంలో ప్రభుత్వం ఈ స్వచ్ఛ ఇంధనానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులతో పాటు సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు రాష్ట్రం అనుకూలంగా మారింది. ఇటీవల గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో జరిగిన దాదాపు రూ.9.47 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలే దీనికి నిదర్శనం. అయితే, ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక ప్రాజెక్టులు సైబర్ దాడులకు గురవుతాయనే హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో రెండేళ్ల క్రితం పవర్ గ్రిడ్ పనితీరులో అంతరాలను నిపుణులు గుర్తించారు. దీనికి సైబర్ దాడి కారణం కావచ్చనే అనుమానాలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో దిగుమతి చేసుకున్న విద్యుత్ సరఫరా విడి భాగాలపై మంత్రిత్వ శాఖ సైబర్ భద్రతా చర్యలను తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీచేసింది. మాల్వేర్, ట్రోజన్లు వంటి ఏదైనా సైబర్ బెదిరింపుల కోసం దిగుమతి చేసుకున్న అన్ని విద్యుత్ సరఫరా విడి భాగాలను నేరస్తులు వాడుకునే అవకాశం ఉండటంతో హానికరమైన ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్ ఉందేమో అనే విషయాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని స్పష్టం చేసింది. అలాగే ఆ పరికరాలు భారతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉన్నాయో లేదో తనిఖీ చేస్తామని చెప్పింది. సైబర్ దాడులు దేశ విద్యుత్ సరఫరా వ్యవస్థకు విఘాతం కలిగించడంతో మొత్తం దేశాన్ని నిర్వీర్యం చేయగలవని కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ఇందుకు సంబంధించిన పరీక్షలన్నీ తాము నిర్దేశించిన, ధ్రువీకరించిన ప్రయోగశాలల్లో తప్పనిసరిగా నిర్వహించాలని మంత్రిత్వ శాఖ ఆదేశించింది.

సీఎస్ఐఆర్ టీమ్ ఏర్పాటు

సైబర్ సెక్యూరిటీలో భాగంగా పవర్ ఐలాండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. సెంట్రల్ సెక్యూరిటీ ఇన్సిడెంట్ రెస్పాన్స్ టీమ్ (సీఎస్ఐఆర్‌టీ)ను కూడా ఏర్పాటు చేయాలని భావిస్తోంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ఆధ్వర్యంలో వివిధ ప్రైవేటు సంస్థల్లో శిక్షణ పొందిన సైబర్ (ఇంటర్నెట్) నిపుణులు ఈ బృందంలో ఉంటారు. మన దేశంలో నార్తరన్, వెస్టర్న్, సదరన్, ఈస్టర్న్, నార్త్ ఈస్టర్న్ అనే ఐదు ప్రాంతీయ పవర్ గ్రిడ్‌లు ఉన్నాయి. వీటన్నిటినీ 'వన్ నేషన్.. వన్ గ్రిడ్' కింద సెంట్రల్ గ్రిడ్‌కు అనుసంధానించారు. ఈ గ్రిడ్‌లన్నిటి కార్యకలాపాలన్నీ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పరిధిలో జరుగుతుంటాయి. ఇంత పెద్ద గ్రిడ్‌కు సంబంధించిన సమాచార వ్యవస్థను శత్రువులు చేజిక్కించుకుంటే దేశం మొత్తం చీకటిపోతుంది. ఈ నేపథ్యంలో పవర్ గ్రిడ్ వంటి మౌలిక సదుపాయాలపై సైబర్, ఉగ్ర దాడులను ఎదుర్కోవటానికి రాష్ట్రాల్లోని పలు నగరాల్లో పవర్ ఐలాండ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. గ్రిడ్‌లో ఏదైనా అంతరాయం ఏర్పడితే విద్యుత్ వ్యవస్థను వెంటనే దాని నుంచి వేరు చేయడాన్ని పవర్ ఐలాండింగ్ సిస్టమ్ అంటారు. దీనివల్ల పవర్ గ్రిడ్‌లు కుప్పకూలకుండా నియంత్రించవచ్చు. ఏపీ ఇంధన శాఖ అనుసరిస్తున్న జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) వల్ల ఏపీ ట్రాన్స్‌కో, డిస్కంల మొత్తం ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లను జియో ట్యాగింగ్ చేయడం తేలికైంది. దీంతో భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన పవర్ సిస్టమ్ ఆపరేషన్ కార్పొరేషన్‌లో భాగమైన సదరన్ రీజినల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఆర్ఎల్‌డీసీ), దక్షిణాది రాష్ట్రాల్లో పవర్ గ్రిడ్‌ను పర్యవేక్షించడానికి ఏపీ ట్రాన్స్‌కో జీఐఎస్ మోడల్‌ను తీసుకుంది. విద్యుత్ సంస్థల్లో ఎక్కువ మంది సిబ్బంది విద్యుత్ కార్యకలాపాలను తమ సెల్‌ఫోన్ల ద్వారానే నియంత్రిస్తున్నారు. వారిని మోసగించి వారి ఫోన్‌లో హానికర సాఫ్ట్‌వేర్ పంపి విలువైన సమాచారాన్ని దొంగిలించే అవకాశం ఉందని కేంద్రం హెచ్చరించింది.



తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ



అవనిగడ్డలో విజయోత్సవ బైక్‌ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో నిర్వహించిన ర్యాలీలో హోం మంత్రి వనిత

సీఎం జగన్ సుపరిపాలనకు ప్రజల జేజేలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నేటికి నాలుగేళ్లు పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా విజయోత్సవాలు
- ఆనందోత్సాహాలతో ప్రజలు, పార్టీ శ్రేణుల బైక్ ర్యాలీలు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భారీగా విజయోత్సవాలు జరుపుకొంటున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు ముగ్ధులైన ప్రజలు స్వచ్ఛందంగా ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ప్రతి నగరం, ప్రతి జిల్లా, ప్రతి మండలం, ప్రతి ఊరిలో బైక్ ర్యాలీలు, ప్రదర్శనలతో సీఎం వైఎస్ జగన్‌కు మద్దతు తెలుపుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన బైక్ ర్యాలీల్లో రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన విజయోత్సవ ర్యాలీల్లో హోం మంత్రి తానేటి వనిత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో 3 వేల బైక్‌లతో 25 కిలోమీటర్ల భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రొద్దుటూరు పట్టణంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ట్రాక్టర్ తోలుతూ ర్యాలీలో పాల్గొన్నారు. కడప నగరంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు మాసీమ బాబు, అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ ర్యాలీని నిర్వహించారు. బాపట్ల జిల్లా అమర్తలూరు మండలంలో రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి కూడలి నుంచి సామవాయి మార్గం, అన్నమయ్య మార్గం మీదుగా ర్యాలీ విజయవంతంగా సాగింది. కృష్ణా జిల్లా పామర్రులో జరిగిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొన్నారు. అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు ఆధ్వర్యంలో అవనిగడ్డ నుంచి లక్ష్మీపురం వరకు 16 కిలోమీటర్ల భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పెనమలూరులో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఎమ్మెల్యే కె.రక్షణనిధి ఆధ్వర్యంలో, విజయవాడ నగరంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు.

చెప్పుకోవడానికి చంద్రబాబుకు ఏముంది?

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో 2014–15 మధ్య అధికారంలో ఉన్నప్పుడు ఇది చేశాను.. మళ్లీ అవకాశం ఇస్తే ఫలానా చేస్తానని చెప్పలేని దుస్థితి చంద్రబాబుది. అప్పట్లో ప్రజలకు చేసిందేమీ లేదు కాబట్టే.. మహానాడులో చంద్రబాబు చెప్పే మాటలు చాలా దరిద్రంగా ఉన్నాయి' అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో 2014 ఎన్నికల్లో టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో.. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విడుదల చేసిన మేనిఫెస్టో అమలుపై చర్చకు సిద్ధమా?' అని సవాల్ విసిరారు. అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98.5 శాతం హామీలను అమలు చేశారని, కావాలంటే క్షేత్ర స్థాయిలో సరి చూసుకోవాలని సూచించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వస్తే వ్యవసాయ రుణాలన్నీ మాఫీ చేస్తామని.. బ్యాంకులో తనఖా పెట్టిన బంగారాన్ని విడిపించి ఇస్తామని 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏమైందని చంద్రబాబును నిలదీశారు. 'నువ్వు ఇచ్చిన హామీ ప్రకారం.. ఆ రోజున వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలంటే రూ.87 వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్లు అవసరం. ఆ రుణాలను మాఫీ చేయకుండా రైతులను మోసం చేసింది వాస్తవం కాదా? నిజంగా రుణమాఫీ చేసి ఉంటే.. ఆ విషయాన్ని ధైర్యంగా చెప్పగలవా?' అని నిలదీశారు. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి.. దాన్ని అమలు చేయకుండా మహిళలను మోసం చేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. మహానాడులో కొత్త బిచ్చగాడిలా.. మొదటిసారి మేకప్ వేసుకున్న నటుడిలా మూస డైలాగులతో అధికారంలోకి వస్తే బ్రహ్మాండంగా చేస్తానని చెప్పాడు తప్ప.. 14 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు తాను ఇది చేశానని చెప్పలేకపోయారన్నారు. ఈ సమావేశంలో సజ్జల ఇంకా ఏమన్నారంటే..

అమ్మ ఒడి పేరు మార్చి తీసుకొస్తావా?

- ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నాలుగేళ్లలో డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.2.11 లక్షల కోట్లను సీఎం వైఎస్ జగన్ జమ చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారు. వాటి ఫలితాలు రాబోయే ఐదేళ్లలో కనిపిస్తాయి. 'సీఎం వైఎస్ జగన్ చెప్పింది చేస్తారు.. చేసిందే చెబుతారు.. మన కోసమే నిలబడ్డారు' అని ప్రజలు విశ్వసిస్తున్నారు.
- సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకాన్నే తల్లికి వందనం పేరుతో తీసుకొస్తానని చెబుతున్నారు. అమలవుతున్న పథకాన్నే మళ్లీ తీసుకొస్తా అంటున్నారు. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తానని చెబుతున్నారు. 2014 ఎన్నికల్లో నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.2 వేలు ఇస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఎన్ని నెలలు ఎంత మందికి నిరుద్యోగులకు ఎంత భృతి ఇచ్చారు? ప్రజలు నిలదీస్తారనే భయంతోనే టీడీపీ వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టోను మాయం చేసింది వాస్తవం కాదా?

అబద్ధాలు చెప్పడంలో దిట్ట

- అధికారంలో ఉన్నప్పుడు సామాజికంగా అన్నింటినీ దెబ్బతీయడం, అసమానతలు పెంచడం, తుపాన్లు, వరదలు, కరువు.. ప్రతీది తన సొంత ఆదాయ వనరుగా చంద్రబాబు మార్చుకున్నారు. అందుకే పోతూపోతూ రూ.2 లక్షల కోట్ల అప్పు చేసి.. వచ్చే ప్రభుత్వంపై భారం పడేసి వెళ్లారు.
- చంద్రబాబు కొత్తగా సృష్టించింది ఏమీ లేకపోగా.. జన్మభూమి కమిటీలు పెట్టి వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. ప్రజలకు ఇచ్చిన సెంటు స్థలం సమాధులకు కూడా సరిపోదంటూ పేదలను అవమానించారు. కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పే పోటీ పెడితే గిన్నిస్ బుక్ రికార్డు చంద్రబాబుకే వస్తుంది. చంద్రబాబు నాయకుడు కానే కాదు... మ్యానిప్యులేటర్. అందుకే ప్రజలు నమ్మరు.

'దివ్య' భవిష్యత్‌కు బాసటగా..!

- దివ్యాంగురాలైన తన తల్లిని ఆదుకోవాలని సీఎం వైఎస్ జగన్‌ను కోరిన విద్యార్థిని
- ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇంటి పట్టా అందజేసిన మంత్రులు



దివ్యకు ఇంటి పట్టాను అందజేస్తున్న మంత్రులు వేణు, తానేటి వనిత, కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఇటీవల కొవ్వూరులో జరిగిన సీఎం జగన్ పర్యటనలో తన ప్రసంగంతో ఆకట్టుకున్న విద్యార్థిని దివ్యకు ప్రభుత్వం బాసటగా నిలిచింది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం కింద తిగిరిపల్లి దివ్య తల్లి సంధ్యకు తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పెద్దేవంలో సెంటున్నర ఇంటి స్థలం ఇస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీహెచ్ ఎస్.వేణుగోపాలకృష్ణ, హోం మంత్రి తానేటి వనిత చెప్పారు. సోమవారం కలెక్టర్ సమక్షంలో మంత్రుల చేతుల మీదుగా సంధ్యకు ఇంటి పట్టా అందజేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ తన తల్లి మూగ, చెవిటితనంతో బాధపడుతోందని, తమకు ఇంటి స్థలం లేదని సీఎం సభలో చెప్పినట్టు గుర్తు చేశారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు సంధ్యకు ఇంటిస్థలం మంజూరు చేశామన్నారు. హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ..అర్హులకు అన్ని సంక్షేమ పథకాలను చేర్చాలన్నది జగనన్న ఉద్దేశమన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ సంధ్యకు పెద్దేవంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో సర్వే నంబర్ 392/8 బి 1లో ప్లాట్ నంబర్ 20ను కేటాయించినట్లు తెలిపారు.

బ్రాహ్మణ సామాజిక భవనం ప్రారంభం

- ద్రోణంరాజు సేవలను కొనియాడిన స్వరూపానందేంద్ర



భవనాన్ని ప్రారంభిస్తున్న స్వరూపానందేంద్ర

సింహాచలం: బ్రాహ్మణుల అభ్యున్నతికి ద్రోణంరాజు సత్యనారాయణ విశేషంగా కృషి చేశారని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని సుజాతనగర్‌లో నిర్మించిన ద్రోణంరాజు సత్యనారాయణ బ్రాహ్మణ సామాజిక భవనాన్ని సోమవారం స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. స్వరూపానందేంద్ర మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో బ్రాహ్మణులకు ఒక భవనం ఉండాలని అప్పట్లో ద్రోణంరాజు సత్యనారాయణ ఆశించారన్నారు. ఆయన వంతు సహాయంగా శ్లాబ్ వరకు భవనాన్ని నిర్మాణం చేసినట్టు తెలిపారు. చాలాకాలం తర్వాత తన సూచన మేరకు పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఇతర నాయకులు చొరవ తీసుకుని జీవీఎంసీ నిధులతో భవనాన్ని పూర్తి చేయించడం, ఇప్పుడు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పాల్గొన్నారు.

• తెలంగాణ

జగిత్యాల యువకుడి కోసం ఎన్ఐఏ వేట

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పీఎఫ్ఐ కేసులో నిందితుడిగా ఉన్న జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురాకు చెందిన అబ్దుల్ సలీం కోసం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వేట ముమ్మరం చేసింది. అతని ఆచూకీ తెలిపినవారికి రూ. 2 లక్షల రివార్డు ప్రకటించింది.

నిజామాబాద్ నుంచి మొదలు..

గతంలో నిజామాబాద్ కేంద్రంగా జరిగిన ఉగ్ర శిక్షణపై నిఘా పెట్టిన ఎన్ఐఏ గతేడాది సెప్టెంబర్ 18న రాష్ట్రవ్యాప్తంగా 38 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. నిషేధిత పీఎఫ్ఐతో సంబంధాలున్న పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది. కాగా, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మార్షల్ ఆర్ట్స్ పేరిట 200 మందికి ఉగ్ర శిక్షణ ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే గత సెప్టెంబర్‌లో ఎన్ఐఏ రంగంలోకి దిగింది. జగిత్యాలలో ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి ఇస్లాంపురాకు చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌ను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. అదే సమయంలో అబ్దుల్ సలీంను నిందితుడిగా చేర్చారు. అబ్దుల్ సలీం వాస్తవానికి మహారాష్ట్రకు చెందిన వాడని, ఇస్లాంపురాలో కొన్నాళ్లు ఫర్నిచర్ వర్క్‌షాప్‌లో పని చేశాడని చెబుతున్నారు.

‘మార్గదర్శి’ చరాస్తుల జప్తు!

- సీఐడీ వినతి మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- రూ.793.50 కోట్ల చరాస్తులపై కోర్టు అనుమతితో తదుపరి చర్యలు
- డిపాజిట్‌దారులు, చందాదారుల ప్రయోజనాలే లక్ష్యంగా కీలక అడుగు
- బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్స్ సంస్థలకు సమాచారం



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు, డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన రూ.793.50 కోట్ల విలువైన చరాస్తులను జప్తు చేసేందుకు సీఐడీని అనుమతించింది. వీటిలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ నగదు, బ్యాంకు ఖాతాల్లో సొమ్ము, నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన పెట్టుబడులున్నాయి. చిట్టీలు వేసిన చందాదారుల సొమ్మును మార్గదర్శి చిట్‌ఫండ్స్ చెల్లించే స్థితిలో లేనందున ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం 1999 ప్రకారం హోంశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయస్థానం అనుమతితో చరాస్తుల జప్తునకు సీఐడీ అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఇదే విషయాన్ని వివరిస్తూ 50 బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్స్ సంస్థలకు కూడా సమాచారం అందించారు. బ్యాంకులు, ఇతర సంస్థల్లోని నిధులను మార్గదర్శి మళ్లించకుండా, డిపాజిట్‌దారుల ప్రయోజనాలను కాపాడేలా ఈ నిర్ణయం తీసుకున్నారు.

చట్టాన్ని పాటించేందుకు నిరాకరణ

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ దశాబ్దాలుగా ఆర్థిక అక్రమాలను పాల్పడుతున్నట్లు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ తనిఖీల్లో వెల్లడైంది. చందాదారుల సొమ్మును నిబంధనలకు మార్గదర్శి తమ అనుబంధ సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా మళ్లించినట్లు కీలక ఆధారాలు సేకరించింది. చిట్‌ఫండ్స్ రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు ఏ–1గా చెరుకూరి రామోజీరావు, ఏ–2గా చెరుకూరి శైలజ కిరణ్‌లతోపాటు బ్రాంచి మేనేజర్లపై (ఫోర్‌మెన్) సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం విదితమే. కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని అనుసరిస్తున్నట్లు ఆధారాలు చూపితే కొత్త చిట్టీలకు అనుమతిస్తామని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ సూచించినా మార్గదర్శి అందుకు నిరాకరించింది. దీంతో గతేడాది డిసెంబర్ నుంచి రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొత్త చిట్టీలు నిలిపివేసింది. ఆరు నెలల్లో దాదాపు రూ.400 కోట్ల విలువైన టర్నోవర్ నిలిచిపోయింది. మరోవైపు పాత చందాదారులకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సకాలంలో చిట్టీల మొత్తాన్ని చెల్లించకపోవడంతో చందాదారులు పెద్ద సంఖ్యలో చిట్స్ రిజిస్ట్రార్, సీఐడీకి ఫిర్యాదు చేస్తున్నారు. వీటిని పరిశీలించిన సీఐడీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆస్తులను జప్తు చేసేందుకు అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరింది.

పాఠశాలల్లో ఎల్ఈడీ వెలుగులు

- మన బడి నాడు–నేడు రెండో దశ స్కూళ్లలో ఎల్ఈడీ బల్బులు
- 45 వోల్ట్స్ 23,367 ఎల్ఈడీ బల్బులకు టెండర్లు
- రూ.11.92 కోట్ల అంచనాతో టెండర్
- 7 వోల్ట్స్ బల్బులు కొనే బాధ్యత తల్లిదండ్రుల కమిటీలకు..
- జూ. కాలేజీల్లో విద్యుత్ పరికరాలు కాలేజీ కమిటీల ద్వారా కొనుగోలు

సాక్షి, అమరావతి: మన బడి నాడు–నేడు రెండో దశ స్కూళ్లలో ఎల్ఈడీ వెలుగులు విరజిమ్మనున్నాయి. మన బడి నాడు–నేడు రెండో దశలో రాష్ట్ర ప్రభుత్వం 22,344 స్కూళ్లు, ఇతర విద్యా సంస్థల్లో రూ.8,000 కోట్లతో పది రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ స్కూళ్లలో 45 వోల్ట్స్ కలిగిన 23,367 ఎల్ఈడీ బల్బుల ఏర్పాటుకు రూ.11.92 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ– టెండర్లను ఆహ్వానించింది. టెండర్ దాఖలుకు వచ్చే నెల 5వ తేదీ గడువుగా పేర్కొంది. బల్బులను స్కూళ్ల వరకు సరఫరా చేయాలనే నిబంధన విధించింది. రివర్స్ టెండరింగ్‌లో తక్కువ కోట్ చేసిన సంస్థను ఎంపిక చేయనున్నారు. 7 వోల్ట్స్ కలిగిన 12,636 ఎల్ఈడీ బల్బులను హోల్డర్స్‌తో సహా స్థానికంగా ప్రస్తుత ధరలకు కొనే బాధ్యతను తల్లిదండ్రుల కమిటీలకు ప్రభుత్వం అప్పగించింది. ఈమేరకు స్కూల్స్ మౌలిక వసతుల కమిషనర్ కె. భాస్కర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. హైపవర్ టెండర్ కమిటీ ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. నిర్ధారించిన స్పెసిఫికేషన్ల మేరకు తల్లిదండ్రుల కమిటీలు ఈ బల్బులు కొనేలా జిల్లా విద్యా అధికారి, అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్లు చర్యలు తీసుకోవాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు. నాడు–నేడు రెండో దశలో జూనియర్ కాలేజీల్లో ఎలక్ట్రికల్, శానిటరీ పరికరాలను కూడా స్థానికంగా కాలేజీ అభివృద్ధి కమిటీల ద్వారా కొనాలని కూడా ఆదేశించారు.

తీరప్రాంత అభివృద్ధికి రూ.16 వేల కోట్లు



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో మంత్రులు గుడివాడ అమర్నాథ్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి

- నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణమే లక్ష్యం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్

బిట్రగుంట: ‘రాష్ట్రంలోని తీర ప్రాంతాన్ని, సహజ వనరులను సద్వినియోగం చేసుకుని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రాష్ట్రంలోని 974 కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీరంలో రూ.16 వేల కోట్ల వ్యయంతో నాలుగు పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు’ అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్ పనులను వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి మంత్రి అమర్నాథ్ సోమవారం పరిశీలించారు. అమర్నాథ్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టుతోపాటు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రూ.300 కోట్ల వ్యయంతో చేపట్టిన హార్బర్ పనులు ఇప్పటికే 95 శాతం పూర్తయ్యాయని తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించనున్నట్లు చెప్పారు. రామాయపట్నం పోర్టు ద్వారా 25 వేల మందికి, ఫిషింగ్ హార్బర్ ద్వారా మరో ఆరు వేల మందికి పైగా ఉపాధి కల్పించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే రామిరెడ్డి విజ్ఞప్తి మేరకు బకింగ్‌హాం కెనాల్ మరమ్మతులు, అప్రోచ్ రోడ్డు నిర్మాణం, మత్స్యకారులకు సంబంధించిన ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఏపీ మారిటైం చీఫ్ ఇంజినీర్ రాజగోపాల్, ఆర్డీవో వీకే శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాబు వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసన

- పండగలా జరిగిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీని ఓర్వలేకపోతున్నారు
- అందుకే నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, బైక్ ర్యాలీలు, చంద్రబాబు దిష్టిబొమ్మలు దహనం



చిలకలూరిపేట బైక్ ర్యాలీలో మంత్రి విడదల రజిని



విజయనగరం జిల్లా గరివిడి బ్రిడ్జిపై బైక్ ర్యాలీలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



తణుకులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సాక్షి నెట్‌వర్క్ : పేదలకు ఉచితంగా ఇస్తున్న ఇళ్ల పట్టాల విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై నిరసన జ్వాలలు వెల్లువెత్తాయి. పేదవారంటే చంద్రబాబుకి మొదటి నుంచి చులకన భావమేనని.. అధికారంలో ఉన్నప్పుడు అధికార దాహంతో పేదలపై, దళితులపై దాడులు చేయించాడని, ఇప్పుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉచితంగా ఇళ్ల పట్టాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చులకనగా మాట్లాడుతుండడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇందుకు నిరసనగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు నిరసన ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. చంద్రబాబు దిష్టిబొమ్మలను తగులబెట్టారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఇళ్ల లబ్ధిదారులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినదించారు. పేదలను చులకనగా చూస్తున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో సమాధి కడతామంటూ హెచ్చరించారు. విజయనగరం, చీపురుపల్లి, రాజాం, నెల్లిమర్ల, సాలూరు, పార్వతీపురం నియోజకవర్గ కేంద్రాల్లో భారీ నిరసన ప్రదర్శనలు, బైక్‌ర్యాలీలు నిర్వహించారు. సాలూరులో మంత్రి పీడిక రాజన్నదొర భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తుండగా ఓ బైక్ తగలడంతో ఎడమకాలికి గాయమైంది. వైద్యులు పరీక్షించి మూడు వారాలు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస, టెక్కలి, ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోనూ ర్యాలీలు జరిగాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగిన బైక్ ర్యాలీల్లో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా చంద్రబాబు దిష్టిబొమ్మలను దగ్ధంచేశారు. చోడవరం, నర్సీపట్నం, యలమంచిలి, పాయకరావుపేట, అరకు, పాడేరులలో పార్టీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పెద్దఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించారు. పలుచోట్ల చంద్రబాబుతోపాటు అయ్యన్నపాత్రుడి దిష్టిబొమ్మలను దగ్ధంచేశారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లోనూ చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా బైక్ ర్యాలీలు, ఇతర నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తణుకులో జరిగిన ర్యాలీలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ ర్యాలీలు నిర్వహించి చంద్రబాబు వ్యాఖ్యలను నిరసించారు. గుంటూరులో జరిగిన భారీ నిరసన ర్యాలీలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో మంత్రి విడదల రజిని నేతృత్వంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పేదల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా సమాధులతో పోల్చి చంద్రబాబు పైశాచికానందం పొందుతున్నారని మండిపడ్డారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా కూడా మోటార్ సైకిల్ ర్యాలీలతో నిరసన తెలిపారు.



ఆరెంజ్ క్యాప్ (అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్)
శుబ్‌మన్ గిల్ (890 పరుగులు: 17 మ్యాచ్‌లు) సెంచరీలు: 3, అర్ధ సెంచరీలు: 4
ఐపీఎల్ టోర్నీలో ఆరెంజ్ క్యాప్ నెగ్గిన పిన్న వయస్కుడిగా గిల్ (23 ఏళ్ల 263 రోజులు) గుర్తింపు పొందాడు.
ప్రైజ్‌మనీ: రూ. 15 లక్షలు



పర్పుల్ క్యాప్
(అత్యధిక వికెట్లు తీసిన బౌలర్)
మొహమ్మద్ షమీ (28 వికెట్లు: 17 మ్యాచ్‌లు)
ప్రైజ్‌మనీ: రూ. 15 లక్షలు

మొత్తం ప్రైజ్‌మనీ:
రూ. 46 కోట్ల 50 లక్షలు
విజేత జట్టుకు: రూ. 20 కోట్లు
రన్నరప్ జట్టుకు: రూ. 13 కోట్లు
మూడో స్థానం: రూ. 7 కోట్లు (ముంబై ఇండియన్స్)
నాలుగో స్థానం: రూ. 6 కోట్ల 50 లక్షలు (లక్నో సూపర్ జెయింట్స్)



మహేంద్ర సింగ్ ధోని మంత్రజాలం ఐపీఎల్‌లో మరోసారి అద్భుతంగా పని చేసింది. తనకే సాధ్యమైనరీతిలో సాధారణ ఆటగాళ్లతోనే జట్టును నడిపించిన అతను ఐదో ట్రోఫీతో సగర్వంగా నిలిచాడు. 15 ఓవర్లలో 171 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అక్కడక్కడా తడబడినా చివరకు సీఎస్‌కే గెలుపు సొంతం చేసుకుంది. మోహిత్ శర్మ వేసిన చివరి ఓవర్లో 13 పరుగులు అవసరం కాగా, తొలి 4 బంతుల్లో అతను 3 పరుగులే ఇచ్చాడు. దాంతో గుజరాత్ గెలుస్తున్నట్లుగా అనిపించింది. అయితే తర్వాతి రెండు బంతులను జడేజా 6, 4గా మలచి సూపర్ కింగ్స్‌కు చిరస్మరణీయ విజయం అందించాడు. వరుసగా రెండో ఏడాది చాంపియన్‌గా నిలవాలని భావించిన గుజరాత్ టైటాన్స్ చివరకు రన్నరప్‌గా సంతృప్తి చెందింది. సాధారణంగా 215 పరుగుల లక్ష్యం అసాధ్యంగా కనిపించినా... వర్షం అంతరాయంతో ఓవర్లు తగ్గడం, చేతిలో 10 వికెట్లు ఉండటం కూడా చెన్నైకి మేలు చేసింది. చివరిదిగా భావిస్తున్న ఐపీఎల్ మ్యాచ్‌లో ధోని తొలి బంతికే గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరగా... ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అంబటి రాయుడు తన కెరీర్‌లో ఆరో టైటిల్‌తో ఘనమైన ముగింపునిచ్చాడు.

250 ఐపీఎల్‌లో 250 మ్యాచ్‌లు ఆడిన తొలి ప్లేయర్‌గా ధోని రికార్డు నెలకొల్పాడు. 2008 నుంచి మొదలుకొని ధోని వరుసగా 16 సీజన్లు ఆడాడు. 226 మ్యాచ్‌ల్లో అతను కెప్టెన్‌గా చేశాడు. రోహిత్ శర్మ (243), దినేశ్ కార్తీక్ (242), విరాట్ కోహ్లి (237), రవీంద్ర జడేజా (226) టాప్-5లో ఉన్నారు.

12 ఐపీఎల్-2023లో నమోదైన సెంచరీలు. గత ఐపీఎల్ సీజన్‌లో అత్యధికంగా 8 సెంచరీలు వచ్చాయి.

37 గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఐపీఎల్ సీజన్‌లో 37 సార్లు ఆయా జట్లు 200 అంతకంటే ఎక్కువ పరుగులు సాధించాయి. గత సీజన్‌లో 18 సార్లు 200 అంతకంటే ఎక్కువ పరుగులు వచ్చాయి.

564 ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్‌గా చెన్నై సూపర్ కింగ్స్‌కు చెందిన తుషార్ దేశ్‌పాండే నిలిచాడు. ఈ సీజన్‌లో తుషార్ 16 మ్యాచ్‌లు ఆడి 564 పరుగులు ఇచ్చి 21 వికెట్లు పడగొట్టాడు. గతంలో ఈ రికార్డు ప్రసిధ్ కృష్ణ (551 పరుగులు: 2022 సీజన్) పేరిట ఉంది.

7 ఇప్పటి వరకు జరిగిన 16 ఐపీఎల్ ఫైనల్స్‌లో ఏడుసార్లు ఛేజింగ్ చేసిన జట్టు చాంపియన్‌గా అవతరించింది. తొమ్మిదిసార్లు తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు విజేతగా నిలిచింది.

5 ఐపీఎల్ టైటిల్‌ను అత్యధికంగా ఐదుసార్లు గెలిచిన జట్టుగా ముంబై ఇండియన్స్ (2013, 2015, 2017, 2019, 2020) జట్టు పేరిట ఉన్న రికార్డును చెన్నై సూపర్ కింగ్స్ (2010, 2011, 2018, 2021, 2023) సమం చేసింది.

0 ఇప్పటి వరకు జరిగిన 16 ఐపీఎల్ ఫైనల్స్ మ్యాచ్‌ల్లో ఏ జట్టు కూడా ఒక్కసారీ ఆలౌట్ కాలేదు.

6 మొత్తం 16 ఐపీఎల్ ఫైనల్స్‌లో ఆరుసార్లు ఆయా జట్టు 200 అంతకంటే ఎక్కువ పరుగులు సాధించాయి.

చెన్నై ఫైవ్ స్టార్...



- ఐదోసారి ఐపీఎల్ టైటిల్ సాధించిన సూపర్‌కింగ్స్
- ఫైనల్లో 5 వికెట్లతో గుజరాత్‌పై ఘన విజయం
- వర్షంతో మారిన లెక్కల్లో ధోని సేనదే పైచేయి
- ఆఖరి బంతికి గెలిపించిన జడేజా

అహ్మదాబాద్: ఐపీఎల్-2023లో చెన్నై సూపర్ కింగ్స్ చాంపియన్‌గా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్లో చెన్నై 5 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (47 బంతుల్లో 96; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీ కోల్పోగా... వృద్ధిమాన్ సాహా (39 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్) శుబ్‌మన్ గిల్ (20 బంతుల్లో 39; 7 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం చెన్నై 15 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (25 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివమ్ దూబే (21 బంతుల్లో 32 నాటౌట్; 2 సిక్స్‌లు) రాణించారు.

సమష్టి బ్యాటింగ్ ప్రదర్శన...

42 బంతుల్లో 67, 42 బంతుల్లో 64, 33 బంతుల్లో 81... తొలి మూడు వికెట్లకు వరుసగా గుజరాత్ భాగస్వామ్యాలివి. జట్టులోని టాప్-4 తమ వంతుగా కీలకపాత్ర పోషించడంతో భారీ స్కోరు సాధ్యమైంది. సాహా, గిల్ ఇద్దరూ దూకుడుగా ఆడుతూ ఈ సీజన్‌లో మరోసారి జట్టుకు శుభారంభం అందించారు. తుషార్ వేసిన రెండో ఓవర్లోనే 3 పరుగుల వద్ద గిల్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను దీపక్ చహర్ వదిలేసి గుజరాత్‌కు మేలు చేశాడు. చహర్ ఓవర్లో సాహా సిక్స్, 2 ఫోర్లు కొట్టగా... తుషార్, తీక్షణ ఓవర్లలో గిల్ వరుసగా మూడేసి ఫోర్లు బాది జోరు ప్రదర్శించాడు. 21 పరుగుల వద్ద సాహా ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను కూడా చహర్ వదిలేయడం టైటాన్స్‌కు మరింత కలిసొచ్చింది. ఎట్టకేలకు ధోని మెరుపు స్టంపింగ్‌తో గిల్ వెనుదిరగ్గా, 36 బంతుల్లో సాహా అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ వెంటనే సాహా అవుట్ కాగా, సుదర్శన్ దూకుడు కొనసాగింది. తీక్షణ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదిన అతను పతిరణ ఓవర్లో వరుసగా 2 ఫోర్లు కొట్టి 33 బంతుల్లోనే హాఫ్ సెంచరీకి చేరుకున్నాడు. తుషార్ వేసిన తర్వాతి ఓవర్లో అతను మరింత చెలరేగిపోయాడు. తొలి నాలుగు బంతుల్లో అతను 6, 4, 4, 4 కొట్టడం విశేషం. తుషార్ తర్వాతి ఓవర్లోనూ టైటాన్స్ 18 పరుగులు



జడేజాను ఆలింగనం చేసుకుంటున్న ధోని

రాబట్టింది. పతిరణ వేసిన ఆఖరి ఓవర్లో వరుసగా 6, 6 కొట్టి 96కు చేరిన సుదర్శన్ తర్వాతి బంతికి దురదృష్టవశాత్తూ ఎల్బీగా దొరికిపోయి సెంచరీ చేజార్చుకున్నాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (12 బంతుల్లో 21 నాటౌట్; 2 సిక్స్‌లు) ధాటి గుజరాత్‌ను మరింత పటిష్ట స్థితికి చేర్చింది.

శుభారంభం...

వర్షం అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం చెన్నై విజయలక్ష్యాన్ని 15 ఓవర్లలో 171 పరుగులుగా నిర్ణయించారు. ఛేదనను చెన్నై ఘనంగా ప్రారంభించింది. దూకుడుగా ఆడిన ఓపెనర్లు రుతురాజ్, కాన్వే 4 ఓవర్ల పవర్‌ప్లే ముగిసేసరికి 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో స్కోరును 52 పరుగులకు చేర్చారు. అయితే పవర్‌ప్లే తర్వాత చెన్నైని నియంత్రించడంలో బౌలర్లు సఫలమయ్యారు. నాలుగు పరుగుల తేడాతో వీరిద్దరు వెనుదిరిగారు. అయితే రుతురాజ్ (16 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్), రహానే (13 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అంబటి రాయుడు (8 బంతుల్లో 19; 1 ఫోర్, 2 సిక్స్‌లు) తలా ఓ చేయి వేసి జట్టును గెలుపు దిశగా నడిపించారు.

15 ఓవర్లకు కుదింపు...


రిజర్వ్ డే అయిన సోమవారం కూడా వాన మ్యాచ్‌కు అంతరాయం కలిగించింది. సరైన సమయానికే ఆరంభమై గుజరాత్ పూర్తి 20 ఓవర్లు ఆడింది. అయితే చెన్నై ఇన్నింగ్స్‌లో 3 బంతులకు 4 పరుగులు చేసిన తర్వాత మొదలైన వర్షం సుదీర్ఘ సమయం పాటు తెరిపినివ్వలేదు. వర్షం తగ్గినా, ప్రధాన పిచ్ పక్కన ఉన్న మరో పిచ్ ఆరకపోవడంతో సమస్యగా మారింది. దానిని ఆరబెట్టేందుకు గ్రౌండ్స్‌మన్ అన్ని ప్రయత్నాలు చేశారు. చివరకు అర్ధరాత్రి 12.05 గంటలకు మ్యాచ్ మళ్లీ మొదలైంది. చెన్నై ఇన్నింగ్స్‌ను 15 ఓవర్లకు కుదించి లక్ష్యాన్ని 171 పరుగులుగా నిర్దేశించారు. పవర్‌ప్లేను 4 ఓవర్లకు పరిమితం చేయగా, ఒక్కో బౌలర్ గరిష్టంగా 3 ఓవర్లు మాత్రం వేసేందుకు అనుమతించారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) ధోని (బి) చహర్ 54; గిల్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 39; సుదర్శన్ (ఎల్బీ) (బి) పతిరణ 96; పాండ్యా (నాటౌట్) 21; రషీద్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-67, 2-131, 3-212, 4-214. **బౌలింగ్:** దీపక్ చహర్ 4-0-38-1, తుషార్ 4-0-56-0, తీక్షణ 4-0-36-0, జడేజా 4-0-38-1, పతిరణ 4-0-44-2.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) రషీద్ (బి) నూర్ 26; కాన్వే (సి) మోహిత్ (బి) కాన్వే 47; దూబే (నాటౌట్) 32; రహానే (సి) విజయ్‌శంకర్ (బి) మోహిత్ 27; రాయుడు (సి) అండ్ (బి) మోహిత్ 19; ధోని (సి) మిల్లర్ (బి) మోహిత్ 0; జడేజా (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (15 ఓవర్లలో 5 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1-74, 2-78, 3-117, 4-149, 5-149. **బౌలింగ్:** షమీ 3-0-29-0, పాండ్యా 1-0-14-0, రషీద్ 3-0-44-0, నూర్ 3-0-17-2, లిటిల్ 2-0-30-0, మోహిత్ శర్మ 3-0-36-3.

'సుదర్శన' చక్రం...



'సాయి సుదర్శన్ ప్రత్యేకమైన ఆటగాడు. టి20 ఫార్మాట్‌కైతే సరిగ్గా సరిపోతాడు. సాధ్యమైనంత తొందరగా అతడిని తమిళనాడు జట్టులోకి తీసుకురండి'... భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ జూలై, 2021లో చెప్పిన ప్రశంసాపూర్వక మాట ఇది. ఆ ఏడాది తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో అతను అద్భుత బ్యాటింగ్‌తో అత్యధిక పరుగుల జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు. అశ్విన్ మాట విన్నట్లుగా తమిళనాడు సెలక్టర్లు అతడిని జట్టులోకి ఎంపిక చేయగా... నవంబర్, 2021లోనే అతను తన తొలి దేశవాళీ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత గత రెండేళ్లలో అతని ఆట మరింత మెరుగైంది. 21 ఏళ్ల సుదర్శన్ మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటి ప్రస్తుతం ఆ జట్టులో కీలక ఆటగాడిగా మారాడు.

తన ప్రదర్శన, గుర్తింపు కారణంగా 2022 ఐపీఎల్ వేలంలో తనను చెన్నై జట్టు తీసుకుంటుందని సుదర్శన్ ఆశించాడు. కానీ అది జరగలేదు. చివరకు అతని కనీస విలువ రూ. 20 లక్షలకు గుజరాత్ టైటాన్స్ తీసుకుంది. విజయ్‌శంకర్‌కు గాయం కావడంతో తొలి మ్యాచ్ ఆడే అవకాశం రాగా, మొత్తం సీజన్‌లో 5 మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు. అయితే అతని మెరుపులు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా రబడ బౌలింగ్‌లో కొట్టిన హుక్‌షాట్ బౌండరీ అతని ఆత్మవిశ్వాసాన్ని చూపించింది. సాయి బ్యాటింగ్‌ను నమ్మిన టీమ్ యాజమాన్యం ఈసారి కూడా కొనసాగించింది. ఈ ఏడాది కూడా విలియమ్సన్ గాయంతో తప్పుకోవడంతో తనకు అందివచ్చిన అవకాశాన్ని అతను సమర్థంగా వినియోగించుకున్నాడు. ఢిల్లీపై అర్ధసెంచరీ చేసిన మ్యాచ్‌లో నోర్జే వేసిన 144 కిలోమీటర్ల బంతిని వికెట్ల వెనుక వైపు సిక్సర్‌గా మలచడం హైలైట్‌గా నిలిచింది. కోల్‌కతాపై కూడా మరో అర్ధ సెంచరీ సాధించిన అతను ఈ సీజన్‌లో 51.71 సగటు, 141.41 స్ట్రయిక్‌రేట్‌తో 362 పరుగులు సాధించడం విశేషం. ముంబైతో రెండో క్వాలిఫయర్‌లో చివర్లో వేగంగా పరుగులు చేయలేక 'రిటైర్డ్ అవుట్'గా వెళ్లడంతో అతని దూకుడుపై సందేహాలు తలెత్తాయి. అయితే సోమవారం అతను దానిని పటాపంచలు చేశాడు. సెంచరీ చేజారినా...ఐపీఎల్‌లో ఎప్పటికీ గుర్తుంచుకోదగ్గ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడాడు.


సుదర్శన్ ఇంట్లోనే క్రీడలు ఉన్నాయి. అథ్లెట్ అయిన తండ్రి భరద్వాజ్ భారత్ తరఫున దక్షిణాసియా క్రీడల్లో పాల్గొనగా, తల్లి ఉష జాతీయ వాలీబాల్‌లో తమిళనాడు జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ప్రస్తుతం స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌గా పని చేస్తోంది. వివిధ వయో విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో అతను దూసుకొచ్చాడు. 2019-20 అండర్-19 చాలెంజర్ ట్రోఫీలో యశస్వి జైస్వాల్, తిలక్‌వర్మ, రవి బిష్ణోయ్, ప్రియమ్ గార్గ్ అతని ఇండియా 'ఎ' జట్టు సహచరులు. ఆరంభంలోనే ఫిట్‌నెస్‌పై అంతగా దృష్టి పెట్టని సాయి తల్లి పర్యవేక్షణలో పూర్తి ఫిట్‌గా మారడం కూడా అతని కెరీర్‌కు మేలు చేసింది. 2022లో టైటాన్స్ రూ.20 లక్షలకు తీసుకున్న తర్వాత జరిగిన 2023 తమిళనాడు ప్రీమియర్ లీగ్ వేలంలో సుదర్శన్‌కు రూ. 21.60 లక్షలు దక్కడం విశేషం. సీఎస్‌కేకే చెందిన జూనియర్ సూపర్ కింగ్స్ టీమ్ సభ్యుడిగా 2018లో సుదర్శన్ ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లగా, ఆ టీమ్‌కు అంబటి రాయుడు మెంటార్‌గా వ్యవహరించాడు. ఇప్పుడు అదే చెన్నైపై తన మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగడం కొసమెరుపు! **–సాక్షి క్రీడా విభాగం**

నెట్ ప్రాక్టీస్‌లో కోహ్లి



లండన్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ కోసం భారత ఆటగాళ్లు ఇంగ్లండ్‌లో కసరత్తు మొదలుపెట్టారు. స్టార్ బ్యాటర్ కోహ్లి ట్రెయినింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. లెఫ్టార్మ్ సీమర్ ఉనాద్కట్, ఉమేశ్ యాదవ్, సిరాజ్, వెటరన్ స్పిన్నర్ అశ్విన్‌లు కాసేపు ఎక్సర్‌సైజ్ చేశారు. కెప్టెన్ రోహిత్ శర్మ, యువ సంచలనం యశస్వి జైస్వాల్ తాజాగా ఇంగ్లండ్ చేరుకోగా... మంగళవారం నుంచి వీరిద్దరు ప్రాక్టీస్ మొదలుపెడతారు.

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన



లండన్: భారత జట్టుతో వచ్చే నెల 7 నుంచి 11 వరకు ఓవల్‌లో జరిగే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొనే ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. పక్కటెముకల్లో నొప్పితో ఐపీఎల్ టోర్నీ మధ్యలో నుంచి స్వదేశానికి వెళ్లిపోయిన పేస్ బౌలర్ జోష్ హాజల్‌వుడ్ (ఆర్‌సీబీ)కు 15 మందితో కూడిన ఆసీస్ జట్టులో చోటు లభించింది. అయితే ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్, బ్యాటర్ రెన్‌షాలకు స్థానం దక్కలేదు. 32 ఏళ్ల హాజల్‌వుడ్ 59 టెస్టులు ఆడి 222 వికెట్లు పడగొట్టాడు.

ఆస్ట్రేలియా టెస్ట్ జట్టు: కమిన్స్ (కెప్టెన్), వార్నర్, ఉస్మాన్ ఖ్వాజా, లబుషేన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, అలెక్స్ క్యారీ, మిచెల్ స్టార్క్, హాజల్‌వుడ్, నాథన్ లయన్, టాడ్ మర్ఫీ, స్కాట్ బోలాండ్, కామెరాన్ గ్రీన్, మార్కస్ హారిస్, ఇంగ్లిస్.

జొకోవిచ్ శుభారంభం

- ఫ్రెంచ్ ఓపెన్ టోర్నమెంట్
- రెండో రౌండ్‌లోకి అల్‌కరాజ్
- పదో సీడ్ ఫెలిక్స్ పరాజయం

పారిస్: కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంగా ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో బరిలోకి దిగిన సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మూడో సీడ్ జొకోవిచ్ 6-3, 6-2, 7-6 (7/1)తో అలెగ్జాండర్ కొవాసెవిచ్ (అమెరికా)పై గెలుపొందాడు. 2 గంటల 26 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 10 ఏస్‌లు సంధించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన ఈ సెర్బియా స్టార్ 22 అనవసర తప్పిదాలు చేశాడు. వరుసగా 19వసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడుతున్న జొకోవిచ్ రెండుసార్లు టైటిల్ సాధించడంతోపాటు నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచాడు.

డిఫెండింగ్ చాంపియన్ రాఫెల్ నాదల్ (స్పెయిన్) గైర్హాజరీలో టైటిల్ ఫేవరెట్‌గా ఉన్న ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) కూడా రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. క్వాలిఫయర్ ఫ్లావియో కొబొలి (ఇటలీ)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 6-0, 6-2, 7-5తో



విజయం సాధించాడు. గంటా 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. మరోవైపు పదో సీడ్ ఫెలిక్స్ అగర్ అలియాసిమ్ (కెనడా) తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. ఫాబియో ఫాగ్‌నిని (ఇటలీ) 6-4, 6-4, 6-3తో ఫెలిక్స్‌ను ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. ఇతర మ్యాచ్‌ల్లో 14వ సీడ్ కామెరాన్ నోరి (బ్రిటన్) 7-5, 4-6, 3-6, 6-1, 6-4తో బెనోయి పెయిర్ (ఫ్రాన్స్)పై, మాజీ చాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) 7-6 (7/5), 6-4, 6-7 (2/7), 1-6, 6-4తో రామోస్ వినోలస్ (స్పెయిన్)పై, షపోవలోవ్ (కెనడా) 6-4, 7-5, 4-6, 3-6, 6-3తో నకషిమా (అమెరికా)పై గెలిచి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

12వ సీడ్ బెన్‌చిచ్ ఓటమి

మహిళల సింగిల్స్ విభాగంలో 12వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. 'లక్కీ లూజర్' ఎలీనా అలనెస్యాన్ (రష్యా) 6-3, 2-6, 6-4తో బెన్‌చిచ్‌ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్) 7-6 (7/4), 4-6, 6-4తో జియు వాంగ్ (చైనా)పై, స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా) 6-0, 6-4తో కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)పై, కేలా డే (అమెరికా) 7-5, 6-1తో మ్లాడెనోవిచ్ (ఫ్రాన్స్)పై, స్వితోలినా (ఉక్రెయిన్) 6-2, 6-2తో మార్టినా ట్రెవిసాన్ (ఇటలీ)పై గెలిచారు.

'పోరాటం కొనసాగుతుంది'

పోలీసుల నిర్బంధం నుంచి విడుదలైన రెజ్లర్లు




న్యూఢిల్లీ: పోలీసు నిర్బంధం నుంచి ఆదివారం రాత్రి విడుదలైన భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. 'మా తదుపరి కార్యాచరణ ఏంటనేది త్వరలోనే వెల్లడవుతుంది. మేమంతా ఇంకా కలుసుకోలేదు. మమ్మల్ని వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. నన్ను అర్ధరాత్రి దాటాక విడిచి పెట్టారు. మిగతా రెజ్లర్లను రాత్రి 11 గంటలకు విడుదల చేశారు. అందువల్లే అందరం కలువలేకపోయాం. అంతా కలిసి చర్చించుకున్నాకే తదుపరి పోరాటానికి దిగుతాం' అని బజరంగ్ తెలిపాడు. మరోవైపు ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు రెజ్లర్లు మళ్లీ నిరసన చేసేందుకు అనుమతి కోరితే ఇస్తామని, అయితే జంతర్‌మంతర్ వద్ద మాత్రం శిబిరానికి అనుమతి లేదని, ఢిల్లీలో ఇంకెక్కడైనా దీక్ష చేపట్టవచ్చని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

వాళ్లనలా చూశాక నిద్రే రాలేదు: బింద్రా

దేశానికి ఒలింపిక్, ఆసియా క్రీడల్లో పతకాలు తెచ్చిపెట్టిన రెజ్లర్లతో పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని బీజింగ్ ఒలింపిక్స్ (2008) చాంపియన్ షూటర్ అభినవ్ బింద్రా అన్నాడు. మహిళా రెజ్లర్లపై దాష్టీకానికి పాల్పడిన దృశ్యాలు తనను కలచి వేశాయని రాత్రంత నిద్రేలేకుండా చేసిందని ట్వీట్ చేశాడు. స్టార్ రెజ్లర్లతో ఖాకీల కాఠిన్యం ఏమాత్రం ఆమోదయోగ్యం కానే కాదని భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి అన్నాడు. రెజ్లర్లను పోలీసులు ఈడ్చుకెళ్లిన చిత్రాలు తనను బాధించాయని, సాధ్యమైనంత త్వరలో వారి సమస్య పరిష్కరించాలని మాజీ క్రికెట్ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ట్విట్టర్‌లో కోరారు.

సినిమా

రామ్.. సీతారామ్...



● ప్రభాస్, కృతీ సనన్

సీతారాముల ప్రేమ గాఢతను, వారి అనుబంధాన్ని తెలియజేసే 'రామ్ సీతా రామ్...' పూర్తి పాటను విడుదల చేసింది 'ఆదిపురుష్' టీమ్. ఈ చిత్రంలో రాముడిగా ప్రభాస్, సీతగా కృతీ సనన్, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. ఓం రౌత్ దర్శకత్వంలో భూషణ్ కుమార్, క్రిష్ణకుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతారియా, రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. కాగా సోమవారం ఈ చిత్రం నుంచి విడుదల చేసిన 'రామ్ సీతారామ్...' పాటను సచేత్-పరంపర స్వరపరచగా, రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది.

అహింస కొత్తగా ఉంటుంది

- ఆర్పీ పట్నాయక్

''అహింస' కథ చాలా కొత్తగా ఉంటుంది.. కథ కొత్తగా ఉన్నప్పుడు పాట సహజంగానే కొత్తగా వినిపిస్తుంది. ఈ చిత్రం పాటలకు మంచి స్పందన వస్తోంది'' అన్నారు సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్. అభిరామ్, గీతికా తివారి జంటగా తేజ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అహింస'. పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా జూన్ 2న రిలీజ్ కానున్న సందర్భంగా ఈ చిత్ర సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ– ''అహింస సిద్ధాంతం నమ్మే ఓ అబ్బాయిని పరిస్థితులు ఎలా కృష్ణతత్వంవైపు లాగాయనేది ఈ చిత్ర కథ. నా దర్శకత్వంలో ఒక మ్యూజికల్ ఫిల్మ్ ప్లాన్ చేస్తున్నాను. ఎన్నికల నేపథ్యంలో ఓ కథ రెడీ చేశాను. నిర్మాతలు దొరికితే ఏడాదికి 4 చిత్రాలకు దర్శకత్వం వహిస్తా. వెబ్ సిరీస్ కోసం రెండు కథలు రాశాను'' అన్నారు.



అలాంటి వారికి సమాధానమే టక్కర్

- హీరో సిద్ధార్థ్



● వివేక్ కూచిభొట్ల, కార్తీక్ జి. క్రిష్, సిద్ధార్థ్, మయాంక్

''మీరెప్పుడూ లవర్ బోయ్ పాత్రలు చేస్తుంటారు. కంప్లీట్ కమర్షియల్ సినిమా చేయొచ్చు కదా?' అని చాలామంది నన్ను ప్రశ్నిస్తుంటారు.. వారికి సమాధానమే 'టక్కర్'. ఫుల్ యాక్షన్ అండ్ రొమాంటిక్ టచ్‌తో ఈ ప్రేమకథ నడుస్తుంది'' అన్నారు సిద్ధార్థ్. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్ జంటగా నటించిన చిత్రం 'టక్కర్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సిద్ధార్థ్ మాట్లాడుతూ– ''బాయ్స్'తో హీరోగా ఎంట్రీ ఇచ్చా. ఈ ఆగస్టుకి హీరోగా 20 ఏళ్ల కెరీర్ పూర్తవుతుంది. ఇప్పటికీ నా చేతిలో అరడజను సినిమాలు ఉండటం హ్యాపీ'' అన్నారు. ''టక్కర్' న్యూ జనరేషన్ సినిమా. ఇందులో సిద్ధార్థ్‌ని రగ్డ్ లవర్ బోయ్‌గా చూస్తారు '' అన్నారు కార్తీక్ జి. క్రిష్. ''ఈ సినిమాతో మళ్లీ పాత సిద్ధార్థ్‌ని చూస్తాం'' అన్నారు చిత్ర సహనిర్మాత వివేక్ కూచిభొట్ల.

నాంది క్రేజ్‌ని స్టూడెంట్ నిలబెడతాడు

- సతీష్ వర్మ



''బాహుబలి, హ్యాపీ డేస్, కొత్త బంగారులోకం' లాంటి కొన్ని సినిమాలు తప్పితే చాలావరకు ఏ సినిమానీ నేను రెండోసారి చూడలేదు. కానీ 'నేను స్టూడెంట్ సర్' చిత్రాన్ని నాలుగు సార్లు చూశాను.. ఎక్కడా బోర్ కొట్టదు. కోవిడ్ కారణంగా 40 ఏళ్లకు పైబడిన వారు 'నాంది' సినిమాని ఎక్కువగా థియేటర్‌కి వచ్చి చూడలేదు. కానీ 'నేను స్టూడెంట్ సర్' చిత్రం అన్ని వయసుల వారు థియేటర్‌కి వచ్చి చూసేలా ఉంటుంది'' అని నిర్మాత 'నాంది' సతీష్ వర్మ అన్నారు. బెల్లంకొండ గణేష్, అవంతిక దాసాని జంటగా రాకేష్ ఉప్పలపాటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నేను స్టూడెంట్ సర్'. సతీష్ వర్మ నిర్మించిన ఈ సినిమా జూన్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా సతీష్ వర్మ విలేకరులతో మాట్లాడుతూ– ''నేను స్టూడెంట్ సర్'లో యూనివర్సిటీలో స్టూడెంట్ లైఫ్‌ని చూపించాం. గణేష్ ఈ పాత్రకు సరిగ్గా సరిపోయాడు. మంచి థ్రిల్లర్ జోనర్‌లో కథ సాగుతుంది. 'నాంది'కి వచ్చిన క్రేజ్‌ని ఈ సినిమా నిలబెడుతుందని భావిస్తున్నాను. కృష్ణ చైతన్యగారి కథని రాకేష్ ఉప్పలపాటి చక్కగా తీశారు. నటి భాగ్యశ్రీ గారి అమ్మాయి అవంతికని మా సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయం చేయడం హ్యాపీ. మా తర్వాతి సినిమా బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా రాకేష్ ఉప్పలపాటి దర్శకత్వంలోనే ఉంటుంది'' అన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
30-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	345	62,846
నిఫ్టీ ▲	99	18,599

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి మూడు శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	12,976	▲	278
డోజోన్స్	33,093	▲	329
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,627	▲	56
డాక్స్	15,953	▼	31
షాంఘై	3,221	▲	9
నికాయ్	31,234	▲	317

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	60,012
బంగారం (99.5 స్వచ్ఛత)	59,772
వెండి (కిలో)	70,782

అజియో 'బిగ్‌బోల్డ్' సేల్

ముంబై: అజియో 'బిగ్ బోల్డ్ సేల్' పేరుతో ప్రత్యేక అమ్మకాల కార్యక్రమాన్ని చేపట్టింది. జూన్ 1 నుంచి మొదలు కానుంది. ఫ్యాషన్, లైఫ్ స్టయిల్, హోమ్, డెకార్, బ్యూటీ, జ్యువెలరీ, పర్సనల్ కేర్ ఉత్పత్తులపై మంచి డీల్స్‌ను ఆఫర్ చేస్తున్నట్టు తెలిపింది. ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డు చెల్లింపులపై అదనంగా 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్టు ప్రకటించింది. ప్రత్యేకమైన డీల్స్‌లో భాగంగా ఉత్పత్తులపై 50 నుంచి 90 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్టు తెలిపింది. బిగ్‌బోల్డ్ సేల్‌లో అధిక కొనుగోళ్లు చేసిన కస్టమర్లకు ఐఫోన్ 14ప్రో, యాపిల్ మ్యాక్ బుక్ ఎయిర్, రూ.లక్ష విలువైన బంగారం, శామ్‌సంగ్ ఎస్23ను ఇస్తున్నట్టు పేర్కొంది. ముగ్గురు విజేతలు ఒక్కొక్కరు రూ.3 లక్షల విలువైన బంగారం గెలుచుకోవచ్చని ప్రకటించింది.

భారత ఎగుమతులకు జర్మనీ మాంద్యం అడ్డు

సీఐఐ ఎగ్జిమ్ కమిటీ చైర్మన్ సంజయ్ బుధియా



న్యూఢిల్లీ: జర్మనీలో ఆర్థిక మాంద్యంతో భారత్ నుంచి చేసే రసాయనాలు, మెషినరీ, వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్ తదితర ఎగుమతులపై ప్రభావం పడుతుందని సీఐఐ ఎగ్జిమ్ కమిటీ చైర్మన్ సంజయ్ బుధియా తెలిపారు. అదే సమయంలో జర్మనీలో ఆర్థిక మాంద్యం భారత్ ఎగుమతులపై ప్రభావం చూపించడం ఇప్పుడప్పుడే కనిపించకపోవచ్చన్నారు. 2023 మొదటి మూడు నెలల్లో జర్మనీ జీడీపీ 0.3 శాతం పడిపోయింది. 2022 చివరి మూడు నెలల్లోనూ 0.5 శాతం క్షీణించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-5-2023	
విశాఖ	500-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
29-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	470-00
వరంగల్	472-00
రిటైల్ ధర	5.35

ఆర్‌క్యాప్ నష్టాలు తగ్గాయ్

క్యూ4లో రూ. 1,488 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని రుణ పరిష్కార ప్రణాళికలకు చేరిన అనిల్ అంబానీ కంపెనీ రిలయన్స్ క్యాపిటల్(ఆర్‌క్యాప్) గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నష్టాలను భారీగా తగ్గించుకుంది. రూ. 1,488 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 4,249 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 4,770 కోట్ల నుంచి రూ. 4,436 కోట్లకు క్షీణించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 8,982 కోట్ల నుంచి రూ. 5,949 కోట్లకు దిగివచ్చాయి. 2021 నవంబర్ 29న కంపెనీ దివాలా ప్రక్రియకు చేరిన సంగతి తెలిసిందే. ఇక స్టాండెలోన్ నష్టం భారీగా పెరిగి రూ. 1,389 కోట్లను తాకింది. అంతక్రితం కేవలం రూ. 25 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 5 కోట్ల నుంచి రూ. 3 కోట్లకు తగ్గింది.

లాభాల్లోకి టొరెంట్ పవర్

మార్చి త్రైమాసికంలో రూ. 484 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ విద్యుత్ దిగ్గజం టొరెంట్ పవర్ 2022-23 చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. రూ. 484 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 487 కోట్లకుపైగా నికర నష్టం ప్రకటించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక మొత్తం ఆదాయం సైతం భారీగా ఎగసి రూ. 6,134 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 3,841 కోట్ల టర్నోవర్ నమోదైంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 2,165 కోట్లకు జంప్ చేసింది. 2021-22లో కేవలం రూ. 479 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,493 కోట్ల నుంచి రూ. 26,076 కోట్లకు ఎగసింది. ఒకేసారి లేదా దశలవారీగా మార్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీ ద్వారా రూ. 3,000 కోట్ల సమీకరణకు బోర్డు అనుమతించినట్లు వెల్లడించింది.

టొరెంట్ పవర్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.6 శాతం బలపడి రూ. 556 వద్ద ముగిసింది.

బ్యాంకింగ్ ప్రైవేటీకరణ ఆగదు

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రణాళికాబద్ధంగా అనుకున్న ప్రకారం ముందుకు సాగుతుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ''బ్యాంకు ప్రైవేటీకరణ షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుంది. దానిలో ఎటువంటి మార్పు లేదు'' అని ఆమె అన్నారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆమె ఇక్కడ ఒక మీడియా సమావేశంలో మాట్లాడారు.

మూడో రోజూ మార్కెట్ల జోరు

- 345 పాయింట్లు అప్
- 62,846 వద్దకు సెన్సెక్స్
- నిఫ్టీ 99 పాయింట్లు ప్లస్
- గ్లోబల్ మార్కెట్ల పుష్



ముంబై: ప్రపంచ మార్కెట్ల ప్రోత్సాహంతో దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు బలపడ్డాయి. సెన్సెక్స్ 345 పాయింట్లు జంప్‌చేసి 62,846 వద్ద ముగిసింది. నిఫ్టీ 99 పాయింట్లు ఎగసి 18,599 వద్ద నిలిచింది. యూఎస్ మార్కెట్లు పుంజుకోవడం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రభావంతో ఇన్వెస్టర్లు తొలి నుంచీ కొనుగోళ్లకే ఆసక్తి చూపారు. దీంతో మార్కెట్లు ఊగిసలాడినప్పటికీ లాభాల మధ్యే కదిలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 524 పాయింట్లు పురోగమించి 63,026కు చేరింది. వెరసి 63,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. నిఫ్టీ సైతం 18,641 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. సానుకూల సెంటిమెంటు నేపథ్యంలో మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,072 పాయింట్లు జమ చేసుకోగా.. నిఫ్టీ 313 పాయింట్లు లాభపడింది. దీంతో మార్కెట్లు చరిత్రాత్మక గరిష్టాల సమీపానికి చేరాయి. యూఎస్ రుణ పరిమితిపెంపునకు ఆదివారం సూత్రప్రాయ అనుమతి లభించడంతో ఇన్వెస్టర్లకు జోష్ వచ్చినట్లు స్టాక్ నిపుణులు పేర్కొన్నారు.


ఎంఅండ్‌ఎం జూమ్

ఎన్‌ఎస్‌ఈలో కన్జూమర్ డ్యురబుల్స్, మెటల్, బ్యాంకింగ్, ఆటో, రియల్టీ 0.6 శాతం స్థాయిలో బలపడితే.. ఆయిల్-గ్యాస్, ఐటీ 0.4 శాతం స్థాయిలో డీలా పడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో క్యూ4 ఫలితాల అండతో ఎంఅండ్‌ఎం 3.4 శాతం ఎగసింది. ఇతర బ్లూచిప్స్‌లో టైటాన్, కోల్ ఇండియా, టాటా స్టీల్, అల్ట్రాటెక్, ఎస్‌బీఐ లైఫ్, గ్రాసిమ్, హిందాల్కో, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ఎస్‌బీఐ, అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్, ఐటీసీ 2.6-1 శాతం మధ్య లాభపడ్డాయి. అయితే ఓఎన్‌జీసీ 3 శాతం పతనంకాగా.. దివీస్, పవర్‌గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్, మారుతీ, బీపీసీఎల్, బ్రిటానియా, అదానీ ఎంటర్, విప్రో 1.2-0.4 శాతం మధ్య క్షీణించాయి.

చిన్న షేర్లు..: బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.3 శాతం చొప్పున బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 1,921 లాభపడగా.. 1,715 నష్టపోయాయి. ఇటీవల దేశీ స్టాక్స్‌పట్ల ఆసక్తి చూపుతున్న విదేశీ ఇన్వెస్టర్లు తాజాగా నగదు విభాగంలో రూ. 1,758 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. దేశీ ఫండ్స్ సైతం రూ. 854 కోట్ల విలువైన స్టాక్స్ సొంతం చేసుకున్నాయి. కాగా.. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.2 శాతం నీరసించి 76.82 డాలర్లకు చేరింది. డాలరుతో మారకంలో రూపాయి స్వల్పంగా 4 పైసలు తగ్గి 82.63కు చేరింది.

బ్యాంకుల్లో గవర్నెన్స్ లోపాలు

- ఆర్‌బీఐ గవర్నర్ దాస్ వెల్లడి
- బోర్డులు, యాజమాన్యాలు జాగ్రత్త వహించాలని సూచన



ముంబై: కార్పొరేట్ గవర్నెన్స్‌కి సంబంధించి నిర్దిష్ట మార్గదర్శకాలు ఉన్నప్పటికీ కొన్ని బ్యాంకుల్లో వాటి అమలు తీరులో మాత్రం లోపాలు ఉన్నట్లు తేలిందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. వాటిని అధిగమించగలిగామని, లేకపోతే ఎంతో కొంత ఒడిదుడుకులు తలెత్తేవని ఆయన పేర్కొన్నారు. 'కార్పొరేట్ గవర్నెన్స్‌పై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, బ్యాంకింగ్ రంగంలో ఒడిదుడుకులకు దారి తీసేలా కొన్ని బ్యాంకుల్లో గవర్నెన్స్‌పరమైన లోపాలు బైటపడటం ఆందోళనకరమైన విషయం' అని బ్యాంక్ బోర్డుల డైరెక్టర్లతో సోమవారం జరిగిన సమావేశంలో దాస్ పేర్కొన్నారు. బ్యాంకుల బోర్డులు, యాజమాన్యాలు ఇలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

స్మార్ట్ మోసాలు..

మొండిపద్దులపరమైన ఒత్తిళ్లను దాచి పెట్టేందుకు, కృత్రిమంగా ఆర్థిక పనితీరును గొప్పగా చూపించుకునేందుకు బ్యాంకులు 'స్మార్ట్ అకౌంటింగ్' విధానాలను ఆశ్రయించడాన్ని దాస్ తీవ్రంగా తప్పుపట్టారు. ఇందుకోసం బ్యాంకులు పాటిస్తున్న విధానాలను ప్రస్తావించారు. ఖాతాల్లో మొండిబాకీల భారాన్ని తగ్గించుకునేందుకు ఒక బ్యాంకు మరొక బ్యాంకుకు సందర్భాన్ని బట్టి తమ రుణాలను విక్రయించి, తిరిగి బైబ్యాక్ చేయడం .. రుణగ్రహీత చెల్లించాల్సిన రీపేమెంట్లను అంతర్గతంగా ఖాతాల్లో సర్దుబాటు చేయడంలాంటివి వీటిలో ఉన్నట్లు దాస్ పేర్కొన్నారు.

డిజిటలైజేషన్, మొండిబకాయిలపై దృష్టి

బ్యాంకింగ్‌కు ఆర్థిక శాఖ సహాయమంత్రి కరాడ్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: బ్యాంకులు డిజిటలైజేషన్‌పై దృష్టి సారించాలని అలాగే ఒత్తిడితో కూడిన రుణాలపై (మొండిబకాయిలకు దారితీసే అవకాశమున్న ఖాతాలు) నిఘా ఉంచాలని ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కే కరాడ్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత, అన్ని వర్గాలను ఫైనాన్షియల్ చట్రంలోకి తీసుకురావడంపై కూడా బ్యాంకులు దృష్టి పెట్టాలన్నారు. ఈఎస్ఎఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ జోనల్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంకా ఆయన ఏమన్నారంటే, బ్యాంకులు నిరర్థక ఆస్తులను సకాలంలో గుర్తించాలి. బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా మొండిబకాయిలకు తగిన కేటాయింపులు (ప్రొవిజనింగ్స్) చేయాలి. టెక్నాలజీ వినియోగంపై పూర్తి స్థాయి దృష్టి సారింపు అవసరం. భవిష్యత్తు అంతా దీనిపైనే ఆధారపడి ఉంటుంది. డిజిటల్ బ్యాంకింగ్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.

ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ

The Andhra Pradesh Mineral Development Corporation Ltd.



విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికీకరణ, ప్రజల ముంగిటకే పరిపాలన,
మైనింగ్‌లో వైవిధ్యభరితమైన సంస్కరణలతో రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతూ
సంక్షేమ పథకాలతో సుపరిపాలన సాగిస్తూ.. నాలుగేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా
గౌరవ ముఖ్యమంత్రివర్యులు **శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారికి**
శుభాకాంక్షలు తెలియజేస్తూ...

ముఖ్యమంత్రివర్యులు **శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి** గారి సారథ్యంలో
విజయపథంలో **ఎపిఎండిసి**

ప్రగతిపథంలో ఎపిఎండిసి

- 2020-21 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ: రూ.434 కోట్లు
- 2021-22 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ : రూ.900 కోట్లు
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ: రూ.1800 కోట్లు
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లక్ష్యం : రూ.4000 కోట్లు
- గ్రానైట్, కాల్సైట్, బాల్ క్లే, ఐరన్ ఓర్ మైనింగ్ లో పురోగతి
- 'కడప ఉక్కు కర్మాగారం'కు ఖనిజ సరఫరాకై అనంతపురం జిల్లాలో 110 మి.టన్నుల హైగ్రేడ్ ఖనిజ నిల్వల గుర్తింపు
- జగనన్న భూహక్కు-భూరక్ష సర్వే కోసం ఇప్పటివరకు 30 లక్షల సర్వే రాళ్ళ సరఫరా
- ఎపిఎండిసి చరిత్రలోనే 2022-23లో మంగంపేట బెరైటీస్ కు అత్యధిక ధర
- చిలకలూరిపేట (మం.) యడవల్లి (గ్రా)లో 70 హెక్టార్లలో కలర్ గ్రానైట్ లీజు

అంతర్జాతీయంగా 'ఎపిఎండిసి' రికార్డులు

- చరిత్రలో తొలిసారి 3 అమెరికన్ కంపెనీలతో ఎపిఎండిసి ఎంఓయులు
- మిడిల్ ఈస్ట్ దేశాల్లో మంగంపేట బెరైటీస్ కు గట్టి డిమాండ్
- అమెరికా మార్కెట్లో 44 శాతం ఎపిఎండిసి బెరైటీస్ వాటా
- ప్రపంచంలోని మరే దేశానికి దక్కని ఇంత వాటా
- అంతర్జాతీయంగా 30 దేశాలకు బెరైటీస్ ఎగుమతులు
- 273 మిలియన్ డాలర్ల పరిహారం కేసులో రాకియా పై లండన్ ఆర్బిట్రేషన్ కోర్ట్ లో ఎపి ప్రభుత్వం చారిత్రాత్మక విజయం

జాతీయస్థాయిలో ఎపిఎండిసి విజయాలు

- సింగరేణి, కోల్ ఇండియా సరసన నిలిచిన 'ఎపిఎండిసి'
- 2022-23లో మధ్యప్రదేశ్ సుల్యారీ లో బొగ్గు ఉత్పత్తి ద్వారా రెవెన్యూ : రూ.483 కోట్లు
- 2023-24ఆర్థిక సంవత్సరంలో సుల్యారీ బొగ్గుగనుల ద్వారా రెవెన్యూ లక్ష్యం: రూ.1700 కోట్లు
- ప్రైవేటు సంస్థలతో పోటీ పడి ఝార్ఖండ్ లోని బ్రహ్మదియాను వేలంలో దక్కించుకున్న ఎపిఎండిసి
- 2023-24 లో బ్రహ్మదియాలో కోకింగ్ కోల్ ఉత్పత్తికి సన్నాహాలు
- మూడు HMBS మైనింగ్ లీజులను ఎపిఎండిసికి కేటాయించిన కేంద్రం

ఎపిఎండిసి ఫౌండేషన్ ద్వారా సామాజిక కార్యక్రమాలు

- మంగంపేటలో ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్ ద్వారా 1000 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య
- మంగంపేట పరిసర 10 గ్రామాలకు హెల్త్ సెంటర్ ద్వారా ఉచిత వైద్య సేవలు
- మంగంపేట పరిధిలో సిఎస్ఆర్ కింద 141 మందికి ప్రతినెలా రూ.2 వేల చొప్పన పెన్షన్
- సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కమ్యూనిటీ హాళ్ళు, బస్ షల్టర్ల నిర్మాణం
- వికలాంగులకు ఉచితంగా ట్రై స్కూటర్లు
- 4 జిల్లాల్లో 300 హ్యాబిటేషన్ లలో దాదాపు 3 లక్షల మందికి ఆర్వో వాటర్ ప్లాంట్ల ద్వారా రక్షిత మంచినీరు
- మధ్యప్రదేశ్ లోని సుల్యారీలో 800 మంది విద్యార్థులకు మోడల్ స్కూల్
- సుల్యారీ పరిసర ప్రాంతాల్లోని 10 గ్రామాలకు ఉచిత వైద్య సేవలు




ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్



జగనన్న భూరక్ష - భూహక్కు సర్వే ప్రారంభోత్సవం రోజున ఎపిఎండిసి సరఫరా చేసిన గ్రానైట్ సర్వే రాయితో ప్రారంభోత్సవం చేస్తున్న ముఖ్యమంత్రివర్యులు

డోర్‌నెం. 294/1డి, తాడిగడప-ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు, కానూరు, విజయవాడ - 521 137
ఆంధ్రప్రదేశ్, ఫోన్: 0866-2429999, ఫ్యాక్స్ : 0866 - 2429977 E-mail : info-ho@apmdc.in :: website : www.apmdc.ap.gov.in


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 68

మంగళవారం 30-5-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నాలుగేళ్ళలో పారిశ్రామిక విప్లవం

974 కి.మీ. పొడవైన కోస్తా తీరంలో సగటున ప్రతి 50 కి.మీ. కి పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచి, పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేసిన ముఖ్యమంత్రి వర్యులు

శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు

పలు వైవిధ్యభరితమైన సంస్కరణలతో నాలుగేళ్ళుగా నవ్యాంధ్రను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్న వారికి మా హృదయపూర్వక శుభాభినందనలు...



శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు

Kakinda Gateway Port

- కాకినాడలో 3వ ప్రతిష్టాత్మక గ్రీన్‌ఫీల్డ్ సీపోర్ట్.
- ఇండస్ట్రియల్ సిటీ ప్రక్కనే రాబోతుంది (KSEZ).
- 5,000 ఎకరాలలో పారిశ్రామిక ప్రగతి కోసం బల్క్ డ్రగ్ పార్క్ మరియు ఇతర పరిశ్రమలు రాబోతున్నవి.
- ప్రతిపాదిత డీప్‌వాటర్ పోర్టు 3000 కోట్ల పెట్టుబడితో నిర్మాణం.



శరవేగంగా రూపుదిద్దుకుంటున్న రామాయపట్నం పోర్టు









KAKINADA GATEWAY PORT

KAKINADA SEZ LIMITED

auro infra



ఓం నమో వేంకటేశాయ
జోహార్ వై.యస్.ఆర్
వల్లభనేని బాలశౌరి
పార్లమెంట్ సభ్యులు - మచిలీపట్నం
4 Years of JAGAN Mark Governence
Never Before Ever After
మా నమ్మకం నువ్వే జగనన్న
సంక్షేమ సారథిగా అభివృద్ధి వారధిగా
ప్రతి వర్గానికి న్యాయం చేస్తూ
భావితరాల భవిష్యత్తుకి భరోసా కల్పించిన
జగన్ మోహనుడి జన సమ్మోహన పాలన
నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా
శుభాకాంక్షలతో...
4 Years
Golden Era
దాసరి కిరణ్ కుమార్
టిటిడి బోర్డు మెంబర్


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 68

మంగళవారం 30-5-2023


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

4 Years

ప్రగతిపథంలో నాలుగేళ్లు..

ఇచ్చిన మాటే లక్ష్యంగా

సుపరిపాలన



నాలుగేళ్లలో ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.5 శాతం అమలు

కులం, మతం, ప్రాంతం, వర్గం చూడకుండా సంక్షేమాభివృద్ధి పథకాలు

- పేదరికం నుంచి కుటుంబాలను పైకి తీసుకురావడమే లక్ష్యం
- ప్రతి కుటుంబం భవిష్యత్తు బాగుండాలనే ధ్యేయంతో పాలన
- కోవిడ్ సంక్షోభం, ఆర్థిక కష్టాలను అధిగమించి మరీ పథకాల అమలు
- నాలుగేళ్లలో అన్ని వర్గాలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా 10.46 కోట్ల ప్రయోజనాలు.. ఇందుకోసం ఏకంగా రూ.3.02 లక్షల కోట్లు వ్యయం
- సంక్షేమంలోనూ బీసీలకు సామాజిక న్యాయం
- ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో అత్యధికంగా 16.70 లక్షల మంది బీసీలే
- పాలనా సంస్కరణలతో ప్రజల వద్దకే పారదర్శక పాలన

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకిచ్చిన మాట నెరవేర్చడమే లక్ష్యంగా నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోంది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.5 శాతం నెరవేర్చడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. కులం, మతం, ప్రాంతం, వర్గంతో పాటు చివరికి ఎవరికి ఓటు వేశారన్నది కూడా చూడకుండా సుపరిపాలన అందించారు. చెప్పిన మాట మేరకు సంక్షేమాభివృద్ధి పథకాల అమలు కొనసాగిస్తున్నారు. పేదరికం నుంచి కుటుంబాలను పైకి తీసుకురావడమే లక్ష్యంగా మేనిఫెస్టోలో చెప్పని పథకాలను సైతం అమలు చేశారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం నిన్నటి కంటే నేడు.. నేటి కంటే రేపు.. రేపటి కంటే భవిష్యత్తు బాగుండాలనే లక్ష్యంగా నాలుగేళ్ల పాలన కొనసాగించారు. కోవిడ్ సంక్షోభం, ఆర్థిక కష్టాలను అధిగమించి మరీ పథకాలు అమలు చేసి విశ్వసనీయతకు మారు పేరుగా పాలన సాగుతోంది. గత ప్రభుత్వాలకు భిన్నంగా, మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథాలైన భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా అమలు చేసి చూపించారు. అందుకే ధైర్యంగా 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా

మిగతా 3వ పేజీలో ▶

దూసుకెళ్తున్న పారి'శ్రామికం'



రాష్ట్ర ప్రభుత్వ కృషితో ఏపీవైపు దిగ్గజ సంస్థల చూపు

- భారీగా పెట్టుబడులు పెడుతున్న అంబానీ, అదానీ, టాటా, బిర్లా, భజాంకా, జిందాల్ తదితరులు
- లక్షలాది మందికి లభిస్తోన్న ఉపాధి.. కొత్తగా పోర్టులు, హార్బర్లు, పారిశ్రామిక పార్కులు, విమానాశ్రయాల నిర్మాణం
- విశాఖ కేంద్రంగా ఐటీలోనూ ముందుకు..

ఆరోగ్యానికి బలం



వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

సుజలాం.. సుఫలాం.. సస్యశ్యామలం



రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చిన సీఎం వైఎస్ జగన్

వస్తున్నారు టాపర్లు



మారిన సర్కారు బడి.. మురిసిన చదువుల తల్లి

అట్టడుగు వర్గాల ముందడుగు



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సింహ భాగం పదవులు

రైతుకు అసలైన భరోసా



వ్యవసాయదారులకు చేదోడుగా నిలుస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం

వివరాలు 2,3,6,10,11 పేజీల్లో..

ఆరోగ్యానికి బలం!



- నాలుగేళ్లలో వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు
- రూ.16 వేల కోట్లతో జవసత్వాలు కల్పించిన సీఎం జగన్
- ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది
- 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో చరిత్ర
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరాతో పేదలకు కొండంత అండ
- ఏకంగా 3,255 ప్రొసీజర్లకు ఉచిత వైద్యం
- రెండు పథకాల కోసమే రూ.8,302 కోట్లు వ్యయం
- ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణుల ముంగిటకు వైద్య సేవలు



మచిలీపట్నంలో నిర్మాణం పూర్తి చేసుకుంటున్న వైద్య కళాశాల భవనాలు

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా వైద్య, ఆరోగ్య రంగంలో నియామకాలతోపాటు పెద్ద ఎత్తున మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత అనే మాటకు తావు లేకుండా చర్యలు తీసుకోవడం మొదలు నాడు–నేడు ద్వారా వసతులతో తీర్చిదిద్దింది. కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణంతోపాటు ఫ్యామిలీ డాక్టర్ విధానం లాంటి విప్లవాత్మక చర్యలతో ఆరోగ్య రంగం ముఖ చిత్రాన్నే మార్చేసింది.

కొరతకు చెక్

రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా 2019 నుంచి ఇప్పటివరకు ఏకంగా 48,639 వైద్య సిబ్బంది పోస్టులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భర్తీ చేయడం గమనార్హం. పదవీ విరమణ తదితర కారణాలతో ఖాళీ అయ్యే పోస్టులను ఎప్పటికప్పుడు గుర్తించి భర్తీ చేసేలా అత్యవసర అనుమతులు ఇచ్చింది. కేవలం వైద్య శాఖలో పోస్టుల భర్తీ కోసమే ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేస్తున్నారు.

నాలుగేళ్లలో వైద్య పోస్టుల భర్తీ ఇలా..	వైద్య సిబ్బంది	పోస్టులు
	స్పెషలిస్ట్ వైద్యులు	3,899
	మెడికల్ ఆఫీసర్‌లు	2,088
	స్టాఫ్ నర్సులు	5,777
	ఏఎన్ఎంలు	13,540
	ఎంఎల్‌హెచ్‌పీలు	10,032
	పారా మెడికల్ సిబ్బంది	9,751
	డీఈఓలు	249
	ఇతరులు	3,303

నాడు-నేడుతో మహర్దశ

టీడీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ రూ.16 వేల కోట్లకు పైగా నిధులను కేటాయించారు. నాడు–నేడు కార్యక్రమంతోపాటు 2,500 మంది జనాభాకు ఒకటి చొప్పున 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పటికే సొంత భవనాలున్న వాటికి మరమ్మతులు చేయడంతో పాటు పాత భవనాల స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నారు. 882 చోట్ల పనులు పూర్తి కావటంతో ఆస్పత్రులు అధునాతనంగా తయారయ్యాయి. 121 సీహెచ్‌సీలు, 42 ఏరియా ఆస్పత్రులు, రెండు ఎంసీహెచ్ ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. రూ.50 కోట్లతో ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం రీసెర్చ్ సెంటర్ నిర్మాణం దాదాపు పూర్తయింది.

ఈ ఏడాదే 5 కొత్త వైద్య కళాశాలలు

వైద్య సదుపాయాలను బలోపేతం చేయడంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటును చేపట్టారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఐదు కళాశాలల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు కల్పించాలని నిర్దేశించుకోగా ఇప్పటికే నంద్యాల, ఏలూరు, మచిలీపట్నం, విజయనగరం కళాశాలలకు అనుమతులు వచ్చాయి. రాజమండ్రి వైద్య కళాశాలకు త్వరలో అనుమతి రానుంది. తద్వారా ఒక్కో చోట 150 సీట్లు చొప్పున మొత్తం 750 సీట్లు పెరగనున్నాయి. 2024–25లో పులివెందుల, పాడేరు, ఆదోని కళాశాలలు అందుబాటులోకి రానుండగా ఆ తర్వాత ఏడాది మిగిలిన తొమ్మిది కళాశాలలను ప్రారంభించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. మరోవైపు ఇప్పటికే ఉన్న కళాశాలలు, ఆస్పత్రులను రూ.3,820 కోట్లతో బలోపేతం చేస్తోంది. వీటన్నింటి ఫలితంగా 627 పీజీ సీట్లు పెరిగాయి. తద్వారా రాష్ట్రంలో స్పెషలిస్ట్ వైద్యుల సంఖ్య పెరగనుంది.



ప్రజారోగ్యానికి రక్ష

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రజారోగ్యానికి రక్షణ కల్పిస్తున్నారు. గత నాలుగేళ్లలో ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాల కోసం ప్రభుత్వం రూ.8,302.47 కోట్లు ఖర్చు చేసింది. ఆరోగ్యశ్రీ ద్వారా 36,19,741 మంది, ఆసరా ద్వారా 16,20,584 మంది లబ్ధి పొందారు. రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలన్నింటినీ పథకం పరిధిలోకి తేవడంతో 1.4 కోట్లకు పైగా కుటుంబాలకు ఆరోగ్యశ్రీ వర్తిస్తోంది. 2014–19 మధ్య ఆరోగ్యశ్రీలో కేవలం 1059 ప్రొసీజర్స్ మాత్రమే అందుబాటులో ఉండగా ఇప్పుడు 3,255కి పెరిగాయి. ఆరోగ్య ఆసరా ద్వారా శస్త్ర చికిత్స అనంతరం వైద్యులు సూచించిన మేరకు రోగి కోలుకునే సమయంలో రోజుకు రూ.225 లేదా నెలకు గరిష్టంగా రూ.ఐదు వేల వరకు ప్రభుత్వం సాయం అందిస్తోంది.

2019 నుంచి ఆరోగ్యశ్రీ అమలు		
సంవత్సరం	లబ్ధిదారులు	ఖర్చు (రూ.కోట్లలో)
2019-20	6,44,387	1,501.86
2020-21	8,33,504	1,676.96
2021-22	10,10,022	1,920.2
2022-23	11,31,828	2,192.46

ఆరోగ్య ఆసరా		
సంవత్సరం	లబ్ధిదారులు	ఖర్చు (రూ.కోట్లలో)
2019-20	1,07,233	79.54
2020-21	2,77,563	194.31
2021-22	5,05,515	297.98
2022-23	7,30,273	439.16

108 సేవలకు పూర్వ వైభవం

దివంగత వైఎస్సార్ ప్రారంభించిన 108 అంబులెన్స్ సేవలను గత సర్కారు నిర్వీర్యం చేసింది. సీఎం జగన్ అధికారంలోకి రాగానే మండలానికి ఒక్కొక్కటి చొప్పున 104, 108 వాహనాలను సమకూర్చారు. 768 అంబులెన్స్‌లతో 2020లో సేవలను విస్తరించారు. తాజాగా మరో 146 అంబులెన్స్‌లను కొనుగోలు చేస్తున్నారు. రోజుకు సగటున 3,300 మంది అంబులెన్స్ సేవలను ప్రస్తుతం వినియోగించుకుంటున్నారు. 104 ఎంఎంయూలను తొలుత మండలానికి ఒకటి చొప్పున 676 వాహనాలను సమకూర్చారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులోకి రావడంతో 104 ఎంఎంయూలు మరో 256 వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 500 కొత్త వాహనాలతో 'డాక్టర్ వైఎస్సార్ తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను విస్తరించారు. రోజుకు సగటున 631 మంది బాలింతలను క్షేమంగా ఇళ్లకు చేరుస్తున్నారు.

పల్లెల్లోనే వైద్యం

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ లక్ష్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నెలకు రెండు సార్లు గ్రామాలను సందర్శిస్తున్నారు. 104 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ)తో పాటు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ సేవలు అందిస్తున్నారు. మంచానికి పరిమితం అయిన వృద్ధులు, వికలాంగులు, ఆరోగ్యశ్రీ రోగులను మధ్యాహ్నం నుంచి పరామర్శిస్తూ ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై వాకబు చేస్తున్నారు. ఇప్పటి వరకూ వైద్యులు గ్రామాలకు వెళ్లి 1,17,08,895 మందికి వైద్య సేవలు అందించారు.



ప్రకాశం జిల్లా అల్లూరు గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్న మొబైల్ మెడికల్ యూనిట్ వైద్య సిబ్బంది (ఫైల్)

రాష్ట్రంలో పారిశ్రామికవృద్ధి పరుగులు పెడుతోంది. సుదీర్ఘ తీరప్రాంతం, అపారమైన సహజ వనరులు, మానవ వనరులకు తోడు అన్ని విధాలుగా సహకరించే రాష్ట్ర ప్రభుత్వం.. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌లో ఉండటంతో దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి కదలివస్తున్నాయి. ఈ నాలుగేళ్లలో అంబానీ, అదానీ, టాటా, బిర్లా, మిట్టల్, జిందాల్, భంగర్, భజాంకా, ఒబెరాయ్, దాల్మియా, సింఫ్నీ తదితర పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రానికి స్వయంగా వచ్చి పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందాలు చేసుకున్నారు. సులభతర వాణిజ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా ఉండటంతో పాటు పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తీసుకురావడం కూడా పారిశ్రామికవేత్తలను ఏపీవైపు వచ్చేలా చేస్తోంది.

\- సాక్షి, అమరావతి



దూసుకెళ్తున్న పారి‘శ్రామికం’

లక్షలాది మందికి ఉపాధి..

సీఎం జగన్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.75,649.77 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి. ఇందులో 111 భారీ, మెగా యూనిట్లు రూ.56,534.53 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి ప్రారంభించాయి. వీటి ద్వారా 73,876 మందికి ఉపాధి లభించింది. అంటే సగటున ఏడాదికి రూ.15,418 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి మొదలయ్యింది. ఇందులో సీఎం జగన్ చేతుల మీదుగా రూ.13,766 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఆరు యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభమైంది. వీటి ద్వారా 15,040 మందికి ఉపాధి లభించింది. ఇవికాకుండా రూ.7,305 కోట్ల విలువైన కియా పరిశ్రమ వాణిజ్యపరమైన ఉత్పత్తిని కూడా సీఎం జగన్ 2019 డిసెంబర్ 5న ప్రారంభించారు. వీటికి అదనంగా ఎంఎస్ఎంఈ రంగంలో 1,52,558 కొత్త యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.19,115.24 కోట్ల పెట్టుబడులు రావడంతో 13,63,706 మందికి ఉపాధి లభించింది. ఇవికాకుండా మరో 86 ప్రాజెక్టులకు సంబంధించిన రూ.2,35,125.60 కోట్ల పెట్టుబడులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి కూడా వాస్తవ రూపంలోకి వస్తే 2,36,806 మందికి ఉపాధి లభించనుంది. వీటిలో రూ.35,672.28 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఏడు భారీ యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటి ద్వారా 7,015 మందికి ఉపాధి లభిస్తుంది.



నాలుగేళ్లలో వాస్తవ రూపంలోకి వచ్చిన రూ.75,649.77 కోట్ల పెట్టుబడులు

రాష్ట్ర ప్రభుత్వ కృషితో ఏపీ వైపు పారిశ్రామిక దిగ్గజాల చూపు

పెట్టుబడులతో ముందుకొచ్చిన అంబానీ, అదానీ, టాటా, బిర్లా, మిట్టల్, జిందాల్, బంగర్, భజాంకా, ఒబెరాయ్, దాల్మియా, సింఫ్నీలు

ఇందులో భారీ, మెగా యూనిట్ల రూపేణా రూ.56,534.53 కోట్లు
సగటున ఏటా రూ.15,418 కోట్లు- 13,63,706 మందికి ఉపాధి
కొత్తగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం
భోగాపురం, రామాయపట్నం వద్ద ఎయిర్‌పోర్టులు
మూడు కారిడార్లలో పారిశ్రామిక పార్కుల అభివృద్ధి
విశాఖ, అనంతపురంలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులు

ఐటీలో ఇన్ఫోసిస్, అమెజాన్, బీఈఎల్, రాండ్‌శాండ్ తదితర దిగ్గజ కంపెనీలు రాక

ఐటీలోనూ మేటి..

వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రోత్సాహంతో పలు ఐటీ సంస్థలు విశాఖపట్నానికి తరలివచ్చి.. తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయి. 2019కు ముందు ఏపీలో ఐటీ కంపెనీల సంఖ్య 178 ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 372కు చేరింది. ఈ నాలుగేళ్లలో ఇన్ఫోసిస్, అదానీ డేటా సెంటర్, కంట్రోల్ఎస్ డేటా సెంటర్, రాండ్‌శాండ్, బీఈఎల్, అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్, టెక్ మహీంద్రా, డబ్ల్యూఎన్ఎస్, టెక్నోటాస్క్, టెక్‌బుల్ తదితర సంస్థలు రాష్ట్రంలో ఐటీ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయి. వీటి ద్వారా 20,000 మందికి ఉపాధి లభిస్తోంది. కొత్తగా ఏర్పాటయ్యే ఐటీ కంపెనీల కోసం విశాఖలో ఐస్పేస్ బిజినెస్ పార్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. మరోవైపు ఈ ఏడాది మార్చిలో విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13,11,465 కోట్ల విలువైన 386 పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. వీటి ద్వారా 6.07 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.



పోర్టులు, హార్బర్లు.. పారిశ్రామిక పార్కులు

రూ.18,000 కోట్లతో ప్రభుత్వం కొత్తగా నాలుగు పోర్టులు(రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ వద్ద) నిర్మిస్తోంది. వీటి ద్వారా కనీసం లక్ష మందికి ఉపాధి లభించనుంది. మత్స్యకారులకు లబ్ధి చేకూర్చేలా రూ.3,700 కోట్లతో పది ఫిషింగ్ హార్బర్లతో పాటు 6 ఫిషింగ్ ల్యాండ్‌లను అభివృద్ధి చేస్తోంది. రాష్ట్రం నుంచి వెళ్తున్న మూడు పారిశ్రామిక కారిడార్ల(విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు)లో రూ.11,753 కోట్లతో నక్కపల్లి, రాంబల్లి, కృష్ణపట్నం, కొప్పర్తి, చిత్తూరు సౌత్, ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. కోవిడ్ సంక్షోభంలోనూ కొప్పర్తిలో వైఎస్సార్‌ఈఎంసీ, వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. విశాఖ, అనంతపురంతో పాటు కొప్పర్తి, ఓర్వకల్లు వద్ద లాజిస్టిక్ పార్కులను ఏర్పాటు చేస్తోంది. కొత్తగా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు రామాయపట్నం తెట్టు వద్ద మరో విమానాశ్రయం ఏర్పాటు చేస్తోంది.

ఇచ్చిన మాటే లక్ష్యంగా సుపరిపాలన

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికలు రాకముందే ఎమ్మెల్యేలను ప్రతి ఇంటికి పంపించే కార్యక్రమం చేపట్టారు. నాలుగేళ్ల పాలనతో ఇంటింటికి, మనిషి మనిషికి ఏం మేలు జరిగిందనే విషయాన్ని ఎమ్మెల్యేలు స్వయంగా వివరించడమే కాకుండా.. ప్రింట్ చేసిన పుస్తకాలను వారికి ఇచ్చి, ఆ మేలు జరిగిందా లేదా అని ధైర్యంగా అడిగి ప్రజల మద్దతు పొందుతున్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చినందునే ఎమ్మెల్యేలు ధైర్యంగా ప్రజల దగ్గరకు వెళ్లగలుగుతున్నారు. మరోపక్క వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో పరిపాలనలో సంస్కరణల ద్వారా విప్లవాత్మక మార్పులు తెచ్చారు. గ్రామ, వార్డు స్థాయికి పరిపాలనను, పథకాలను, పౌర సేవలను పారదర్శకంగా తీసుకెళ్లారు. తద్వారా గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.

రూ.3.02 లక్షల కోట్లు సాయం

గత నాలుగేళ్లలో అన్ని వర్గాలకు నవరత్నాల కింద డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా 10.46 కోట్ల ప్రయోజనాల కోసం ఏకంగా రూ.3.02 లక్షల కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా 7.90 కోట్ల ప్రయోజనాలకు రూ.2.11 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. నాన్ డీబీటీ ద్వారా 2.57 కోట్ల ప్రయోజనాల కింద రూ.91 వేల కోట్లు వ్యయం చేశారు. సంక్షేమంలో బీసీలకు సామాజిక న్యాయం జరిగింది. వెనుకబడిన వర్గాల వారు ఇన్నాళ్లు వెనుకబడిపోయే ఉన్నారు. జనాభాలో అత్యధికులుగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వాల్లో వారికి ఏ రంగంలో కూడా తగిన వాటా లభించలేదు. ఆఖరుకు దారిద్ర్య రేఖకు దిగువనున్న బీసీలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు కూడా గత ప్రభుత్వంలో నోచుకోలేదు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదు.. దేశానికే బ్యాక్ బోన్ అంటూ పాదయాత్రతో పాటు ఎన్నికల ముందు నిర్వహించిన బీసీ సదస్సులో కొత్త నిర్వచనం చెప్పిన అప్పటి ప్రతిపక్ష నేత.. సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన నాలుగేళ్ల పాలనలో అన్ని రంగాల్లో వారికి తగిన వాటా ఇచ్చారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో అత్యధికంగా 16.70 లక్షల మంది బీసీలే కావడం గమనార్హం.

- నాలుగేళ్లలో నవరత్నాలు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా బీసీలకు రూ.1,48,597 కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.99,681 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.48,916 కోట్లు వ్యయం చేశారు. నవరత్నాలు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఎస్సీలకు రూ.53,929 కోట్లు వ్యయంచేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.34,963 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.18,966 కోట్లు వ్యయంచేశారు.
- నవరత్నాలు డీబీటీ నాన్ డీబీటీ ద్వారా ఎస్టీలకు రూ.15,114 కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.10,395 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.4,719 కోట్లు ఖర్చు చేశారు.
- నవరత్నాలు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మైనారిటీలకు రూ.18,960 కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.11,948 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.7,012 కోట్లు వ్యయం చేశారు.
- నవరత్నాలు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా కాపులకు రూ.26,634 కోట్లు వ్యయం చేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.20,550 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.6,084 కోట్లు ఖర్చు చేశారు.

తొలి మహిళ


● నిషా సోలంకి

పంటకు రక్షకురాలు

హర్యాణాలో రైతులు ఇప్పుడు ప్రమాదకరమైన పురుగు మందుల పిచికారి నుంచి రక్షణ పొందుతున్నారు. దానికి కారణం నిషా సోలంకి. హర్యాణాలో తొలి మహిళా అగ్రో డ్రోన్ పైలెట్ అయిన సోలంకి డ్రోన్ ద్వారా వేల ఎకరాల్లో సురక్షితంగా పురుగు మందులు చల్లడంలో రైతులకు సహాయం చేస్తోంది. 'ఆమె రాకతో మా శ్రమ చాలా తగ్గింది' అంటున్నారు రైతులు.

కొన్ని గెలుపు గాథలు విశేషంగా అనిపిస్తాయి. హర్యాణాలో ఒకప్పుడు భ్రూణ హత్యలు ఎక్కువగా జరిగేవి. ఆడపిల్ల పుడితే గుట్టు చప్పుడు కాకుండా మట్టుబెట్టే విధానం ఉండేది. అప్పటి ఆ అఘాయిత్యాల వల్ల ఇప్పుడు యువకులకు వధువులు దొరకడం ఆ రాష్ట్రంలో కష్టంగా మారింది. పితృస్వామ్యాన్ని అధికంగా పాటించే అలాంటి చోట్ల ఒక అమ్మాయి సాంకేతిక రంగంలో రాణిస్తూ సేద్య రంగానికి సేవలు అందించడం విశేషం కాకుండా ఏమవుతుంది?

తొలి డ్రోన్ పైలెట్

30 ఏళ్ల నిషా సోలంకి తల మీదున్న క్యాప్‌పై 'పైలెట్' అని రాసి ఉంటుంది. అలా 'పైలెట్' అనిపించుకోవడం నిషాకు ఇష్టం. హర్యాణాలోని జజ్జర్‌కు చెందిన నిషా నాలుగో క్లాసు చదువుతున్నప్పుడు మొదటిసారి విమానం ఎక్కి కుటుంబంతో శ్రీనగర్ చూడ్డానికి వెళ్లింది. 'అప్పుడు అనుకున్నాను పైలెట్ కావాలని' అంటుంది నిషా. పెద్దయ్యి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చదవాలని అనుకుంది కాని కుదరలేదు. కర్నాల్‌లోని మహరాణా ప్రతాప్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఫార్మ్ మెషినరీ, పవర్ ఇంజనీరింగ్ కోర్సు చదువుతున్నప్పుడు మొదటిసారి డ్రోన్ ఉపయోగించి చెరకు పంటపై క్రిమి సంహారక మందులు చల్లడం గమనించింది. అగ్రి డ్రోన్ కూడా ఫార్మ్ మెషినరీ విభాగం కిందకే వస్తుంది కనుక నిషా అగ్రి డ్రోన్ ఎగరేయడం గురించి తెలుసుకుంది. ఇంకా మెరుగైన అవగాహన కోసం డి.జి.సి.ఎ. (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) నుంచి 'రిమోట్ పైలెట్ సర్టిఫికెట్ కోర్సు' చేసింది. దాంతో హర్యాణాలోనే మొదటి మహిళా అగ్రి డ్రోన్ పైలెట్‌గా గుర్తింపు వచ్చింది. అందుకే ఆమె క్యాప్ మీద పైలెట్ అని ఉంటుంది.


● డ్రోన్‌తో పర్యవేక్షణ

డ్రోన్‌తో అన్నీ ఉపయోగాలే

నిషా ఎగరేసే అగ్రి డ్రోన్ 25 కిలోల బరువు ఉంటుంది. ఇది 10 లీటర్ల పురుగు మందును ఏకకాలంలో స్ప్రే చేస్తుంది. 'నేను మొదటిసారి కురుక్షేత్రకు సమీపంలోని రైతులకు డ్రోన్ ద్వారా పురుగుమందు చల్లొచ్చని చూపడానికి వెళ్లాను. అక్కడున్న కొందరు కుర్రాళ్లు నన్ను ఆటపట్టించారు– ఈ అమ్మాయి ఈ మిషన్‌తో ఏం చేయగలదు అని. దీని బదులు సంప్రదాయక పద్ధతితో చేతి ద్వారా ఎరువు చల్లడం మేలని కామెంట్ చేశారు. కాని నేను డ్రోన్ ఎగరేసి పురుగు మందు చల్లాక వారు ఆశ్చర్యపోయి సారీ చెప్పారు. చాలా మెచ్చుకున్నారు' అంటుంది నిషా. 'డ్రోన్ ద్వారా పురుగు మందులు చల్లితే రైతులకు ఆరోగ్య రక్షణ ఉంటుంది. పురుగు మందుల చల్లడం వల్ల వచ్చే 50 శాతం జబ్బులు రావు. అదీగాక 200 లీటర్ల నీళ్ల కలిపి చల్లే పురుగు మందులను డ్రోన్ ద్వారా 10 లీటర్ల నీళ్లతో చల్లొచ్చు. నీరు మిగులుతాయి. డ్రోన్‌తో సమంగా స్ప్రే అయ్యి ఫలితం బాగుంటుంది. సమయం మిగులుతుంది. పని గంటలు తగ్గుతాయి. కూలీలు అక్కర్లేదు. ఎక్కువ ఎకరాలు ఉన్న రైతులు తప్పక డ్రోన్‌ను వాడాలి' అంటుంది నిషా.

స్త్రీలు తక్కువ కాదు

'భూమి మగవారి పేరున ఉంటుంది కనుక రైతులంటే పురుషులే అన్న భావన ఏర్పడింది. కాని స్త్రీలు చేసే కష్టం చిన్నది కాదు. స్త్రీలు అన్ని రకాల వ్యవసాయ పనులు చేయగలరు. వారికి ఈ రంగంలో సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి. మా ఊరి వాళ్లకు నేను చేస్తున్న పని ఏమిటో అర్థం కావడానికి చాలా కాలం పట్టింది. ఇప్పుడు వారంతా నన్ను చూసి గర్వపడుతున్నారు. అమ్మాయిలు ఇలా ముందుకు రావడం చాలా బాగుందంటున్నారు' అంది నిషా.

తన భవిష్యత్తునే కాక రైతు భవిష్యత్తును కూడా పచ్చగా చేయగలిగిన ఇటువంటి యువతులే నవ భారత నిర్మాతలు.

బ్యూటిప్

గోరంత అందం

గోళ్లు విరగడం, పాడిబారి నిస్తేజంగా కనిపిస్తే ఆరోగ్యం పట్ల తప్పక శ్రద్ధ చూపించాలి. దాంతోపాటు ఈ జాగ్రత్తలూ తీసుకోవాలి. ● చేతులను సబ్బు లేదా లిక్విడ్‌తో శుభ్రపరుచుకున్నాక గోళ్లు పాడిబారినట్టుగా అనిపిస్తే తప్పక లోషన్‌తో మసాజ్ చేసుకోవాలి. దీంతో గోళ్ల చుట్టూ చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ● గోళ్లను స్నానానంతరం కట్ చేయడం మేలు. నీళ్లలో నానిన గోళ్లు గరుకుదనం తగ్గి, ట్రిమ్ చేయడం సులువు అవుతుంది. ● వెచ్చని నీళ్లలో కొద్దిగా ఉప్పు, అర టీ స్పూన్ నిమ్మరసం కలిపి గోళ్లు మునిగేలా చేతులను ఉంచాలి. పది నిమిషాల తర్వాత గోళ్ల చుట్టూ ఉన్న మురికిని తొలగించాలి. తర్వాత మంచినీళ్లతో కడిగి, తడి లేకుండా తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. నెయిల్ పాలిష్‌లో బేస్ కోట్ వేసుకుంటే గోళ్ల త్వరగా పాడవవు. అందంగానూ ఉంటాయి.




● మీనాక్షి సుందరేశ్వర్‌లో...


● ఖాకీ: ది బిహార్ చాప్టర్‌లో...

విజయ పథం


● మోనిక షేర్‌గిల్

క్వీన్ ఆఫ్ కంటెంట్


స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లో సక్సెస్ అంటే సాధారణ విషయం కాదు. ఏ నిమిషానికి ఏ ట్రెండ్ వస్తుందో తెలియదు. అక్కడి ట్రెండ్ ఇక్కడ వర్కవుట్ అవుతుందో లేదో తెలియదు. సక్సెస్‌కు సవాలక్ష కారణాలు ఉంటాయి. అయితే అవేమీ చీకట్లో దాక్కున్నవి కావు. వెదుక్కుంటూ వెళితే ముందుకు వచ్చి పలకరిస్తాయి. మోనిక చేసిన పని అలా వెదుక్కుంటూ వెళ్లడమే! ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా ప్రయాణం మొదలుపెట్టిన మోనిక షేర్‌గిల్ 'వైస్ ప్రెసిడెంట్, కంటెంట్, నెట్‌ఫ్లిక్స్ ఇండియా' స్థాయికి చేరుకోవడం అదృష్టం కాదు...తాను పడిన కష్టం. ఆ కష్టమే మోనిక షేర్‌గిల్‌ను 'హై అండ్ మైటీ–50 పవర్‌పీపుల్' జాబితాలో చేర్చింది....

నెట్‌ఫ్లిక్స్ ఇండియా స్పీడ్ అందుకొని వ్యూ అవర్స్, రెవెన్యూ పెంచుకొని ప్రపంచస్థాయిలో సక్సెస్ సాధించింది. 'దీనికి కారణం?' అనే ప్రశ్నకు ఏకైక జవాబు నలభై తొమ్మిది సంవత్సరాల మోనిక షేర్‌గిల్.

మోనిక చొరవ వల్ల ఎంతో మంది ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చారు. ప్రపంచానికి, ప్రతిభావంతులకు మధ్య 'నెట్‌ఫ్లిక్స్'ను వారధిగా మలచడంలో మోనిక ఘన విజయం సాధించింది.

నెట్‌ఫ్లిక్స్ కోసం కంటెంట్‌ను ఎంపిక చేసుకోవడంలో మోనిక అనుసరించే ప్రమాణాల విషయానికి వస్తే...క్రైమ్ షోలలోని సంచలన ధోరణి కనిపించదు. సబ్జెక్ట్‌లో ఉండే బలమే ప్రధాన ప్రమాణం అవుతుంది. దీనికి ఉదాహరణ ఆస్కార్ పురస్కారం గెలుచుకున్న డాక్యుమెంటరీ ఫిల్మ్... ది ఎలిఫెంట్ విష్పరర్స్.

''ఎంటర్‌టైన్‌మెంట్ బిజినెస్‌లో ఎప్పుడూ రిస్క్ పొంచి ఉంటుంది. ప్రేక్షకుల అభిరుచిని కచ్చితంగా పసిగట్టడం కష్టమే. కరోనా కల్లోల సమయం ప్రేక్షకుల ఆలోచనధోరణిలో మార్పు తీసుకువచ్చింది. కంటెంట్ విషయంలో తమ భాష, ప్రాంతానికి మాత్రమే పరిమితం కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న కంటెంట్‌పై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. 'ఏది నిజం? ఏది కల్పన?' అనే విషయంలో వారికి స్పష్టత ఉంది. వ్యాపార విజయం అనేది వారికి సంబంధం లేని విషయం. వారి దృష్టి మొత్తం కథ పైనే ఉంటుంది'' అంటున్న మోనిక విజయాల గురించి ఆనందించడమే కాదు నిరాశపరిచిన కంటెంట్ విషయంలో సమీక్ష చేసుకోవడంలో ముందుంటుంది.



రొమాంటిక్ హిందీ–కామెడీ ఫిల్మ్ 'మీనాక్షి సుందరేశ్వర్' నిరాశపరిచింది. దీనికి కారణం సరియైన నటీనటులను ఎంపిక చేసుకోకపోవడం. కథ సరిగ్గా ఉండగానే సరిపోదు కాస్టింగ్ కూడా సరిగ్గా ఉండాలని, ఎక్కడా రాజీపడకూడదనే గుణపాఠాన్ని ఆ చిత్రం నుంచి నేర్చుకుంది మోనిక.

పోస్ట్–పాండమిక్ ఆడియెన్స్ ఇంటర్నేషనల్ స్టోరీలను ఇష్టపడుతున్నారు. జర్మన్ షో 'డార్క్' మనదేశంలో హిట్ కావడం దీనికి నిదర్శనం. ఆ సమయంలో...

'వేరే దేశం కథలు మన దగ్గర విజయం సాధించినప్పుడు, మన దేశంలోని ఒక ప్రాంతానికి చెందిన కథలు మరొక ప్రాంతంలో ఎందుకు విజయం సాధించవు' అంటూ ఆలోచన చేసింది మోనిక. తాను నమ్మింది 'కాంతార' హిందీ వెర్షన్ విజయంతో నిజం అయింది.

సక్సెస్ ముఖ్యమే కాని వేలం వెర్రి జోలికి వెళ్లదు మోనిక. 'కొరియన్ భాషలో గ్లోబల్ బ్రేక్ ఔట్ షోలు ఉన్నాయి. అలా మనం కూడా సాధించాలి అనుకున్నంత మాత్రాన అది సాధ్యపడదు. ఆ షోలో ఉన్న వినూత్నమైన ఐడియా, దాని చుట్టూ ముడిపడి ఉన్న ఎన్నో అంశాలు గ్లోబల్ బ్రేక్‌ఔట్‌కు కారణం కావచ్చు. మనదైన ఆలోచన చేసి విజయం సాధించాలిగానీ ఫలాన షోలాగా ఉండాలి అని ప్రయత్నిస్తే విజయం మాట ఎలా ఉన్నా నిరాశ మాత్రమే మిగులుతుంది. ర్యాట్ రేస్ ఇష్టపడను. ఆ రేసులో పడితే ఆయాసమే మిగులుతుంది తప్ప ఆలోచన మిగలదు' అంటోంది మోనిక.

కొంతకాలం క్రితం ట్రెండ్స్‌కు నిర్దిష్టమైన టైమ్ అంటూ ఉండేది. అర్థం చేసుకోవడానికైనా, అందిపుచ్చుకోవడానికైనా అది బాగా సరిపోయేది. కాని ఇప్పటి పరిస్థితి వేరు. ట్రెండ్స్ వేగంగా మారుతున్నాయి. ఒక దేశంలో ట్రెండ్‌గా ఉన్నది ఇక్కడ వర్కవుట్ అవుతుందో లేదో తెలియదు....ఇలాంటివి ఎన్నో దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళుతుంది మోనిక షేర్‌గిల్. అందుకే ఆమె పేరు ముందు 'క్వీన్ ఆఫ్ కంటెంట్' అనే విజయధ్వజం రెపరెపలాడుతోంది.

పాడి పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు...
మొలకల దాణా మేలు!

మేత బలహీనంగా ఉంటే పశువులు బలహీనంగా మారుతాయి. పశువులకు పోషకవంతమైన దాణా ఇవ్వనప్పుడు, అవి బరువు తగ్గుతాయి. తక్కువ పాలు ఇస్తాయి. వాటి పాలలో కొవ్వు తగ్గుతుంది. రెండు వారాల్లోనే జుట్టు రంగు కోల్పోయి చర్మవ్యాధుల బారిన పడతాయి. నాణ్యమైన మేత అందని ఆవులు తక్కువ ఈతలు ఈనుతాయి. వాటి దూడలకూ సులభంగా వ్యాధులు వస్తాయి.









మొలకల్లో ఎక్కువ పోషకాలు

ధాన్యాలను తగినంతగా నీటిలో నానబెడితే మొలకలు వస్తాయి. ఇంకొంచెం పెరిగితే మారాకు వేస్తాయి. విత్తనం బరువు మొలకెత్తిన తర్వాత నీటిని గ్రహించడం వల్ల రెట్టింపు అవుతుంది.

సాధారణ ధాన్యాల కంటే మొలకెత్తిన ధాన్యం సులభంగా జీర్ణమవుతుంది. మొలకెత్తడం వల్ల ధాన్యాలలోని పిండి పదార్థం అంతా చక్కెరగా మారుతుంది. జీర్ణశక్తిని పెంచడానికి సహాయపడే అనేక రకాల ఎంజైమ్‌లు మొలకల్లో ఉంటాయి. మొలకెత్తడం వల్ల ధాన్యాలలో ఖనిజాలు, విటమిన్లు, ప్రొటీన్లు ఎక్కువగా లభిస్తాయి.

ఏ ధాన్యం మొలకలైనా పెట్టొచ్చు

అందుబాటులో ఉన్న గోధుమలు, బార్లీ, వోట్స్ లేదా మొక్కజొన్న వంటి ఏ ధాన్యాలనైనా మొలక కట్టి పశువులకు తినిపించవచ్చు. పాడి పశువులు బలహీనంగా ఉన్నప్పుడు లేదా తక్కువ పాలు ఇస్తున్నాయనుకున్నప్పుడు వాటికి సోయాబీన్స్, బఠానీలు, పెసలు వంటి పప్పుధాన్యాల మొలకలు కూడా ఇవ్వవచ్చు.

మొలక కట్టడానికి నాణ్యమైన విత్తనాలను వాడండి. విరిగిన లేదా నలిగిన విత్తనాలను ఎప్పుడూ ఉపయోగించవద్దు. ఎందుకంటే అవి సరిగ్గా పెరగవు. చేతితో కోతకోసి నూర్చిన విత్తనాల మొలక శాతం ఎక్కువగా ఉంటుంది.

విత్తనాలను శుభ్రమైన నీటితో కడిగి ప్లాస్టిక్ టబ్‌లో పోయాలి. నీటిలో తేలిన తాలు గింజలను తీసివేయండి. అవి మొలకెత్తవు. మొలకెత్తిన గింజలపై బూజు పెరగకుండా ఉండేందుకు సగం చారెడు ఉప్పు వేసి, గింజలను సుమారు 12 గంటల పాటు నానబెట్టాలి. 12 గంటల తర్వాత నీటిని తీసివేసి, విత్తనాలను శుభ్రమైన గోనె సంచిలో లేదా నూలు గుడ్డ సంచిలో పోసి, మూతి గట్టిగా కట్టేయండి. దాన్ని నీడలో లేదా ఇంట్లో ఉంచండి. వేడి వాతావరణంలో, విత్తనాలు మొలకెత్తడానికి సుమారు 16 నుంచి 18 గంటలు పడుతుంది. చల్లని వాతావరణంలో 24 గంటల కంటే ఎక్కువ సమయం పడుతుంది. గోనె సంచి లేదా నూలు వస్త్రాన్ని వాడిన తర్వాత ప్రతి సారీ ఉతికి ఎండలో ఆరబెట్టండి.

గింజల నుంచి 1 లేదా 2 సెంటీమీటర్ల పొడవున తెల్లటి మొలకలు బయటకు వచ్చిన తర్వాత, వాటిని ఉపయోగించవచ్చు. ఒక పాడి ఆవుకు అర కిలో లేదా 4–5 గుప్పిళ్ల మొలకెత్తిన గింజలను ఇతర దాణాతో రోజుకు ఒకసారి తినిపించండి.

మేకలు, గొర్రెలు, కోళ్లకు కూడా..

పాడి ఆవులు, గేదెలకే కాదు. ఇతర పశువులకు కూడా మొలకలు పెట్టొచ్చు. మేక లేదా గొర్రెకు వారానికి రెండుసార్లు ఒకటి లేదా రెండు గుప్పిళ్ల మొలకలు తినిపించవచ్చు. 10 కోళ్లకు రోజుకు ఒకసారి ఒక గుప్పెడు మొలకలు వెయొచ్చు.

ఈ అంశంపై తెలుగు/ఆంగ్ల వీడియోను www.accessagriculture.org లో చూడొచ్చు.

జూన్‌లో పల్నాడు జిల్లాలో చిన్న శోధాయాత్ర

పల్నాడు జిల్లా వినుకొండ ప్రాంతంలో మారుమూల గామాల్లో రైతులు, గిరిజనులు, మహిళల సంప్రదాయ విజ్ఞానం,సృజనశీలతపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి జూన్ 23 నుంచి 25 వరకు పల్లెసృజన స్వచ్ఛంద సంస్థ చిన్న శోధా పాదయాత్ర నిర్వహించనుంది. వినుకొండ సమీపంలోని కొండ్రముట్ల గ్రామం నుంచి 23న ప్రారంభమై 25న మెల్లవాగు గ్రామంలో ముగుస్తుంది. గ్రామీణ సృజనాత్మకపై ఆసక్తిగల ఔత్సాహికులు ఎవరైనా ఈ యాత్రలో పాల్గొనవచ్చు. రూ. 500 చెల్లించి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పల్లెసృజన అధ్యక్షులు బ్రిగేడియర్ పి. గణేశం (98660 01678) తెలిపారు. వివరాలకు.. 99666 46276, 89199 03118.

సాగుబడి
మృగశిర కార్తె : జూన్ 8 నుంచి

దున్నకుండానే మొక్కజొన్న, వేరుశనగ!

● డబుల్ వీల్ మార్కర్ పరికరంతో జీరో టిల్లేజి పద్ధతిలో విత్తుకుంటున్న ఉత్తరాంధ్ర రైతులు ● తక్కువ శ్రమతో పాటు సమయం, ఖర్చు ఆదా కావడం.. నెల రోజుల పంట కాలం కలిసి రావటంతో డబుల్ వీల్ మార్కర్‌కు ప్రాచుర్యం ● మహిళా రైతులకు అనుకూలమైన ఆవిష్కరణ కావటం మరో విశేషం

దుక్కి దున్నకుండానే మొక్కజొన్న సాగు(జీరో టిల్లేజి) పద్ధతి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఇటీవల చాలా ప్రాచుర్యం పొందింది. దీనికి ఏకైక కారణం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ అందుబాటులోకి తెచ్చిన 'డబుల్ వీల్ మార్కర్' (రెండు చక్రాలతో రంధ్రాలు వేసే పరికరం). సార్వా(ఖరీఫ్)లో వరి సాగు చేసిన భూముల్లో దుక్కి దున్నకుండా ఈ పరికరంతో రైతులు సులభంగా నేలపై రంధ్రాలు చేసి విత్తనాలు వేసుకుంటున్నారు. వరి కోసిన తర్వాత తక్కువ సమయంలోనే మొక్కజొన్న విత్తుకోవడానికి ఈ పరికరం రైతులకు ఎంతో ఉపయోగ పడుతోంది. నాలుగేళ్ల క్రితం ఈ పరికరం తొలుత అందుబాటులోకి వచ్చింది. సార్వా వరి తర్వాత మొక్కజొన్న పంటను వరుసగా మూడు దఫాలు సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్న రైతులు ఉత్తరాంధ్రలో ఉన్నారు. వరుసల మధ్య దూరం తగ్గించుకునే చిన్న మార్పు చేసుకొని దుక్కిలేని పద్ధతిలో వేరుశెనగ విత్తుకోవడానికి కూడా ఈ పరికరం ఉపయోగపడుతోందని రైతులు సంతోషిస్తున్నారు.

నెల కాలం కలిసి వస్తుంది!

తొలకరి వరి చేను కోసిన తరువాత పొలంలో వరి కొయ్యకాళ్లలో దుక్కి దున్నకుండానే పదును చూసుకుని డబుల్ వీల్ మార్కర్‌ను నడిపి మొక్కజొన్న విత్తనాలు నేరుగా విత్తుకోవాలి. ఈ విధానంలో రైతులకు దుక్కి ఖర్చులు ఆదా అవ్వటమే కాకుండా నెల రోజుల పంట కాలం కలిసి వస్తుంది. మొక్కజొన్న సాగు ప్రారంభమైన తొలినాళ్లలో శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో రైతులకు కొయ్యతో గాని, కొయ్యతో చేసిన పెగ్ మార్కర్ అనే పరికరంతో గాని వరి మాగాణిల్లో నేరుగా రంధ్రాలు చేసి మొక్కజొన్న విత్తనాలు విత్తేవారు. పెగ్ మార్కర్ పరికరాన్ని ఉపయోగించేటప్పుడు ఎక్కువ శ్రమ, ఎక్కువ సమయం వృథా అవుతుండేది. మగ కూలీలు మాత్రమే పెగ్ మార్కర్‌ను ఉపయోగించే వారు.


● డబుల్ వీల్ మార్కర్


● డబుల్ వీల్ మార్కర్ పరికరాన్ని భుజంపై పెట్టుకొని తీసుకువెళ్లొచ్చు




● డబుల్ వీల్ మార్కర్‌ను ఉపయోగిస్తున్న మహిళా రైతు హైమావతి


● డబుల్ వీల్ మార్కర్‌తో మొక్కజొన్న సాగుకు తన పొలంలో రంధ్రాలు వేస్తున్న రైతు ఎల్. సత్యనారాయణ. (పక్కన) డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి హరిబాబు.




● డబుల్ వీల్ మార్కర్ డిజైన్

తుది రూపుదిద్దిన సత్యనారాయణ

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ రూపొందించిన డబుల్ వీల్ మార్కెర్‌కు రైతు లంకలపల్లి సత్యనారాయణ (83741 02313) మార్పులు చేసి బరువు తగ్గించి 2019లో తుది రూపుదిద్దారు. సత్యనారాయణ వ్యవసాయం చేస్తూనే వెల్డర్‌గా పనిచేస్తున్నారు. ఆ అనుభవంతో సులభంగా ఒక వ్యక్తి తన పొలానికి భుజాన వేసుకొని తీసుకువెళ్లేందుకు వీలుగా డబుల్ వీల్ మార్కర్ పరికరాన్ని మార్చారు. మొదట తన పొలంలో ఉపయోగించి సంతృప్తి చెందిన తర్వాత, తానే తయారు చేసి రూ. 2,900కు ఇతర రైతులకు అందిస్తున్నారు. 2021 రబీ నాటికి రణస్థలం మండలంలో రైతులకు 85 డబుల్ వీల్ మార్కర్లను ఇచ్చారు. ఆ తర్వాత రైతుల్లో ఇది ప్రాచుర్యంలోకి వచ్చింది.

2016 నుంచి ప్రయోగాలు

కూలీల ఖర్చు, శ్రమ తగ్గించుకుంటూ మొక్కజొన్న, వేరుశెనగ పంటలను దుక్కి దున్నకుండా నేరుగా ఎలా విత్తుకోవాలనే అంశంపై డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి హరిబాబు (84999 28483) 2016 నుంచి అనేక ప్రయోగాలు చేసి ఎట్టకేలకు సఫలీకృతులయ్యారు. తొలుత ఒక చక్రం ఉన్న మార్కర్‌ను, తర్వాత ఐదు చక్రాల మార్కర్లను డిజైన్ చేసి రైతులకు అందించారు. వీటితో సరైన ఫలితాలు రాకపోవడంతో డబుల్ వీల్ మార్కర్‌ను డిజైన్ చేశారు. ఇది రైతులకు ఉపయోగకరంగా ఉండటంతో మంచి స్పందన వచ్చింది. ఆముదాలవలసలోని ఏరువాక కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సూచనల మేరకు ఉక్కుతో రెండు చక్రాల మార్కర్ (డబుల్ వీల్ మార్కర్) పరికరం దిద్దుకుంది.

మొక్కజొన్నతో పాటు వేరుశనగ

మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం, వరుసల మధ్య 60 సెం.మీ.ల దూరంలో డబుల్ వీల్ మార్కర్‌తో రంధ్రాలు చేసి దుక్కి చేయకుండానే మొక్కజొన్న విత్తుకోవచ్చు. అదేవిధంగా వేరుశనగ విత్తుకోవడానికి మార్కర్‌లో స్వల్ప మార్పు చేసుకోవాల్సి ఉంటుంది. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం, వరుసల మధ్య 40 సెం.మీ.ల దూరంలో వేరుశనగ విత్తుకోవాలి.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో గత రబీలో వరి కోసిన 48,146 ఎకరాల్లో దున్నకుండా డబుల్ వీల్ మార్కర్‌తో మొక్కజొన్నను సాగు చేశారు. 18 మండలాల్లో సుమారు 25 లక్షల వ్యంతో మండలానికి 40 చొప్పున 720 పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ తెలిపింది. ఈ పరికరాలన్నీ ఎల్. సత్యనారాయణ తయారు చేసి ఇచ్చినవే.

సమాన దూరంలో విత్తనాలు నాటడం వలన గాలి, వెలుతురు ధారాళంగా సోకి, పంటలకు పురుగులు, తెగుళ్ల బెడద తక్కువగా ఉంది. చేను ఏపుగా పెరిగి సాధారణ పద్ధతిలో కంటే జీరోటిల్లేజ్ పద్ధతిలో మేలైన దిగుబడులు నమోదు అవుతుండటం విశేషం. మహిళలు ఉపయోగించడానికి డబుల్ వీల్ మార్కర్ అనువుగా ఉండటం మరో విశేషం. మహిళా రైతులకు, ముఖ్యంగా చిన్న, సన్నకారు ఒంటరి మహిళా రైతులకు ఈ ఆవిష్కరణ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– గంగి నాగరాజు,
సాక్షి, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా



సంక్షేమ సారథికి శుభాకాంక్షలు
చారిత్రక విజయానికి
4 ఏళ్ళు
విప్లవాత్మక సంస్కరణల ద్వారా సుపరిపాలనలో
రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపి
జనరంజక పాలనను అందిస్తున్న
గౌ॥ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారు
నాలుగేళ్ళ పాలనను పూర్తి చేసుకున్న
శుభసందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ...
ఆడారి ఆనంద్ కుమార్
ఛైర్మన్ : విశాఖ డెయిరి
ఛైర్మన్ : A.P. MSME డెవలప్‌మెంట్ కార్పొరేషన్,
సమన్వయకర్త : విశాఖ పశ్చిమ నియోజకవర్గ YSRCP

రైతుకు అసలైన భరోసా



రైతులకు 'వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ సాయం' అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

రైతన్నకు చేదోడుగా వైఎస్ జగన్ ప్రభుత్వం





నాడు: టీడీపీ పాలన (2018-19 ఖరీఫ్ సీజన్‌)లో విత్తనాల కోసం రైతుల అవస్థలకు నిదర్శనం ఈ చిత్రాలు



నేడు: వైఎస్ జగన్ పాలనలో సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా కేంద్రం నుంచి విత్తనాలు తీసుకువెళుతున్న రైతులు

సాక్షి, అమరావతి

వ్యవసాయం దండగ అన్నవాళ్ల నోళ్లను మూయిస్తూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగాన్ని పండుగలా మార్చారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ సర్కారు ఏర్పాటైన తరువాత దేశంలోనే ఎక్కడా లేనివిధంగా వ్యవసాయ రంగంలో సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ, పంట నష్ట పరిహారం, వైఎస్సార్ యంత్ర సేవ, ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ పథకాలతోపాటు రైతులు పండిస్తున్న పంటలను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయడం, విత్తన సబ్సిడీ, సూక్ష్మ సేద్యం, పండ్ల తోటల అభివృద్ధి, ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ, ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ, పగటి పూటే 9 గంటల విద్యుత్ సరఫరా కోసం ఫీడర్ల సామర్థ్యం పెంపు, విత్తు నుంచి పంట విక్రయం వరకు రైతుకు అండదండలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)ల ఏర్పాటు వంటి ఎన్నో కీలక నిర్ణయాలతో వ్యవసాయ రంగాన్ని ఉరకలెత్తిస్తున్నారు.

ప్రాజెక్టులు నిండుకుండలు.. నిండా పంటలు

పాలించే మారాజు మనసున్న వాడైతే.. ప్రకృతి పులకిస్తుందని రుజువైంది. నాలుగేళ్లుగా కరువుతీరా కురుస్తున్న వర్షాలతో సాగునీటి ప్రాజెక్టులు నిండుకుండలను తలపిస్తున్నాయి. భూగర్భ జలాలు ఎగసిపడుతున్నాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తి 2014–19 మధ్య ఏటా సగటున 153.95 లక్షల టన్నులు నమోదు కాగా.. 2019–23 మధ్య ఏటా సగటున 165.40 లక్షల టన్నులకు పెరగడం విశేషం. ఇదే సందర్భంలో ఉద్యాన పంటల దిగుబడులు సైతం పెరిగాయి. 2014–15లో 305 లక్షల టన్నులుగా ఉన్న ఉద్యాన పంటల దిగుబడులు.. ప్రస్తుతం 368.83 లక్షల టన్నులకు పెరిగింది.

మూడు రెట్లు పెరిగిన కేటాయింపులు

టీడీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు రూ.61,758 కోట్లు వెచ్చించగా.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.1,70,571.62 కోట్లను వెచ్చించింది. మరో ఏడాదికి కేటాయించే మొత్తాన్ని కలిపితే గత ప్రభుత్వం కంటే.. మూడు రెట్లకు పైగా నిధులు కేటాయించినట్టు తేటతెల్లమవుతోంది. కరోనా విపత్కర పరిస్థితులకు ఎదురొడ్డి మరీ రూ.1.49 లక్షల కోట్ల సాయాన్ని నేరుగా రైతులకు అందించి రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవడం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేసింది.

సున్నా వడ్డీ.. ఉచిత బీమా

సున్నా వడ్డీకే పంట రుణాలివ్వడంతో పాటు ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేస్తూ పైసా భారం పడకుండా పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే బీమా కల్పిస్తోంది. కోతలకు ముందే ప్రతి పంటకు కనీస మద్దతు ధర ప్రకటిస్తోంది. ధరల స్థిరీకరణ నిధి ద్వారా కనీస మద్దతు ధర దక్కని పంటలను కొనుగోలు చేస్తోంది. విపత్తుల వల్ల నష్టపోయే రైతులకు సీజన్ ముగిసేలోగానే పంట నష్టపరిహారంతో పాటు బీమా సొమ్ము సైతం అందిస్తోంది. సేంద్రియ సాగుతోపాటు చిరుధాన్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రత్యేక పాలసీలను తీసుకొచ్చింది. మెట్టప్రాంత పంటలకు పగటిపూట 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరాటంకంగా అందిస్తోంది.

పల్లెసీమల రూపురేఖలు మార్చిన ఆర్బీకేలు

గతంలో విత్తనాల కోసం రైతులు పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చేది. ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్లు అంటగట్టే అవసరం లేని పురుగుమందులను కొనాల్సి వచ్చేది. ఎండల్ని తట్టుకోలేక అన్నదాతలు ఏటా పదుల సంఖ్యలో రైతులు మతిచెందేవారు. అదునులోపు విత్తనం దొరక్క దళారుల వద్ద నకిలీ, నాసిరకం వాటిని అధిక ధరలకు కొనుగోలు చేసేవారు. విత్తనాల కోసం రైతుల పాట్లు పత్రికల్లో పతాక శీర్షికల్లో కథనాలు వచ్చేవి. ఆర్బీకేల రాకతో రైతుల కష్టాలు తొలగిపోయాయి.



టీడీపీ హయాంలో వ్యవసాయ శాఖకు బడ్జెట్ కేటాయింపులు	
ఆర్థిక సంవత్సరం	బడ్జెట్ (రూ.కోట్లలో)
2014-15	13,110
2015-16	14,184
2016-17	16,250
2017-18	18,214
మొత్తం	61,758

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేటాయింపులు	
2019-20	28,866.23
2020-21	29,159.97
2021-22	31,256.35
2022-23	39,852.78
2023-24	41,436.29
మొత్తం	1,70,571.62

ఇప్పడు సీజన్‌కు ముందే రెడీ

సాగు ఉత్పాదకాలను రైతుల ముంగిటకు తీసుకెళ్లాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో రైతుల వెతలకు చెక్ పడింది. సీజన్‌కు ముందుగానే సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలను గ్రామస్థాయిలో నిల్వ చేసి రైతులకు నేరుగా పంపిణీ చేస్తున్నారు. ఆర్బీకేల్లోని కియోస్క్‌ల్లో బుక్ చేసుకున్న 24 గంటల్లోపే వారి ముంగిట అందిస్తున్నారు. ఆర్బీకేలు ఏర్పాటైన మూడేళ్లలో 63.50 లక్షల మంది రైతులకు 37.04 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. వరి, అపరాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, పచ్చిరొట్ట విత్తనాలే కాదు పత్తి, మిరప వంటి నాన్ సబ్సిడీ విత్తనాలను సైతం ఆర్బీకేల ద్వారా అందిస్తున్నారు. 10,778 ఆర్బీకేల ద్వారా దుక్కి పనులు ప్రారంభం కాకముందే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుతున్నాయి. ముందుగానే అగ్రి ల్యాబ్స్‌లో టెస్ట్ చేసి మరీ నాణ్యమైన సీడ్‌ను పంపిణీ చేస్తున్నారు. మూడేళ్లుగా చూద్దామంటే విత్తనాల కోసం ఎక్కడా బారులు తీరే పరిస్థితి కనిపించడం లేదు. విత్తనం దొరుకుతుందో లేదోననే చింత ఎవరిలోనూ కనిపించడం లేదు. నకిలీల ఊసే ఎక్కడా వినిపించడం లేదు. మూడేళ్లలో ఆర్బీకేల ద్వారా రూ.953.53 కోట్ల విలువైన 8.69 లక్షల టన్నుల ఎరువులను 23.47 లక్షల మంది రైతులకు పంపిణీ చేశారు. మార్కెట్‌లో ధరలు పతనమైన ప్రతిసారి మార్కెట్‌లో జోక్యం చేసుకుని ఆర్బీకేల ద్వారా ఆయా పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. పంట రుణాలు, ఈ–క్రాప్ నమోదు, పంటల బీమా, పంట నష్టపరిహారం ఇలా ప్రతి ఒక్కటి అర్హత ఉన్న ప్రతి రైతుకు అందేలా ఆర్బీకే సిబ్బంది కృషి చేస్తున్నారు. గతంలో పశువుకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఫోన్ చేయగానే క్షణాల్లో వీహెచ్‌ఏ ఇంటికి వచ్చి మరీ సేవలందిస్తున్నారు. ఉచితంగా మందులిస్తున్నారు. నాణ్యమైన ధ్రువీకరించిన మిశ్రమ దాణా, పశుగ్రాసం సరఫరా చేస్తున్నారు. ఫలితంగా గతంతో పోలిస్తే పాల దిగుబడి రెట్టింపయ్యిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్బీకేల ద్వారా ఆక్వా సాగు చేస్తున్న ప్రతి రైతుకు లైసెన్సు జారీతో పాటు నాణ్యమైన ఫీడ్‌ను అందజేస్తున్నారు.

అగ్రి ల్యాబ్‌లు.. యంత్ర సేవా కేంద్రాలు.. గోదాములు

అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో 147 చోట్ల వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌ను నెలకొల్పుతోంది. ఇందుకోసం ఒక్కొక్క ల్యాబ్‌కు రూ.81 లక్షల చొప్పున వెచ్చిస్తోంది. రూ.6.25 కోట్ల అంచనా వ్యయంతో జిల్లా స్థాయిలో 13 ల్యాబ్‌లు, రూ.75 లక్షల అంచనా వ్యయంతో రీజనల్ స్థాయిలో నాలుగు సమన్వయ కేంద్రాలను, గుంటూరులో రాష్ట్రస్థాయిలో రూ.8.50 కోట్ల అంచనాతో విత్తన జన్యు పరీక్ష కేంద్రాన్ని డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 70 అగ్రి ల్యాబ్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కాగా.. చిన్న, సన్నకారు రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను స్వల్ప అద్దె ప్రాతిపదికన వారి ముంగిటకే తీసుకెళ్లాలన్న సంకల్పంతో రూ.691 కోట్లతో 6,525 ఆర్బీకే, 391 క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆర్బీకేలకు అనుబంధంగా రూ.1,584.61 కోట్లతో 2,536 బహుళ ప్రయోజన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్కటి రూ.40 లక్షల అంచనాతో 500 టన్నుల సామర్థ్యంతో 1021, రూ.75లక్షల అంచనాతో 100 టన్నుల సామర్థ్యంతో 113 గోదాముల నిర్మిస్తున్నారు. వీటిలో రూ.166.33 కోట్ల ఖర్చుతో వివిధ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే వెయ్యి గోదాములు నిర్మాణం పూర్తి కాగా.. వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

నాలుగేళ్లలో రైతులకు అందించిన సంక్షేమ ఫలాలు

పథకం	రైతుల సంఖ్య (లక్షల్లో..)	వెచ్చించిన మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	52.38	27,062.09
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	44.28	6,684.84
వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ	73.88	1,834.50 (గత ప్రభుత్వ బకాయిలతో)
పంట నష్టపరిహారం	22.22	1,911.78
ధాన్యం కొనుగోలు (ఇప్పటివరకు)	-	58,652
ధాన్యం సేకరణ బకాయిలు	-	960
ఇతర పంటల కొనుగోలు (ఇప్పటివరకు)	-	7,156
ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ	-	27,800
గత ప్రభుత్వ విద్యుత్ బకాయిలు	-	8,845
పగటిపూట 9 గంటల విద్యుత్ కోసం ఫీడర్ల సామర్థ్యం పెంపునకు	-	1,700
గత ప్రభుత్వం చెల్లించాల్సిన విత్తన బకాయిలు	-	384
శనగ రైతులకు బోనస్	-	300
సూక్ష్మసేద్యం, పండ్లతోటల అభివృద్ధి	13.58	1,264.24
ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ	-	2,647
ఆయిల్‌పామ్ రైతులకు సబ్సిడీ	00.24	85.47
వైఎస్సార్ యంత్రసేవా పథకం	-	690.87
గత ప్రభుత్వ బకాయిలు (యాంత్రీకరణ)	-	430
విత్తన సబ్సిడీ	60.76	1,023.52

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 30 । మే । 2023



ట్రాఫిక్ ఏడీసీపీగా ప్రసాద్

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏడీసీపీగా డి.ప్రసాద్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సీపీ టీకే రాణాను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు.



213 మంది సర్టిఫికెట్ల పరిశీలన

పాలిసెట్ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. మూడు కేంద్రాల్లో 213 మంది సర్టిఫికెట్లు పరిశీలించారు. -8లో▸



కేంద్ర మంత్రికి స్వాగతం

గన్నవరం: కేంద్ర రసాయనాలు, ఎరువులు, పునరుత్పాదక ఇందన శాఖ మంత్రి భగవంత్ ఖుబాకు గన్నవరం విమానాశ్రయంలో సోమవారం బీజేపీ నేతలు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు



జగ్గయ్యపేట అర్బన్: ఈ నెల 26, 27, 28 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో జగ్గయ్యపేట స్విమ్మర్లు 59 పతకాలతో విజయ దుందుభి మోగించారు. సంయుక్త భారతీయ ఖేలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8 వ జాతీయ ఈత పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున స్థానిక డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ నుంచి 22 మంది స్విమ్మర్లు పాల్గొన్నారు. కోచ్‌లు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మీ, టీం మేనేజర్ అన్నంనేని కల్యాణ్ ఆధ్వర్యంలో ఏడుగురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు, ఇద్దరు బాలికలు, ఐదుగురు బాలురు కలిపి మొత్తం 22 మందితో కూడిన జట్టు పోటీలకు హాజరైంది. ఐఎం ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్‌ఫ్లై, 400 మీటర్లు, 200 మీటర్లు, 100 మీటర్లు, 50 మీటర్లు, 25 మీటర్ల విభాగాల్లో తలపడ్డారు. 36 బంగారు, 19 రజిత, 4 కాంస్య కలిపి మొత్తం 59 పతకాలు సాధించారు. ప్రతిభ కనబర్చిన స్విమ్మర్స్‌కు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మండవ శ్రీనివాసరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

విజయవాడ స్టేషన్‌లో వాటర్ కియోస్క్ సేవలు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు వాటర్ కియోస్క్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏడీఆర్ఎం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సీనియర్ డీపీఓ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం బాలమురళీధర్‌తో కలసి ప్లాట్‌ఫాం నెంబర్ 1, 6–7లలో ఏర్పాటు చేసిన వాటర్ కియోస్క్ పాయింట్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం మాట్లాడుతూ జూన్ 10వ తేదీ వరకు 50 మంది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు తమ సేవలు అందిస్తారని చెప్పారు. ప్రయాణికులు వాటర్ కియోస్క్ సేవలను సద్వినియోగం చేసుకుని వేసవిలో డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సిబ్బందికి, ప్రయాణికులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ పీబీఎస్ ప్రసాద్, స్టేషన్ మేనేజర్ రవిప్రకాష్, ఏడీసీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మను దర్శించుకున్న ప్రముఖులు

గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడులో 27 ఏళ్లకు ఒకసారి జరిగే గంగానమ్మ సంబరాల ముగింపు పూజలకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జోగి రమేష్, కొడాలి నానిని వైఎస్సార్ సీపీ నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలేటి చంటి, పెన్నేరు ప్రభాకర్, శేషం గోపి, దిలీప్, శాయన రవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు చేయూత

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ పథకం ద్వారా సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం సాయంత్రం సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల పురోభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యల గురించి కమిటీ సభ్యులతో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు గరిష్టంగా కోటి రూపాయల వరకు రుణం, ప్రాజెక్టు వ్యయంలో 30 శాతం వరకు రాయితీ ఇస్తారన్నారు. ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం బెనిఫిషరీ పెట్టుబడి పెట్టాలన్నారు. ప్రస్తుతం వ్యాపారంలో కొనసాగుతున్న అన్ని సూక్ష్మ పరిశ్రమల వారు దీనికి అర్హులన్నారు. ఔత్సాహికులైన యువతీ, యువకులు, డ్వాక్రా మహిళలు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సమావేశంలో ఏపీఎఫ్ పీఎస్ ఈడీ మహాలక్ష్మి, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.వి జయభారతి పాల్గొన్నారు.

నవశకం.. ప్రగతి పథం

■ జనరంజకంగా జగనన్న పాలన ■ అభివృద్ధిలో దూసుకుపోతున్న ఎన్టీఆర్ జిల్లా ■ పేదలకు భారీ ఎత్తున సంక్షేమ ఫలాలు ■ అభివృద్ధి పథంలో అన్ని రంగాలు ■ ఆనందోత్సాహాల్లో ప్రజలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాలో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్టీఆర్ జిల్లా ప్రగతి పథంలో పయనిస్తోంది. కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి పరుగులు పెడుతోంది. జీవన ప్రమాణాలు గణనీయంగా పెరగడంతో సంతృప్తికరస్థాయిలో ప్రజలు జీవనం సాగిస్తున్నారు. అన్ని రంగాలు పురోగతి సాధిస్తూ జిల్లాలో నవశకం నెలకొంది. జగనన్న జనరంజక పాలనపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టి నేటితో నాలుగేళ్లు పూర్తయింది. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు 98.5 శాతం నెరవేర్చి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే ఐదు హామీలపై సంతకాలు చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి తెచ్చి పాలనను ప్రజల ముంగిటకు చేర్చారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. పాలనా సౌలభ్యం కోసం జిల్లాల విభజన చేశారు. దీంతో కొత్తగా ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లా అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తోంది. ఇప్పటికే వాణిజ్య నగరంగా గుర్తింపు పొందిన విజయవాడ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. రైల్వే, విమాన, హైవే సదుపాయాలు ఉండటంతో నగరం వాణిజ్య పరంగా, పారిశ్రామికంగా పురోగమిస్తోంది. కృష్ణా నది తీరం, దుర్గమ్మగుడి, ప్రకాశం బ్యారేజి వంటివి ఉండటంతో నగరవాసులకు ఆహ్లాదం పంచడంతోపాటు, పర్యాటకులను ఆకర్షించే విధంగా టూరిజం మరింతగా వృద్ధి సాధిస్తోంది. ఇరిగేషన్ ప్రాజెక్టులు, జగనన్న కాలనీల నిర్మాణం, ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంతో సాగుతున్నాయి. అంబేడ్కర్ స్మృతి వనం విజయవాడ నగరానికి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారనుంది. పర్యాటక రంగంపై ఫోకస్ పెట్టి మూలపాడు వద్ద బటర్‌ఫ్లై పార్కును అందంగా తీర్చిదిద్దారు. కొండపల్లి బొమ్మల పరిశ్రమ అంతరించి పోకుండా, బొమ్మల తయారీ దారులకు చేయూత నిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

సంక్షేమ ఫలాలు ఇలా....

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	పంపిణీ చేసిన మొత్తం(రూ.కోట్లల్లో)
2019–20	15,60,850	1462.43
2020–21	21,41,872	4678.54
2021–22	15,62,722	1932.61
2022–23	8,56,557	1859.05
మొత్తం	61,22,001	9932.63



విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం పనులు

కిడ్నీ బాధితులకు అండగా..

ఏ.కొండూరు మండలంలోని 15 గిరిజన తండాల్లో గత 25 ఏళ్లుగా కిడ్నీ సంబంధిత సమస్యలతో ప్రజలు బాధ పడుతున్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.40 కోట్లతో తాగునీటి ప్రాజెక్టులు చేపట్టారు. ఏ.కొండూరు పీహెచ్‌సీలోనే డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అర్హులైన వారికి పింఛను రూ.10 వేలు అందిస్తున్నారు.

పెద్ద ఎత్తున సంక్షేమ ఫలాలు...

అమ్మఒడి పథకంలో జిల్లాలోని 13,14,230 మంది తల్లుల ఖాతాల్లో రూ.1971.32 కోట్లు జమ చేశారు.



కొత్తూరు తాడేపల్లిలో జగనన్న కాలనీలోని ఓ కుటుంబం

చేయూత పథకం ద్వారా 2,69,656 మంది మహిళలకు రూ.499.09 కోట్ల లబ్ధి కలిగింది. రైతుభరోసా కింద 5,02,012 మంది రైతు ఖాతాల్లో నేరుగా రూ.652.47 కోట్ల పెట్టుబడి సాయం జమ అయింది. జగనన్న విద్యాదీవెన ద్వారా 3,09,447 మంది తల్లుల ఖాతాల్లో రూ.356.09 కోట్లు, వసతి దీవెనలో 3,07,914 మందికి రూ.142.87 కోట్లు అందించారు. వైఎస్సార్ పంటల బీమా పథకం ద్వారా 92,555 మంది రైతులకు రూ.286.01 కోట్లు పరిహారం ఇచ్చారు. నాలుగేళ్లలో 61,22,001 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.9923.63 కోట్లు జమ చేశారు. గడప గడప కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు.

పేదలందరికీ ఇళ్లు...

ఎన్టీఆర్ జిల్లాలో తొలి దశలో 80,541 మంది పేదలకు ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 12,264 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. నాడు–నేడు కింద రూ. 257 కోట్లతో 598 పనులు చేపట్టి పాఠశాలల రూపురేఖలు మార్చారు. ఆస్పత్రులకు రూ.46.31 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. 1084 ప్రభుత్వ భవన నిర్మాణపు పనులు కొనసాగుతున్నాయి. జిల్లాలో 29 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు.



కృష్ణా రిటైనింగ్ వాల్

వేగంగా జాతీయ రహదారుల నిర్మాణం....

విజయవాడ వెస్ట్ బైపాస్‌కు సంబంధించి చిన్న అవుటు పల్లి–గొల్లపూడి మధ్య పనులు శరవేగంగా సాగుతున్నాయి. కృష్ణా నదిపై వంతెన పనులు ముమ్మరంగా నడుస్తున్నాయి. హైదరాబాద్ హైవేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు తుది దశకు చేరాయి. గ్రీన్‌ఫీల్డ్ హైవే (విజయవాడ–ఖమ్మం) కు సంబంధించి భూసేకరణను వేగవంతం చేశారు. విజయవాడ తూర్పు బైపాస్‌కు సంబంధించి డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు.

అసాధారణ నిర్ణయం...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 2018 ఏప్రిల్ 30న నిమ్మకూరులో పర్యటించినప్పుడు వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెడతానని చెప్పారు.

సుందర నగరంగా బెజవాడ

బెజవాడను సుందర నగరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రధాన రహదారుల్లోని డివైడర్ల మధ్యలో అందమైన మొక్కలు పెంచుతున్నారు. గ్రీనరీ పెంపునకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రధాన కూడళ్లలో అందమైన పెయింటింగ్‌లు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఎయిర్‌పోర్ట్ కారిడార్‌ను రూ.17 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. నగర వాసులకు ఆహ్లాదం పంచేందుకు వీలుగా 16 పార్కులను అందంగా తీర్చిదిద్దారు. సెంట్రల్ లైటింగ్, స్విమ్మింగ్, ఇండోర్ స్టేడియంలు ఏర్పాటు చేశారు. కాలువ గట్లను ఆధునికీకరించారు. కృష్ణా నది రక్షణ గోడ వెంబడి పచ్చదనం పెంచి, వాకింగ్, సైకిల్ ట్రాక్‌లు నిర్మిస్తున్నారు.

మూడు సార్లు ముఖ్యమంత్రి పదవిలో ఉన్న ఎన్టీఆర్ సొంత అల్లుడు చంద్రబాబు చేయలేని పనిని జగన్ చేసి చూపించారు. చారిత్రక నిర్ణయం తీసుకొన్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

తలమానికంగా అంబేడ్కర్ స్మృతివనం

స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతి వనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో ఏర్పాటు చేసే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నగరానికి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలువనుంది. రూ.248 కోట్లతో పనులు సాగుతున్నాయి. త్వరలోనే స్మృతి వనం అందుబాటులోకి రానుంది. రూ.70 కోట్లతో దుర్గగుడిని అభివృద్ధి చేస్తున్నారు. ముత్యాల–మాదిపాడు రహదారి నిర్మాణం కోసం రూ. 62 కోట్లు కేటాయించారు.

ముంపు నివారణకు రిటైనింగ్ వాల్

జిల్లాలో కోట్లాది రూపాయలతో భారీ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు చేపట్టారు. విజయవాడ వాసులను కృష్ణానది ముంపు బారి నుంచి రక్షించేందుకు వీలుగా రక్షణ గోడలు నిర్మించారు. వారధి నుంచి కోటి నగర్ వరకు రూ.123 కోట్లతో రిటైనింగ్ వాల్ పనులు పూర్తయ్యాయి. అక్కడ నది వెంబడి సైకిల్ ట్రాక్, అందమైన పార్కు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు రక్షణ గోడ నిర్మాణ పనులకు మరో రూ.135 కోట్లతో పనులు సాగుతున్నాయి. బ్యారేజీ ఎగువ ప్రాంతంలో రూ.102 కోట్లతో డ్రెడ్జింగ్ పనులు చేపట్టారు. రూ. 62 కోట్లతో మున్నేరు కాల్వల అధునికీకరణ పనులు చేపట్టారు. విజయవాడలో కాలువలపై రూ.31 కోట్లతో ఏడు బ్రిడ్జిలను నిర్మించారు. అజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా జిల్లాలో 26 చెరువులను అధునికీకరించారు.

స్పందన వినతులకు గుణాత్మక పరిష్కారం

కలెక్టర్ ఢిల్లీరావు



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పందన వినతులకు గుణాత్మక పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఢిల్లీరావు, డీఆర్వో కె. మోహన్‌కుమార్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమస్యకు పూర్తి పరిష్కారం లభించలేదని తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. పునరావృతం అవుతున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఓర్పుతో ప్రజల సమస్యలు విని సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కోరారు. జగనన్నకు చెబుదాం, గ్రామ వార్డు సచివాలయాలు, 1902 కాల్ సెంటర్, స్పందన మొబైల్ యాప్, వెబ్ అప్లికేషన్ ద్వారా నమోదవుతున్న అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. స్పందనలో మొత్తం 102 అర్జీలు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ 53, పోలీస్ 18, మున్సిపల్ 7, పంచాయతీరాజ్ 5, హౌసింగ్ 3, విద్య 2, డీఆర్డీఏ 2, ఉపాధి కల్పన 1, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమం 1, సోషల్ వెల్ఫేర్ 1, ట్రెజరీ 1, గనులు 1, వ్యవసాయం 1, ఏపీసీపీడీసీఎల్ 1, కార్మిక శాఖ 1, ఏపీఎస్ఆర్టీసీ 1, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 1, డ్వామా 1, బ్యాంకు 1 అర్జీలున్నాయి. డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాస్, డీఎస్‌వో పి.కోమలి పద్మ, డ్వామా పీడీ జె. సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఈఓ సీవీ రేణుక, డీఎంహెచ్‌వో యం. సుహాసిని, హౌసింగ్ పీడీ రజనీకుమారి, పశుసంవర్ధక శాఖ జేడీ కె. విద్యాసాగర్, జిల్లా సర్వే అధికారి కె. సూర్యారావు, డీసీఓ సీహెచ్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

● చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసన



శాసన రాజధాని అమరావతిలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను శ్మశానవాటికతో పోల్చిన టీడీపీ అధినేత చంద్రబాబు దుర్మార్గపు వైఖరికి నిరసనలు వ్యక్తమయ్యాయి. పేదల ఇళ్ల స్థలాలను సమాధులంటూ అవమానకరంగా మాట్లాడటాన్ని ఖండిస్తూ వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో చుట్టుగుంట సెంటర్ నుంచి విశాలాంధ్ర రోడ్, మొగల్రాజపురం సిద్ధార్థ కాలేజీ వరకు బైక్‌లపై నిరసన ర్యాలీ చేస్తున్న చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కోచింగ్ క్యాంపులకు క్రీడా సామగ్రి పంపిణీ

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆదేశాలతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో 24 క్రీడాంశాల్లో కొనసాగుతున్న 50 స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపులకు క్రీడా సామగ్రిని ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ ఎస్.ఎ.అజీజ్ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో సోమవారం అందజేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 2.75 లక్షల విలువ చేసే క్రీడా సామగ్రిని క్యాంప్ ఇన్‌చార్జ్‌లకు అందజేసినట్లు చెప్పారు. ఈ నెల 10వ తేదీన ప్రారంభమైన ఈ క్యాంప్‌లు జూన్ ఆరోవ తేదీతో ముగుస్తాయన్నారు.

ఉద్యోగం పేరిట మోసగించిన నిందితులకు జైలు

విజయవాడ స్పోర్ట్స్: బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి, నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌తో మోసం చేసిన ఇద్దరు నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వై.శ్రీనివాసరావు సోమవారం తీర్పు చెప్పారు. విజయవాడకు చెందిన ఓ నిరుద్యోగికి బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తామంటూ పటమట ప్రాంతానికి చెందిన బాణావతు సునీత, గన్నవరం రమణనగర్‌కు చెందిన దేవరపల్లి విక్టర్‌బాబు నమ్మించారు. నిరుద్యోగి తండ్రి నుంచి రూ.2.10 లక్షలు తీసుకుని విజయవాడ వన్‌టౌన్‌లోని ఆంధ్రా బ్యాంకులో ఉద్యోగం వచ్చినట్లు అపాయింట్‌మెంట్ లెటర్ తయారుచేసి ఇచ్చారు. నిరుద్యోగి తండ్రి ఈ లెటర్ తీసుకుని బ్యాంకుకు వెళ్లి విచారించగా అది నకిలీదని, అందులోని సంతకాలను ఫోర్జరీ చేశారని తెలిసింది. 2016 డిసెంబర్ ఎనిమిదో తేదీన వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. 2017 జనవరి నాల్గో తేదీన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టులో వాదనలు వినిపించారు. 13 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులు సునీత, విక్టర్‌బాబుకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

తొలి రోజు 213 మంది సర్టిఫికెట్ల పరిశీలన



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాల్లో ప్రవేశాల కోసం ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన పాలిసెట్-2023 ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. బెంజ్‌సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 60 మంది, గుణదల లోని ఆంధ్ర లయోల కాలేజీలో 83 మంది, మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలోని కేంద్రంలో 70 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. తొలి రోజు మూడు కేంద్రాల్లో 213 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి అయినట్లుగా అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రం అందచేశామని పాలిసెట్-2023 ఎన్టీఆర్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.విజయసారథి తెలిపారు. పాలిసెట్-2023లో పరీక్షలో 399వ ర్యాంకు పొందిన విద్యార్థి పి.బాల భగత్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని కేంద్రానికి హాజరై సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారు. ఆ విద్యార్థికి విజయసారథి సర్టిఫికెట్ల పరిశీలించి ధ్రువీకరణపత్రం అందచేశారు.

నేటి షెడ్యూల్ ఇదే...

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని ఏర్పాటు చేసిన కేంద్రంలో 12,001 నుంచి 17 వేల ర్యాంకు వరకు, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 17,001 నుంచి 22 వేల ర్యాంకు వరకు, ఆంధ్రా లయోలా కళాశాల ఆవరణలోని కేంద్రంలో 22,001 నుంచి 27 వేల ర్యాంకు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్లను మంగళవారం పరిశీలిస్తామని విజయసారథి తెలిపారు.

తల్లిదండ్రుల ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి జైలు

విజయవాడ స్పోర్ట్స్: తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన కుమారుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మి సోమవారం తీర్పు చెప్పారు. విజయవాడ కృష్ణలంక ప్రాంతానికి చెందిన వృద్ధ దంపతులు అదే ప్రాంతంలోని తమ చిన్న కుమారుడు బచ్చు వెంకటదుర్గాప్రసాద్ ఇంట్లో ఉండేవారు. దుర్గాప్రసాద్ వారిని పట్టించుకోకపోవడం, మందులు సక్రమంగా తీసుకురాకపోవడం, తరుచూ దుర్భాషలాడం, ఇంటి నుంచి వెళ్లిపోవాలంటూ విసుక్కోవడంతో 2017 జూలై పదో తేదీన ఆత్మహత్య చేసుకోవాలని వృద్ధ దంపతులు నిర్ణయించుకుని, అల్లుడుకి ఫోన్ చేసి చెప్పారు. అనంతరం ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కృష్ణలంక పోలీసులు నిందితుడు దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ జి.కల్యాణి కోర్టులో వాదనలు వినిపించారు. 13 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకట దుర్గాప్రసాద్‌కు జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పేదల కళ్లల్లో ఆనందాల హరిఇల్లు

నిడమర్రు లే అవుట్‌లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



నిడమర్రు లే అవుట్‌లో ఇళ్ల స్థలాల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఆర్డీఏ పరిధిలోని అమరావతి ప్రాంతంలో నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరబోతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూములను చూసి లబ్ధిదారుల కళ్లలో ఆనందం వెల్లివిరిసిందన్నారు. సీఆర్డీఏ పరిధిలోని అమరావతిలో ఆర్-5 జోన్‌లో ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు సోమవారం నిడమర్రు లేఅవుట్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ పట్టాలను పంపిణీ చేశారు. తొలుత సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన 2,924 మంది లబ్ధిదారులను 100 బస్సుల్లో లే అవుట్ వేసిన నిడమర్రు గ్రామానికి తరలించారు. బీఆర్టీఎస్ రోడ్డులో కలెక్టర్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అక్కడకు చేరుకుని లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలను స్వయంగా చూపించారు. నిడమర్రు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. సీఆర్డీఏ ప్రాంతంలో పేద ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు కేటాయించడం చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. ఆర్-5 జోన్‌లో 737 ఎకరాల విస్తీర్ణంలో 14 లేఅవుట్ల ద్వారా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సుమారు 27,031 మంది పేద మహిళలకు వారి పేరుతో పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వారిలో సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన 2,924 మంది లబ్ధిదారులు ఉన్నారని, వీరికి కేటాయించిన భూమిని చూపించామని వివరించారు.

పారదర్శకంగా పట్టాల పంపిణీ

లబ్ధిదారులకు కేటాయించిన భూముల్లో జియో ట్యాగింగ్ చేసి పారదర్శకంగా పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. మంగళవారం మరో 6,700 మంది, 31వ తేదీన నాలుగు వేల మంది లబ్ధిదారులకు వారికి కేటాయించిన భూములను చూపించి పట్టాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. వారం రోజుల్లో స్థలాలు మంజూరైన ప్రతి ఒక్కరికీ పట్టాలను పంపిణీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. లేఅవుట్లలో రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు లబ్ధిదారులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వంటి మౌలిక వసతులను కల్పిస్తామని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. నగరంలో సొంత ఇల్లు లేక, ఇంటి అద్దె చెల్లించలేని పరిస్థితుల్లో అనేక కుటుంబాలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వారి ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి నిరుపేద అక్కచెల్లెమ్మలకు రాజధాని ప్రాంతంలో స్థలాలను కేటాయించారని పేర్కొన్నారు. స్థలాల కేటాయింపుతో పేదల సొంత ఇంటి కల నెరవేరబోతోందన్నారు. నిరుపేదలను అన్ని విధాల ఆదుకోవాలనే దృక్పథంతో ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రస్థానాన నిలిచారని కొనియాడారు. సీఆర్డీఏ పరిధిలో లక్షలాది రూపాయల విలువగల భూములను పేదలకు కేటాయించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డెప్యూటీ మేయర్ అవుతూ శ్రీ శైలజారెడ్డి, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్, తహసీల్దార్ సీహెచ్.దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా రైతులకు భరోసా ఇవ్వాలి

- ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలి
- వ్యవసాయ సలహామండలి సమావేశంలో కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు.
చిత్రంలో జేసీ అపరాజిత సింగ్, సలహామండలి చైర్మన్ జన్ను రాఘవరావు, వ్యవసాయాధికారి విజయభారతి

చిలకలపూడి(మచిలీపట్నం): రైతులకు భరోసా కల్పించినప్పుడే రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ఆశయం నెరవేరుతుందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ పుహాలులో సోమవారం సాయంత్రం జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. తొలుత గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు తదితర అంశాలపై కలెక్టర్ చర్చించారు. అనంతరం రాజాబాబు మాట్లాడుతూ.. రైతులకు ఎక్కడా ఎలాంటి సమస్యలూ రాకుండా చూడాలన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు పంట రుణాలు అందించడానికి బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభంకానున్న నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులను నిత్యం కలుస్తూ వారి ప్రయోజనాలను కాపాడటమే పరమావధిగా పనిచేయాలని స్పష్టంచేశారు. ముఖ్యంగా రైతులు వివిధ పంటలకు సంబంధించి నాణ్యతతో కూడిన విత్తనాలు ఎంపిక చేసుకునేలా చూడాలన్నారు. ఏ రకం పంటకు ఎలాంటి విత్తనాలు వేస్తే అధిక దిగుబడులు వస్తాయో వివరించాలన్నారు. నకిలీ విత్తనాలతో రైతులు ఎక్కడ నష్టపోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఎరువుల విషయంలో రైతులు అనవసర ఆందోళనకు గురి కావద్దని సూచించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని వారికి స్పష్టమైన భరోసా కల్పించాలన్నారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందుతున్నారని, జిల్లా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా యూరియా ఎరువులను సరఫరా చేసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు, జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు పట్టపు శ్రీనివాసరావు (నాని), శ్రీకాకోళపు నాగేశ్వరరావు (బాబు), సామర్ల రామచంద్రరావు, పెన్నేరు ప్రభాకరరావు, పెరుమాళ్లు, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయభారతి, డీడీ మనోహరరావు, ఏడీ మణిధర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయిరాం, నాబార్డు డీడీఎం మిలింద్ చౌసాల్కర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి చంద్రశేఖరరావు, ఏపీఎంఐపీ పీడీ విజయలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, మార్క్‌ఫెడ్ డీఎం మురళీకిషోర్, ఏపీ సీడ్స్ డీఎం జె.అనిత, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బడుగు జీవులపై మృత్యు పంజా

- త్రిపురాంతకం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరొకరు మృతి
- ఐదుకు చేరిన మృతుల సంఖ్య
- మరొకరి పరిస్థితి విషమం



తంబి రాజు (ఫైల్)



పిల్లి చంద్రశేఖర్ (ఫైల్)



పిల్లి శ్రీను (ఫైల్)



గ్రంధి వెంకటసాయి (ఫైల్)



ప్రమాద స్థలంలో కారు, బస్సు

యర్రగొండపాలెం(ప్రకాశం): బడుగు జీవితాలపై మృత్యువు పంజా విసిరింది. చేతి వృత్తుల్లో కాయకష్టం చేసుకొని ఏ పూటకు ఆ పూట కుటుంబాలను నెట్టుకొస్తున్న ఐదుగురిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. తాము పడిన కష్టానికి ఫలితాన్ని తీసుకొస్తామని ఇంట్లో చెప్పి సుదూర ప్రాంతానికి వెళ్లిన ఆ యువకులు విగతజీవులుగా మారిన ఘటన వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. తెల్లవారు జామునే ఇంటికి వస్తామని చెప్పిన వారి జీవితాలు తెల్లారిపోయాయి.

మేదర పనులు చేసుకొని జీవించే ఐదుగురు యువకులు మృతి చెందడం విజయవాడలోని ప్రకాష్‌నగర్ కన్నీటి పర్యంతమైంది. మృతులందరూ వరుసకు బావ బావ మరుదులు. వారు కొబ్బరి ఆకులతో డెకరేషన్ మెటీరియల్ సప్లయ్ చేస్తుంటారు. ఈ క్రమంలో డెకరేషన్ మెటీరియల్‌కు సంబంధించి తమకు రావాల్సిన డబ్బుల కోసం విజయవాడకు చెందిన తంబి రాజు, పిల్లి చంద్రశేఖర్, పిల్లి శ్రీను, గ్రంధి వెంకటసాయి, కొయన రాజు, భవాని శంకర్ ఈ నెల 27వ తేదీన కారులో అనంతపురం వెళ్లారు. మరుసటి రోజు ఆదివారం మధ్యాహ్నం కారులో విజయవాడకు తిరుగు పయనమయ్యారు. రాత్రి 10.30 గంటల సమయంలో త్రిపురాంతకం ఊరి వెలుపల ఉన్న జాతీయ రహదారిపై ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నుంచి దిగుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. వాస్తవంగా హిందూపురం వెళ్లే ఈ బస్సు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి అక్కడి నుంచి నేరుగా వెళ్లాల్సి ఉంది. అయితే త్రిపురాంతకానికి సంబంధించిన ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో గమ్యానికి తొందరగా చేరుకోవటానికి డ్రైవర్ ఆ బస్సును ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి మళ్లించాడు. అనుకోకుండా ఎదురైన ఈ బస్సును కారు ఢీకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో తంబి రాజు, పిల్లి చంద్రశేఖర్, పిల్లి శ్రీను, గ్రంధి వెంకటసాయి, కొయన రాజు మృతి చెందగా, భవానీశంకర్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. రాత్రి 9 గంటల సమయంలో తన అన్న వెంకటసాయి ఫోన్‌చేసి తెల్లారేలోపు ఇంటికి చేరుతామని చెప్పాడని, గంటన్నర తరువాత వారు ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైందని తెలిసిందని దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశాడు. శివనాగేంద్ర, సింహాచలం కూడా ఆ కారులో ప్రయాణం చేయాల్సి ఉంది. అయితే వేరే పనుల నిమిత్తం వారు అనంతపురం వెళ్లలేదు. దీంతో వారు ప్రమాదం బారినపడలేదు.

వీధిన పడిన చిన్న కుటుంబాలు

తంబి రాజు, పిల్లి చంద్రశేఖర్, పిల్లి శ్రీను, గ్రంధి వెంకటసాయి, కొయన రాజు మృతితో వారి కుటుంబాలు వీధినపడ్డాయి. తంబి రాజు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అన్నతో పాటు కాయకష్టం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య మంగ ఉంది. రాజు మృతితో మంగ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. పిల్లి చంద్రశేఖర్‌కు వివాహం కాలేదు. అయితే వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు జానకిరాం, శారద అతనిపై ఆధారపడి జీవిస్తున్నారు. చేతికి అందొచ్చిన కుమారుడు ఇకలేడని తెలుసుకున్న జానకిరాం, శారద తల్లడిల్లిపోతున్నారు. పిల్లి శ్రీనుకు భార్య సత్య, ఎనిమిదేళ్ల కుమార్తె, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. అతని తల్లిదండ్రులు మహేష్, లక్ష్మిలు సైతం వైర్ కుర్చీలు అల్లుకుంటూ వచ్చిన అరకొర డబ్బులతో కుమారుడి సంపాదనను తోడు చేసుకొని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. శ్రీను మృతితో కుటుంబ సభ్యులు భోరుమంటున్నారు. గ్రంధి వెంకటసాయికి భార్య విజయ, తల్లిదండ్రులు మహాలక్ష్మి, దాలయ్య ఉన్నారు. అల్లకం పనులు చేసుకుంటూ అతని కుటుంబం జీవనం సాగిస్తోంది. విజయవాడలోని ఆస్పత్రిలో మృతి చెందిన కొయన రాజుకు భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. తన భర్త ఇక రాడని తెలిసిన మృతుడి భార్య కన్నీటి పర్యంతమైంది. అతని రెండేళ్ల కుమారుడు కూడా నాన్న.. నాన్న అంటూ గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. వినుకొండ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న ఆరి భవానీ శంకర్‌కు వివాహం కాలేదు.

భవనంపై నుంచి పడి కార్మికుడు దుర్మరణం

పెనమలూరు: మండలంలోని కానూరులో నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి కార్మికుడు పడి మృతి చెందాడు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్ బాబు కథనం మేరకు.. తాడిగడపకు చెందిన దాసరి బ్రహ్మం(50) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం సాయంత్రం కానూరులో నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్తులో బ్రహ్మం సెంట్రింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడి దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య మణి ఉంది. అతనికి పిల్లలు లేరు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఖబరస్తాన్ విషయంలో వివాదం

- ముగ్గురు వ్యక్తులపై సుత్తితో దాడి
- ఒకరి పరిస్థితి విషమం



గాయాలపాలైన చోటేబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఖబరస్తాన్ ఏర్పాటు విషయంలో తలెత్తిన వివాదం దాడికి దారితీసింది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఈ దాడిలో ఓ వర్గానికి చెందిన ముగ్గురిపై మరో వర్గంవారు సుత్తితో దాడి చేశారు. చిలకలపూడి పోలీసుల కథనం మేరకు.. నవీన్‌మిట్టల్ కాలనీలో ఖబరస్తాన్ ఏర్పాటుకు సంబంధించి రెండు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలో ఇరువర్గాలు దూషణలకు పాల్పడ్డాయి. ఓ వర్గం వారు ఇనుపరాడ్లతో దాడి చేయడంతో స్థానిక ఇంగ్లిష్‌పాలెంనకు చెందిన రిజ్వాన్, బాజీ, చోటేబాబు గాయపడ్డారు. వారిని మచిలీపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాజీ, చోటే బాబు పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ తరలించినట్లు పోలీసులు తెలిపారు. తమపై కర్మతుల్లా, మూబిన్, రోషన్ మరికొందరు దాడి చేశారని రిజ్వాన్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సహకార భూమి లోగో ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సహకార రంగం ఒకప్పుడు రాజకీయాలను శాసించే దశలో ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోయినా నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సహకార వ్యవస్థకు సహకారభూమి పక్షపత్రిక నూతన జవసత్వాలు అందించాలని సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సూచించారు. విజయవాడ శ్యామ్‌నగర్ ఎన్జీవో కాలనీలోని సహకార భూమి కార్యాలయంలో సోమవారం ఆయన సహకారభూమి లోగోను ఆవిష్కరించారు. సభకు సహకారభూమి వ్యవస్థాపక అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనాథ్ రెడ్డి సహకారభూమి కార్యాలయం ముందు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పరస్పర సహకారంతోనే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సహకార రంగానికి జవసత్వాలు కల్పించేందుకు ఈ పత్రిక ఉపయోగపడాలని కోరారు. సహకార ధర్మపీఠం సంపాదకులు, సహకార రంగ నిపుణుడు భూమయ్య సహకార రంగ పితామహుడు రామదాసు పంతులు చిత్రపటాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహకారభూమి వ్యవస్థాపకుడు దాసరి కేశవులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, పీపుల్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ ఎల్లారావు, సహకారభూమి పత్రిక సంపాదకులు అక్బర్ పాషా, సహకార రంగ ప్రముఖులు సాంబిరెడ్డి, వ్యవస్థాపక సభ్యులు కేవి కృష్ణ, కేఎస్ జ్యోతి శ్రీ, సీహెచ్ త్రినాథ్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు తమ అకాడమీ కార్యాలయంలో ప్రభుత్వ నాలుగేళ్ల పరిపాలన–తీరుతెన్నులు అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఏపీ సీ.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంసీ.దాస్, మీడియా అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

4న గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం పౌర్ణమి గిరి ప్రదక్షిణను జూన్ 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు దుర్గగుడి ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు.

చంద్రబాబు హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు

బైక్ ర్యాలీలో దేవినేని అవినాష్



బైక్ ర్యాలీలో పాల్గొన్న దేవినేని అవినాష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహానాడులో చంద్రబాబునాయుడు ప్రకటించిన ఎన్నికల హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. మోసపూరిత హామీలతో బాబు మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అవినాష్ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ జరిగింది. ఏలూరు రోడ్డు చుట్టుగుంట సెంటర్‌లో మొదలైన బైక్ ర్యాలీ విశాలాంధ్ర రోడ్డు, నైస్ బార్ జంక్షన్ మీదుగా ఏఎస్ రామారావు రోడ్డు, సిద్ధార్థ జంక్షన్, సున్నపుబట్టీల సెంటర్, క్రీస్తురాజపురం రోడ్డు మీదుగా గుణదలలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయం వరకు జరిగింది.
అవినాష్ మాట్లాడుతూ 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు పేదలకు ఏం చేశారని ప్రశ్నించారు. జగన్ నాయకత్వానికి ప్రజలందరూ మద్దతు ఇస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌తోనే ఉన్నారని రాబోయే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. పార్టీ నాయకులు కడియాల బుచ్చిబాబుతో పాటు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వీఎంసీ కో–ఆప్షన్ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఎంసీ స్పందనకు 8 అర్జీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 8 అర్జీలు అందాయని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. గత వారం స్పందనలో వచ్చిన సమస్యల అర్జీల పరిష్కారానికి సంబంధించిన నివేదికను సంబంధిత అధికారులు తనకు అందించాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం – 4, రెవెన్యూ –2, ఇంజినీరింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) విభాగాలకు చెందిన ఒక్కో అర్జీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ రత్నావళి, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) శకుంతల, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్, ఏడీహెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం



కృష్ణలంకలో పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో దేవినేని అవినాష్, కార్పొరేటర్లు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వార్డు వలంటీర్ల సేవలు అమోఘమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంకలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 20, 21, 22 డివిజన్లకు చెందిన వలంటీర్లకు, పటమట, అయ్యప్పనగర్‌లోని నెహ్రూనగర్ రోడ్డులో 12, 13 డివిజన్లకు చెందిన వలంటీర్లకు సోమవారం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ప్రతి ఇంటికి పథకాలు అందించడంలో వలంటీర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. వలంటీర్లపై ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అడపా శేషు, పుప్పాల కుమారి, తాటిపర్తి కొండారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జిలు, నాయకులు మాగంటి నవీన్, రామాయణపు శ్రీనివాస్, రిజ్వాన్, బాషా, టి.పి. రెడ్డి, జోగారాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్య శాఖలో అమలులో ఉన్న కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేలా ప్రోగ్రామ్ అధికారులు పర్యవేక్షించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో వివిధ కార్యక్రమాల ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పునరుత్పత్తి శిశు ఆరోగ్యం, గర్భస్రావాలు, గర్భిణీలు, బాలింతల సేవలు, ఎన్‌సీడీ–సీడీ, కుటుంబ వైద్యుని కార్యక్రమం అమలు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లలో డేటా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నళినీదేవి, సీనియర్ పబ్లిక్‌హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, ఎన్‌సీడీ–సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, స్టాటిస్టికల్ ఆఫీసర్ లక్ష్మీజీ, డీపీహెచ్‌ఎన్‌ఓ లిడియా పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి సమావేశం సోమవారం బ్రాహ్మణ వీధికి జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో జరిగింది. చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాలక మండలి సభ్యులు, ఈవో భ్రమరాంబ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమా, ఏఈవోలు ఎస్.రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో 8 అంశాలపై చర్చ సాగింది.
దుర్గాఘాట్ వద్ద పవిత్రమైన కృష్ణానదిలోకి భక్తులు దిగి పుణ్యస్నానాలు ఆచరించేలా స్నానఘాట్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఘాట్‌లో భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదుల నిర్మాణం జరుగుతుండగా, భక్తులు స్నానమాచరించే నది పరివాహక ప్రాంతంలో పేరుకుపోయిన బురదను తొలగించేందుకు టెండర్లు ఆహ్వానించినట్లు చైర్మన్ పేర్కొన్నారు. అమ్మవారి ప్రసాదాలు, అన్నదానానికి వినియోగించే సరుకులను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేస్తామన్నారు. ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ మార్గంలో దేవస్థానం బస్సును నడపాలని పాలక మండలి నిర్ణయించింది. ఈ బస్సు ఏర్పాటు చేయడం వల్ల వన్‌టౌన్, గట్టు వెనుక ప్రాంతవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అమ్మవారి సన్నిధిలో సేవ చేసేందుకు వచ్చే భక్తులకు ఉచితంగా లడ్డూ, రెండు పులిహోర ప్రసాదాలను అందించేందుకు ఆమోదం తెలిపింది. అమ్మవారి దర్శనానికి విచ్చేసే వృద్ధులు, దివ్యాంగుల కోసం మహా మండపం దిగువన నాలుగు, కొండపై సమాచారం కేంద్రం వద్ద మరో నాలుగు, మహా మండపం 7వ అంతస్తులో మరో రెండు వీల్‌చైర్స్‌ను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు.
మహా మండపం దిగువన టోల్‌ఫ్రీ నంబర్ కార్యాలయంలో ఆర్జిత సేవా టికెట్ల విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇకపై ప్రతి రోజు నాలుగు వేల మందికి, శుక్ర, ఆదివారాలు ఐదు వేల మందికి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో సభ్యులు బుద్దా రాంబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, నంబూరి రవి, చింకా శ్రీనివాసరావు, బచ్చు మాధవీకృష్ణ, తొట్టడి వేద కుమారి, కొలుకులూరి రామసీత, అనుమోలు ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

గుండెపోటుతో మండవ మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ సేవాతత్పరుడు, ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మండవ కుటుంబరావు(67) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం సాయంత్రం గుండెనొప్పి రావటంతో ఆస్పత్రికి తరలించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. టీటీడీకి ప్రతి నెలా పది టన్నుల కూరగాయల లారీని పంపించటంతో పాటు నగరంలోని అనేక మంది దాతలను ప్రోత్సహించి కూరగాయలను పంపేవారు. నగరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. కుటుంబరావు భార్య కాశీ అన్నపూర్ణ గతంలోనే మృతి చెందారు. ఆయన కుమార్తె విదేశాల్లో ఉన్నారు. ఆమె వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

నాలుగేళ్లలో ఎంత తేడా!

నాడు

విరిగిన బెంచీలు.. బీటలు వారిన గోడలు.. పెచ్చులూడే పైకప్పులు.. వర్షం వస్తే సెలవులే.. సగం విద్యా సంవత్సరం పూర్తయ్యే దాకా అందని పాఠ్య పుస్తకాలు, అసలు పిల్లలు బడికి వస్తున్నారో లేదో పట్టించుకోని పరిస్థితి. ఇదీ నాలుగేళ్ల క్రితం వరకు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి.

నేడు

ప్రస్తుతం అందమైన భవనాలు.. పిల్లల కోసం డబుల్ డెస్క్ బెంచీలు.. డిజిటల్ తరగతి గదులు.. ద్విభాషా పాఠ్య పుస్తకాలు.. ఇంగ్లిష్ ల్యాబ్‌లు, ఆర్వో నీరు.. పరిశుభ్రంగా ఉండే మరుగుదొడ్లు.. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే రెండు జతల యూనిఫారం, బూట్లు, బెల్టు, పుస్తకాలు పెట్టి స్కూలు బ్యాగు అందజేత.. అన్నింటికీ మించి పిల్లలను బడికి పంపించే తల్లుల ఖాతాలో ఏటా రూ.15 వేల కానుక.



వస్తున్నారు టాపర్లు



మారిన సర్కారు బడి.. మురిసిన చదువుల తల్లి

విద్యా సంస్కరణల కోసం రూ.59,173.72 కోట్ల వ్యయం

- మనబడి నాడు-నేడుతో మారుతున్న ప్రభుత్వ స్కూళ్ల రూపు రేఖలు
- 292 ఉన్నత పాఠశాలలు హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్
- 352 కేజీబీవీల్లో +2 బోధన అమలు
- 679 మండలాల్లో బాలికల కోసం ఒక జూనియర్ కళాశాల
- 3 నుంచి 10 తరగతుల విద్యార్థులకు సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో బోధన
- ప్రతి తరగతి గదికి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలు
- జగనన్న విదేశీ విద్యా దీవెన కింద 1,858 మందికి మేలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ఇప్పటి దాకా 2019–23 మధ్య విద్యా రంగంలో పలు ప్రగతిశీల మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ సంస్థలను తలదన్నేలా సకల సదుపాయాలతో రూపు దిద్దుకున్నాయి. 'మనబడి నాడు–నేడు' పథకంతో ప్రభుత్వ విద్యా సంస్థలు సమూల మార్పులతో సమున్నతంగా మారాయి. ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. ఒకప్పుడు ప్రభుత్వ స్కూళ్లు అంటే చులకనగా చూసే పరిస్థితి నుంచి ఇంగ్లిష్ మీడియంలో పదో తరగతి పరీక్షలు రాసి.. టాప్ మార్కులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ సంస్కరణలకు అద్దంపట్టారు. విద్యా రంగ సంస్కరణల కోసమే గత నాలుగేళ్లల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.59,173.72 కోట్లు వెచ్చించింది. ఇందులో భాగంగా జగనన్న అమ్మ ఒడి, మనబడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరు ముద్ద, పాఠ్యాంశాల సంస్కరణలు, మరుగుదొడ్ల నిర్వహణ నిధి, పాఠశాల నిర్వహణ నిధి వంటి పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే లక్ష్యంతో సమగ్ర విద్యా, పరిపాలనా సంస్కరణలు అమలు చేశారు. స్కూళ్లలో చేపట్టిన నాడు–నేడు పనులు పూర్తయి విద్యార్థులకు అందుబాటులోకి రాగా, ప్రస్తుతం రెండో దశ పనులు జరుగుతున్నాయి.

- సాక్షి, అమరావతి

విద్యపై చేసే ఖర్చు భవిష్యత్‌కు పెట్టుబడి

ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని, విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులను చూశారు. కనీస సదుపాయాలు లేక ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోయి విద్యార్థుల భవిష్యత్ ఏంటో తెలియని పరిస్థితి. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వీలుగా అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే బృహత్తర సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా నాడు–నేడు ద్వారా రూ.వేల కోట్ల నిధులతో పనులు చేపట్టారు. రాష్ట్రంలోని 45 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలను మూడు విడతల్లో అభివృద్ధి పరిచేలా కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చారు. 2019–20లో తొలి విడతగా 15,715 స్కూళ్లలో రూ.3,669 కోట్లతో కనీసం 9 రకాల మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. నీటి వసతితో మరుగు దొడ్లు, తాగునీటి సదుపాయం, మేజర్, మైనర్ మరమ్మతులు, విద్యుత్ సదుపాయం, విద్యార్థులు, టీచర్లకు డ్యూయెల్ డెస్కులు, బెంచీలు, కుర్చీలు, బీరువాలు, టేబుళ్లు వంటి ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, పాఠశాల మొత్తానికి పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్, కాంపౌండ్ వాల్ నిర్మాణం వంటి వసతులు కల్పించారు. ఆ తర్వాత కిచెన్‌షెడ్లు, అదనపు తరగతి గదులు, డిజిటల్ తరగతులు దీనికి జోడించారు. ప్రభుత్వ స్కూళ్లతో పాటు జూనియర్ కాలేజీలు, హాస్టళ్లు, భవిత కేంద్రాలు, జిల్లా విద్యా బోధనా శిక్షణ కళాశాలల(డైట్స్)తో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెస్తున్న శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లనూ నాడు–నేడులోకి చేర్చింది. స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లు, కేజీబీవీలు.. మొత్తంగా తొలివిడతలో 61,661 విద్యా సంస్థల్లో రూ.16,450.69 కోట్లతో పది రకాల సదుపాయాలు కల్పించారు. నాడు–నేడు రెండో దశలో రూ.8,000 కోట్లతో 22,344 స్కూళ్లలో పనులు చేపట్టారు.

అమ్మ ఒడి.. గోరుముద్ద.. విద్యా కానుక

పిల్లల చదువుకు తల్లిదండ్రుల పేదరికం అడ్డురాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మ ఒడి పథకంతో అర్హురాలైన ప్రతి పేద తల్లికి ఏటా రూ.15 వేల చొప్పున ఇప్పటి దాకా రూ.19,674.34 కోట్లు తల్లులకు అందించింది. జగనన్న గోరుముద్ద పథకంతో నాణ్యమైన, రుచికరమైన పోషకాహారాన్ని మధ్యాహ్న భోజనంగా పిల్లలకు అందించేందుకు రోజుకో రకం మెనూ ప్రకటించింది. వారంలో ఐదు రోజులు గుడ్డు, మూడు రోజులు చిక్కి (వేరుశనగ, బెల్లంతో తయారీ) పిల్లలకు అందిస్తున్నారు. ఏటా ఈ కార్యక్రమానికి ప్రభుత్వం రూ.1,800 కోట్లు వెచ్చిస్తోంది. పాఠశాలల్లో పిల్లల ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు ప్రభుత్వం బోధన–అభ్యాస సామగ్రిని సరఫరా చేస్తోంది. అందుకోసం జగనన్న విద్యా కానుకగా ప్రతి కిట్‌లో ఒక బ్యాగ్, స్టిచింగ్ చార్జీతో సహా 3 జతల యూనిఫారాలు, ఒక బెల్ట్, జత షూ, రెండు జతల సాక్స్‌లు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్‌లు ఇంగ్లిష్–తెలుగు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందిస్తోంది. ప్రభుత్వం జగనన్న విద్యా కానుక కింద 47 లక్షల మంది విద్యార్థుల కోసం మూడేళ్లలో రూ.2,368.33 కోట్లు ఖర్చు చేసింది.



నాలుగేళ్లల్లో విద్యా పథకాలకు ప్రభుత్వం చేసిన ఖర్చు (రూ.కోట్లలో)

పథకం	లబ్ధిదారులు	నిధులు
జగనన్న అమ్మ ఒడి	44,48,865	19,674.34
జగనన్న విద్యా దీవెన	26,98,728	10,636.67
జగనన్న వసతి దీవెన	25,17,245	4,275.76
జగనన్న గోరుముద్ద	43,26,782	3,590.00
జగనన్న విద్యా కానుక	47,40,421	2,368.33
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	35,70,675	6,141.34
మనబడి నాడు-నేడు ఫేజ్1	15,715 స్కూల్స్	3,669.00
మనబడి నాడు-నేడు ఫేజ్2	22,344 స్కూల్స్	8,000.00
8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు	5,18,740	685.87
జగనన్న విదేశీ విద్యా దీవెన	1,858	132.41

మొత్తం వ్యయం: 59,173.72 కోట్లు

బోధన, పాఠ్య ప్రణాళికలో సంస్కరణలు

వైఎస్సార్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి, పేదింటి పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా ప్రమాణాలను తీసుకొచ్చింది. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విధానాన్ని దశల వారీగా అమలు చేస్తోంది. ఇప్పటికే 1,000 పాఠశాలల్లో సీబీఎస్ఈ అమలు చేస్తోంది. పునాది స్థాయి నుంచే విద్యా రంగాన్ని పటిష్టం చేసేలా కరికులమ్ సంస్కరణలు చేపట్టింది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలను అందిస్తోంది. ఉన్నత పాఠశాలలో పదో తరగతి పాసైన బాలికలందరూ చదువుకు దూరం కాకూడదని ప్రతి మండలంలో ఒక జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. 292 ఉన్నత పాఠశాలలను బాలికల కోసం హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. మొత్తం 352 కేజీబీవీలలో ప్లస్ 2 ప్రవేశపెట్టింది. మొత్తం 679 మండలాల్లో బాలికల కోసం కనీసం ఒక జూనియర్ కళాశాల ఉంది. కోవిడ్ అనుభవాల నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం డిజిటల్ లెర్నింగ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. అన్ని స్థాయిల్లో పాఠ్య పుస్తకాలను డిజిటల్ పీడీఎఫ్ రూపంలో ఆన్‌లైన్‌లో ఉంచడంతో పాటు 2022–23లో 8వ తరగతి విద్యార్థులకు రూ.686 కోట్లతో బైజూస్ కంటెంట్‌తో కూడిన 5.18 లక్షల ట్యాబులను ఉచితంగా అందించింది. వీటితో పాటు నాడు–నేడు మొదటి దశలో అభివృద్ధి చేసిన 15,715 పాఠశాలల్లో 30,213 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, 10,038 స్మార్ట్ టీవీలను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. జగనన్న విదేశీ విద్యా దీవెన కింద 1,858 మందికి రూ.132.41 కోట్ల లబ్ధి చేకూరింది.

అట్టడుగు వర్గాల ముందడుగు

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సింహ భాగం పదవులు

సామాజిక న్యాయ సాధనలో సీఎం జగన్ దేశానికే టార్చ్‌బేరర్

- నాలుగేళ్లుగా సామాజిక సాధికారత దిశగా చిత్తశుద్ధితో అడుగులు
- నామినేటెడ్ నుంచి కేబినెట్ దాకా సగానికిపైగా వారికే పదవులు
- సంక్షేమ పథకాల ద్వారా ఆ వర్గాల్లో పేదరిక నిర్మూలనకు చర్యలు

సాక్షి, అమరావతి: ఏపీలో బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా చేయూతనిచ్చి పేదరికం నుంచి గట్టెక్కించడం.. అమ్మ ఒడి, విద్యా దీవెన వంటి పథకాలతో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం.. నామినేటెడ్ నుంచి కేబినెట్ వరకు సింహ భాగం పదవులు ఇచ్చి పరిపాలనలో భాగస్వామ్యం ఇవ్వడం ద్వారా సీఎం జగన్ రాష్ట్రంలో సామాజిక విప్లవాన్ని ఆవిష్కరించారు. దేశంలో సామాజిక న్యాయం నినాదంతో అధికారంలోకి వచ్చిన ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన ముఖ్యమంత్రులు నాటి మాయావతి నుంచి నేటి సిద్ధరామయ్య వరకు ఎవరూ చేయని రీతిలో ఆ వర్గాలకు సీఎం జగన్ సమున్నత గౌరవం ఇచ్చి సామాజిక సాధికారత సాధన దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారని సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు. సామాజిక న్యాయ సాధనలో దేశానికే టార్చ్‌బే రర్ (మార్గదర్శకుడు)గా నిలుస్తున్నారని ప్రశంసిస్తున్నారు.

దేశానికే ఆదర్శం

నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా సీఎం జగన్ రూ.2.11 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో (డీబీటీ) జమ చేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల ఖాతాల్లోకే రూ.1,56,987.64 కోట్లు వేశారు. తద్వారా ఆ వర్గాల్లో పేదరిక నిర్మూలనకు సీఎం జగన్ బాటలు వేశారు.

చట్టం చేసి మరీ నామినేటెడ్ పదవులు

- నామినేటెడ్ పదవుల్లో 50% బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ ఆ వర్గాలకు సీఎం జగన్ పదవులిచ్చారు. ఇలా చట్టం చేయడం దేశంలో ఇదే మొదటిసారి.
- 196 వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల్లో బీసీలకు 76 పదవులు (39 శాతం) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు కలిపి 117 పదవులు (60 శాతం) ఇచ్చారు.
- వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో 137 చైర్మన్ పదవులలో 53 పదవులు (39శాతం) బీసీలకే ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకుంటే 137 పదవుల్లో 79 పదవులు (58 శాతం) ఆ వర్గాలకే ఇచ్చారు. 137 ప్రభుత్వ కార్పొరేషన్ పదవులకు సంబంధించి.. 484 నామినేటెడ్ డైరెక్టర్ పదవులుంటే అందులో 201 పదవులు బీసీలకు (41 శాతం) ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకుంటే 484 పదవుల్లో 280 పదవులు (58 శాతం) ఆ వర్గాలకే ఇచ్చారు.
- బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు, ఎస్సీలకు ప్రత్యేకంగా 3 కార్పొరేషన్లు, ఎస్టీలకు 1 కార్పొరేషన్ ఏర్పాటు చేసి.. వాటికి ఆ వర్గాల వారినే చైర్మన్లుగా నియమించారు. ఆ కార్పొరేషన్‌లలో 684 డైరెక్టర్ పదవులుంటే అవన్నీ ఆ వర్గాలకే ఇచ్చారు. ఆలయ బోర్డులు, ఆలయ చైర్మన్ పదవుల్లో సగ భాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే ఇచ్చారు. దాదాపు 7,006 ఆలయ బోర్డు మెంబర్ల పదవుల్లో సగభాగం 3,503 పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికే ఇచ్చారు.

చేతల్లో సామాజిక న్యాయం

- రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో 50 శాతం ఓట్లు సాధించి.. 151 శాసనసభ స్థానాలు (86.28 శాతం), 22 లోక్‌సభ స్థానాల్లో (88 శాతం) వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. 2019 మే 30న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్ జగన్.. 2019 జూన్ 8న ఏర్పాటు చేసిన మంత్రివర్గం నుంచే సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టారు. 25 మందితో ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 14 మందికి (56 శాతం) స్థానం కల్పించి, రాజ్యాధికారంలో సింహభాగం వాటా ఇచ్చారు.
- ఐదుగురు డిప్యూటీ సీఎంలను నియమిస్తే.. అందులో నలుగురి(80 శాతం)ని ఆ వర్గాల నుంచే నియమించారు. శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారాం, శాసన మండలి చైర్మన్‌గా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎస్సీ వర్గానికి చెందిన కొయ్యే మోషేన్ రాజు, మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా మైనార్టీ వర్గానికి చెందిన మహిళ జకియా ఖానంకు అవకాశం ఇచ్చారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి ఏకంగా 17 మందికి (70%) మంత్రివర్గంలో స్థానం కల్పించారు. మండలిలో వైఎస్సార్‌సీపీకి 43 మంది ఎమ్మెల్సీలు ఉంటే.. ఇందులో 29 మంది (68 శాతం) బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారే కావడం గమనార్హం.

స్థానిక సంస్థల్లో..

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ సీఎం జగన్ ఉత్తర్వులు జారీ చేస్తే.. వాటికి వ్యతిరేకంగా హైకోర్టులో టీడీపీ నేతలతో చంద్రబాబు కేసులు వేయించారు. దాంతో బీసీలకు రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గాయి. టీడీపీ కుట్రలు చేసి రిజర్వేషన్లు తగ్గించినా.. పార్టీ పరంగా 34 శాతం కంటే ఎక్కువగా ఇస్తానని సీఎం ప్రకటించారు. ఆ మేరకే స్థానిక సంస్థలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి సింహభాగం పదవులు ఇచ్చారు.
- 648 మండలాలకు ఎన్నికలు జరిగితే... 637 మండలాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. ఇందులో 237 మండల పరిషత్ అధ్యక్ష పదవులను బీసీలకు (38 శాతం) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి ఎంపీపీ పదవుల్లో 67 శాతం ఇచ్చారు.
- రాష్ట్రంలో 13 జిల్లా పరిషత్ చైర్మన్ పదవులలో బీసీలకు 6 (46 శాతం) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 9 జడ్పీ చైర్మన్ పదవులు (69 శాతం) ఇచ్చారు.
- రాష్ట్రంలో 14 కార్పొరేషన్‌లలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. సీఎం వైఎస్ జగన్ 14 కార్పొరేషన్ మేయర్ పదవుల్లో బీసీలకు ఏకంగా 9 పదవులు (64 శాతం) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకుంటే 14 కార్పొరేషన్ మేయర్ పదవులకుగాను 12 పదవులు (86 శాతం) ఇచ్చారు.

మహిళలకు జగన్ 'ఆసరా'

2019 ఎన్నికల నాటికి పొదుపు సంఘాల పేరిట ఉన్న అప్పు మొత్తం ప్రభుత్వమే నేరుగా మహిళలకు అందజేత

- చంద్రబాబు మోసంతో పొదుపు సంఘాల వ్యవస్థ కుదేలు
- రోజువారీ పొదుపు కార్యక్రమాలకూ దూరం
- ఎన్నికల ముందు హామీఇచ్చి ఆ తర్వాత పైసా కూడా మాఫీ చేయని బాబు
- సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక 'వైఎస్సార్ ఆసరా'తో భరోసా
- ఫలితంగా వడ్డీ, చక్రవడ్డీలతో పేద మహిళలు అప్పులపాలు
- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకానికీ మళ్లీ జీవం



సాక్షి, అమరావతి : చంద్రబాబు నయవంచనతో రాష్ట్రంలో కుదేలైన పొదుపు సంఘాల వ్యవస్థకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి జీవం పోసింది. 2019 అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఏప్రిల్ 11 నాటికి వాటి పేరిట మహిళలకు బ్యాంకుల్లో ఉన్న అప్పు మొత్తం నాలుగు విడతల్లో వారికి చెల్లించేలా 'వైఎస్సార్ ఆసరా' పథకాన్ని అమలుచేయడంతో తిరిగి ఆ వ్యవస్థ గాడిలో పడింది. మన రాష్ట్రంలోని పొదుపు సంఘాల వ్యవస్థకు ఒక ప్రత్యేకత ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పావలా వడ్డీ పథకం ప్రవేశపెట్టడంతో రాష్ట్రంలో దాదాపు ప్రతి పేదింటి మహిళ ఈ పొదుపు సంఘాల్లో సభ్యురాలైంది. రాష్ట్రంలో ఈ పురోగతిని చూసి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ పథకానికీ శ్రీకారం చుట్టింది. మరోవైపు.. వైఎస్ ఈ పథకం ప్రవేశపెట్టిన తర్వాత మహిళలు ప్రతి నెలా ఎంతోకొంత పొదుపు చేసుకోవడం.. కుటుంబ అవసరాలకు సంఘం సభ్యులు ఉమ్మడిగా బ్యాంకుల నుంచి లోను తీసుకోవడం.. తిరిగి సకాలంలో అవి చెల్లించేవారు. ఈ సమయంలో 2014 ఎన్నికల ముందు, మహిళలెవరూ డ్వాక్రా రుణాలు చెల్లించవద్దని చంద్రబాబు పిలుపునిచ్చారు. వాటిని మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. కానీ, అధికారంలోకి వచ్చాక ఒక్క పైసా కూడా మాఫీ చేయలేదు. అప్పట్లో సంబంధిత శాఖ మంత్రిగా పనిచేసిన పరిటాల సునీత ఈ వి షయాన్ని అసెంబ్లీలో లిఖితపూర్వకంగా ప్రకటించారు. దీంతో అప్పటివరకు దేశా నికి ఆదర్శంగా నిలిచిన ఏపీలో పొదుపు సంఘాల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. చంద్రబాబు మాటలు నమ్మి బ్యాంకు రుణాలు చెల్లించని మహిళలు ఆ రుణాలపై వడ్డీ, చక్రవడ్డీలు పెరిగి బ్యాంకుల వద్ద డిఫాల్టర్లుగా మారారు. చివరకు.. ఒక దశలో వారు తమ రోజువారీ పొదుపు సంఘాల కార్యక్రమాలను దూరంపెట్టారు.

సంఘాలకు జగన్ పూర్వవైభవం..

కానీ, వైఎస్ జగన్ 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు.. 'పొదుపు' మహిళల పేరిట అప్పటి వరకు ఉన్న రూ.25,517 కోట్ల అప్పును వారికే నేరుగా నాలుగు విడతల్లో చెల్లించేందుకు సీఎం హోదాలో ఆయన వైఎస్సార్ ఆసరా పథకానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే మూడు విడతల్లో మొత్తం రూ.19,178.17 కోట్లను నేరుగా ఆయా మహిళల ఖాతాల్లో ఆయన జమచేశారు. మరోవైపు.. సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించే పొదుపు మహిళలకు ప్రభుత్వం వడ్డీ చెల్లించే విధానానికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుడితే.. ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం దానికి మంగళం పాడింది. కానీ, వైఎస్ జగన్ సీఎం అయ్యాక వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టారు. దీంతో మహిళలు తిరిగి పొదుపు సంఘాల కార్యక్రమాలపట్ల ఆసక్తి పెంచుకున్నారు. అలాగే, చంద్రబాబు తీరుతో అప్పట్లో 60 శాతం పైబడి సంఘాలు సీ, డీ గ్రేడ్‌లకు పడిపోతే.. ఇప్పుడు రాష్ట్రంలో 91 శాతానికి పైగా సంఘాలు ఏ, బీ గ్రేడ్‌లో కొనసాగుతున్నాయి. ఫలితంగా దేశంలోనే అత్యధికంగా మన రాష్ట్రంలో పొదుపు సంఘాల మహిళలు 99.5 శాతం మేర తమ రుణాలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు.

ఆతిథ్య ఆంధ్ర

ఏపీ బ్రాండ్ ఇమేజ్‌తో అంతర్జాతీయ స్థాయి హోటళ్ల రాక

- ఆతిథ్య రంగంలో రూ.8 వేల నుంచి రూ.10 వేల కోట్ల పెట్టుబడులు
- ఎంవోయూలను పూర్తిస్థాయి పెట్టుబడులుగా తీసుకొచ్చేలా ఏపీటీడీసీ చర్యలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆతిథ్య రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో దేశ, విదేశీ పర్యాటకులకు ఆతిథ్యమిస్తోంది. అంతర్జాతీయ స్థాయి లగ్జరీ హోటళ్లకు పెట్టింది పేరైన ఒబెరాయ్, హయత్, తాజ్ గ్రూప్‌లతో పాటు దేశీయ సంస్థలైన గారిసన్, మేఫెయిర్ హోటళ్ల రాకతో సరికొత్త అనుభూతిని పంచనుంది. అత్యాధునిక సౌకర్యాలతో రిసార్ట్స్ (ఇండిపెండెంట్ విల్లా), స్టార్ హోటళ్ల నిర్మాణంతో అతిథ్య రంగం విస్తరించనుంది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పర్యాటక రంగానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. రాష్ట్ర పర్యాటకానికి సంబంధించి మొత్తం రూ.19,345 కోట్ల పెట్టుబడులతో 117 ఎంవోలు కుదిరాయి. వీటి ద్వారా సుమారు 51 వేల మందికి ఉపాధి లభించనుంది. ఇందులో ఇప్పటికే 45 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ)కి వచ్చాయి. ఈ పెట్టుబడుల ఒప్పందాల్లో రూ.8 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల వరకు ఆతిథ్య రంగానికి చెందినవేనని అధికారులు తెలిపారు. 20 వరకు అంతర్జాతీయ స్థాయి లగ్జరీ హోటళ్లు రాష్ట్రంలో రానున్నాయి. వీటి ద్వారా 20 వేల మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు తెలిపారు. ఇందులో రూ.4949.41 కోట్ల పెట్టుబడులకు త్వరలో అన్ని అనుమతులిచ్చి, పని ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నారు.

ఒబెరాయ్ రూ.1,350 కోట్ల పెట్టుబడి

రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో రూ.1,350 కోట్ల అంచనాతో 7 స్టార్ సౌకర్యాలతో లగ్జరీ రిసార్ట్స్ నిర్మాణానికి ఒబెరాయ్ ముందుకొచ్చింది. ఇప్పటికే విశాఖ (అన్నవరం), తిరుపతి (పేరూరు)లో నిర్మాణాలకు ఒప్పందాలు పూర్తయ్యాయి. రెండు వారాల్లోగా గండికోటలో కూడా హోటల్ నిర్మాణానికి ఒప్పందాలు చేసుకుని జూలై చివరికి పనులు ప్రారంభించనుంది. అనంతరం రాజమండ్రి (పిచ్చుకలంక), హార్సిలీహిల్స్ ప్రాంతాల్లోనూ రిసార్ట్‌లు, కన్వెన్షన్ సెంటర్లను అభివృద్ధి చేయనుంది. ఒబెరాయ్ సంస్థల ద్వారానే 10,900 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

హయత్, తాజ్ గ్రూప్ ఐదు నక్షత్రాల హోటళ్లు

తాజ్ సంస్థ విశాఖలో రూ.1050 కోట్లతో 60 ఎకరాల్లో లగ్జరీ రిసార్టులు నిర్మించనుంది. ఈ ప్రతిపాదన ప్రస్తుతం స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ పరిశీలనలో ఉంది. తాజ్ నిర్మించే టెక్నాలజీ స్పేస్‌లో రెస్టారెంట్లు, షాపులు, గేమింగ్ జోన్, రూఫ్ టాప్ హెలిప్యాడ్, ఒలింపిక్ లెంగ్త్ స్విమ్మింగ్ పూల్, జాగింగ్ ట్రాక్ రానున్నాయి. హయత్ సంస్థ విశాఖ శిల్పారామంలో రూ.200 కోట్లతో 3 ఎకరాల్లో, తిరుపతి శిల్పారామంలో రూ.204 కోట్లతో 2.66 ఎకరాల్లో ఐదు నక్షత్రాల హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చింది. వీటి ద్వారా 5,100 మందికి ఉపాధి లభిస్తుంది. ఈ సంస్థ ఇప్పటికే విజయవాడలో రూ.92.61 కోట్లతో నాలుగు నక్షత్రాల హోటల్ నిర్మించింది. ఆధ్యాత్మిక టూరిజంలో భాగంగా ఇస్కాన్ చారిటీస్ (బెంగళూరు) ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా పెనుకొండ జ్ఞానగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద రూ.100 కోట్లతో స్పిరుచ్యువల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.

మరికొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు

- ఏపీఈ అర్బన్ సంస్థ రూ.414 కోట్లతో 2,847 ఎకరాల్లో కాకినాడలో ఐదు నక్షత్రాల హోటల్‌తో పాటు కాకినాడ బీచ్ ఫ్రంట్ అభివృద్ధి
- ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ పేరూరులో రూ.218 కోట్లతో 5 ఎకరాల్లో, కడప శిల్పారామంలో 78.73 కోట్లతో రెండెకరాల్లో ఐదు నక్షత్రాల హోటళ్లు..ఎకో–ఐఎస్ఎల్ఈ రిసార్ట్స్ సంస్థ అనంతగిరి (అరకు)లో రూ.243 కోట్లతో 43.1 ఎకరాల్లో 5 స్టార్ హోటల్
- గార్రిసన్ సంస్థ యండాడ (విశాఖ)లో రూ.122 కోట్లతో 3.87 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ – హోటల్
- మైఫెయిర్ గ్రూప్ అన్నవరం (విశాఖ)లో రూ.500 కోట్లతో 50 ఎకరాల్లో రిసార్టులు
- వైష్ణోవి వెర్సటైల్ వెంచర్స్ పేరూరులో రూ.125 కోట్లతో ఐదు నక్షత్రాల హోటల్
- హిగ్గాని ఎంటర్‌ప్రైజెస్ విశాఖలో రూ.120 కోట్లతో టన్నెల్ అక్వేరియం – హోటల్
- విశాఖ తెన్నేటి బీచ్‌లో ఎంవీ మా షిప్‌ను రూ.30 కోట్లతో షోర్ రిసార్టుగా తీర్చిదిద్ద నున్నారు. శ్రీశైలంలో రూ.100 కోట్లతో రెండెకరాల్లో 3 నక్షత్రాల హోటల్, రూ.35.3 కోట్లతో రాయచోటిలో రూ.45.5 కోట్లతో కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు రానున్నాయి. వీటికి డీపీఆర్లు సిద్ధంగా ఉండగా పీపీపీ గైడ్‌లైన్స్, అగ్రిమెంట్ పనులు వేగంగా పూర్తి చేసేలా కార్యచరణ రూపొందిస్తున్నట్టు ఏపీటీడీసీ ఎండీ కె.కన్న బాబు తెలిపారు. కాగా, ప్రభుత్వంతో ఆయా సంస్థలు కుదుర్చుకున్న ప్రతి ఒప్పందం అమలయ్యేలా ప్రత్యేక కార్యచరణతో ముందుకెళ్తున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ చెప్పారు.

ఒబెరాయ్ పెట్టుబడులు ఇలా..

ప్రాంతం	పెట్టుబడి (రూ.కోట్లు)	స్థలం (ఎకరాల్లో)	విల్లాల అభివృద్ధి	ఉద్యోగాలు
అన్నవరం, విశాఖ జిల్లా	350	40	300	5,500
పేరూరు, తిరుపతి	250	20	100	1,500
గండికోట, వైఎస్సార్ జిల్లా	250	50	120	1,500
హార్సిలీ హిల్స్, చిత్తూరు జిల్లా	250	21	120	1,200
పిచ్చుకలంక, తూర్పుగోదావరి జిల్లా	250	30	150	1,200

సుజలాం.. సుఫలాం.. సస్యశ్యామలం

రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: కడలి పాలవుతున్న నదీ జలాలను ఒడిసిపట్టేందుకు దివంగత వైఎస్సార్ చేపట్టిన జలయజ్ఞాన్ని పూర్తి చేసి రైతులకు ఫలాలను అందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా శ్రమిస్తున్నారు. కరోనా ప్రతికూల పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రాధాన్యత క్రమంలో ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి, ఏలేరు జలాలను గరిష్ఠంగా వినియోగించుకోవడం ద్వారా వరుసగా నాలుగేళ్లు ఖరీఫ్, రబీలో కోటి ఎకరాలకు నీళ్లందించారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో సైతం వరుసగా నాలుగేళ్లు ఏటా కోటి ఎకరాలకు నీళ్లందించిన దాఖలాలు లేవు. టీడీపీ హయాంలో ఏటా సగటున 50 లక్షల ఎకరాలకు కూడా నీళ్లందించిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

నాడు దుర్భిక్షం.. నేడు సుభిక్షం

- టీడీపీ హయాంలో 2014–19 దుర్భిక్ష పరిస్థితులు నెలకొనగా సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక గత నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్రం సుభిక్షంగా మారింది.
- నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించడం ద్వారా పులిచింతల (45.77 టీఎంసీలు), గండికోట (26.85 టీఎంసీలు), చిత్రావతి (పది టీఎంసీలు), సోమశిల (78 టీఎంసీలు), కండలేరు(68.03 టీఎంసీలు), గోరకల్లు (12.44 టీఎంసీలు), అవుకు (4.15 టీఎంసీలు) రిజర్వాయర్లలో పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేసి ఆయకట్టుకు నీళ్లందించారు.
- తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలిగోడు రిజర్వాయర్‌లో 2019 నుంచే ఏటా గరిష్ఠ స్థాయిలో 16.95 టీఎంసీలను నిల్వ చేస్తున్నారు. ఇదే ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ మట్టికట్టకు డయాఫ్రమ్‌వాల్ ద్వారా లీకేజీలకు అడ్డుకట్ట వేసి 2020లో గరిష్ఠ స్థాయిలో 17.74 టీఎంసీలను నిల్వ చేశారు. తద్వారా తెలుగుగంగ ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకు నీళ్లందించేలా మార్గం సుగమం చేశారు.
- శ్రీశైలానికి వరద వచ్చే 30 నుంచి 40 రోజుల్లోనే రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో ప్రాజెక్టులను నింపేలా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచేలా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, కాలువలను ఆధునికీకరించే పనులను చేపట్టారు.

మహోజ్వల ఘట్టం

సాగునీటి ప్రాజెక్టులను సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యత క్రమంలో చకచకా పూర్తి చేస్తున్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో పెన్నా డెల్టా జీవనాడులైన సంగం, నెల్లూరు బ్యారేజ్‌లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి గతేడాది సెప్టెంబరు 6న జాతికి అంకితం చేశారు. ఈ రెండు బ్యారేజ్‌ల ద్వారా నెల్లూరు జిల్లాలో 4,84,525 ఎకరాల ఆయకట్టును సస్యశ్యామలం చేశారు. నెల్లూరు నగరంతోపాటు పెన్నా పరీవాహక ప్రాంతంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు.



జలాశయంగా రూపుదిద్దుకున్న పోలవరం

పోలవరం ప్రాజెక్టును సాకారం చేస్తూ మహానేత వైఎస్సార్ జలయజ్ఞంలో భాగంగా చేపట్టారు. వంద శాతం వ్యయం భరించి పోలవరాన్ని తామే పూర్తి చేస్తామని విభజన చట్టం సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. కమీషన్ల దాహంతో 2013–14 ధరలకు తామే పూర్తి చేస్తామని నాడు చంద్రబాబు చెప్పడంతో 2016 సెప్టెంబర్ 7న ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికి అప్పగించింది. ఆ తర్వాత లాభాలు వచ్చే పనులను చేపట్టి ప్రాజెక్టును చంద్రబాబు గాలికి వదిలేశారు. కమీషన్ల కోసం చంద్రబాబు ఏటీఎంలా మార్చుకున్నారని ప్రధాని మోదీ సైతం వ్యాఖ్యానించడం అందుకు నిదర్శనం. చంద్రబాబు పాపాల ఫలితంగా గోదావరి వరద ఉద్ధృతికి ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్ కోతకు గురై దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నాలుగు చోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక పోలవరాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి పనులు చేపట్టారు.


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్

మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం మద్యం మహమ్మారి నుండి కుటుంబాలను కాపాడేందుకు మీ సోదరుడిగా నేనున్నానని అక్కా చెల్లెమ్మలకు భరోసానిస్తూ... ఈ నాలుగేళ్ళలో మన ముఖ్యమంత్రివర్యులు

శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు

దశలవారీగా చేపట్టిన మద్యనియంత్రణ చర్యల ద్వారా మద్యానికి బానిసలైన కుటుంబాలలో సంతోషాలు నెలకొన్నాయి.



మద్యం / మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మద్యవిమోచన ప్రచార కమిటీని ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహణ.

పాదయాత్రలో అక్క-చెల్లెమ్మలకు ఇచ్చిన మాట పక్రారం మద్యపానం నియంత్రణ విషయంలో గత ప్రభుత్వానికి - జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడాలు..

గత ప్రభుత్వంలో	జగనన్న ప్రభుత్వంలో
గత ప్రభుత్వ హయాంలో 4,380 మద్యం దుకాణాలు ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉండేవి.	జగనన్న అధికారం చేపట్టగానే (2019 అక్టోబర్ 1 నుండి) మద్యం దుకాణాలన్నీ ప్రభుత్వపరం చేసి 2,934కు కుదింపు..
గత ప్రభుత్వం ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుబంధంగా 43,000 బెల్ట్ దుకాణాలు నిర్వహణ.	జగనన్న ప్రభుత్వం రాగానే బెల్ట్ దుకాణాలన్నీ పూర్తిగా తొలగించడం జరిగింది. మద్యం అందుబాటును దూరం చేశాం.
గత ప్రభుత్వ హయాంలో ప్రతి మద్యం షాప్‌నకు అనుబంధంగా పర్మిట్ రూంలు ఉండేవి.	జగనన్న ప్రభుత్వంలో పర్మిట్ రూంలు నిషేధించబడినవి.
గత ప్రభుత్వ హయాంలో మద్యవినియోగం ప్రోత్సహించే చర్యలతో విక్రయాలు విపరీతంగా ఉండేవి.	ప్రస్తుతం మద్యం దుకాణాలు, అందుబాటు సమయం తగ్గింపు, ధరలు పెంపు వంటి చర్యల వల్ల విక్రయాల సంఖ్య గణనీయంగా తగ్గింది.
గత ప్రభుత్వంలో ఉదయం 10 గం.ల నుంచి రాత్రి 11.00 గం.ల వరకు విక్రయాలు సాగించేవి. అనధికారికంగా 24 గంటలు విక్రయిస్తూ ఉండేవాళ్ళు.	జగనన్న ప్రభుత్వంలో ఉదయం 11 గం.ల నుంచి రాత్రి 9 గం.ల నిర్ణీత సమయంలో మాత్రమే విక్రయాలకు అనుమతి.
గత ప్రభుత్వ విధానాలతో ప్రజల జీవన, ఆరోగ్య ప్రమాణాలు దెబ్బతినే విధంగా ఉండేవి.	ప్రజల జీవన, ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపరిచే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో వినియోగ స్థాయిలు తగ్గించేందుకు ప్రభుత్వం



అక్రమ మద్యం, రవాణా పై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక హెల్ప్ లైన్ **14500**

జగనన్న ప్రభుత్వం మద్యనియంత్రణలో భాగంగా తీసుకున్న చర్యలవల్ల గత ప్రభుత్వం (2018-19 సంవత్సరం) లో జరిగిన మద్యవినియోగం (కేసులు అమ్మకం)తో పోల్చుకుంటే.. 2022-23 సంవత్సరానికి IML 13%, బీరు వినియోగం సగానికి పైగా అంటే 58% తగ్గింది.


లక్షలాది కుటుంబాల్లో వెలకట్టలేని సంతోషాలు



ప్రపంచస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా మద్యం నాణ్యతను నిర్ధారించడానికి సుమారు రూ. 10కోట్లకు పైగా ఖర్చుతో 5 ఎక్సైజ్ ల్యాబ్‌లు ఆధునికీకరించబడ్డాయి.

ప్రత్యామ్నాయ జీవనోపాధి - 28.05.2023 నాటికి గుర్తించిన కుటుంబాలు మరియు పంపిణీ చేసిన రుణాలు
28.05.2023 నాటికి అక్రమ మద్యం తయారుచేయడానికి అవకాశం వున్న గ్రామాల సంఖ్య **141**
ప్రత్యామ్నాయ జీవనోపాధి కొరకు గుర్తించిన కుటుంబాల సంఖ్య **3349**
ప్రత్యామ్నాయ జీవనోపాధి పొందిన కుటుంబాల సంఖ్య **1696**
ఇప్పటివరకు వస్తువులు / పంపిణీ చేయబడిన మొత్తము రూ. **12,79,73,800**

డ్రగ్స్‌తో చెలగాటం - ప్రాణానికి సంకటం



మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

మద్యం వద్దు ... ఆరోగ్యం ముద్దు ...